www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 22-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 175

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం; శుక్లపక్షం, తిథి: పాడ్యమి రా.2.55 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తర ఉ.11.24 తదుపరి హస్త; వర్జ్యం: రా.8.35-10.20; దుర్ముహూర్తం: మ.12.31-1.19, మ.2.55-3.43; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.07

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


అభిషేక్ శర్మ

## పాక్‌కు 'సూపర్' పంచ్..!

ఆసియా కప్ సూపర్-4లో ఆరు వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం

12

172 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన భారత్

బ్యాటింగ్‌లో అదరగొట్టిన అభిషేక్, గిల్, తిలక్

## కేఏ పాల్‌పై లైంగిక వేధింపుల కేసు

ఆయన కార్యాలయంలో పనిచేసే యువతి ఫిర్యాదు

పాల్ తనని వేధిస్తున్నారంటూ షీ టీమ్స్‌ను ఆశ్రయించిన బాధితురాలు



పంజాగుట్ట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. పాల్ తనను లైంగిక వేధింపులకు గురి చేశారంటూ ఆయన కార్యాలయంలో పని చేసే ఓ యువతి పాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కార్యాలయంలో ఓ యువతి ఆగస్టు 28న అమెరికన్ కో-ఆర్డినేటర్‌గా ఉద్యోగంలో

మిగతా 11వ పేజీలో...



## 70 ఏళ్లుగా వాళ్లు చేస్తే రైటు.. మేం చేస్తే తప్పా?

ఈవీఎంల హ్యాకింగ్‌పై ఢిల్లీ సీఎం రేఖా గుప్తా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: "డెబ్బై సంవత్సరాలుగా వాళ్లు (కాంగ్రెస్) ఈవీఎంలను హ్యాక్ చేస్తున్నారు. అప్పుడేం కాలేదు. మేం చేస్తే తప్పుగా అనిపిస్తోంది" ..ఢిల్లీ సీఎం రేఖా గుప్తా చేసిన వ్యాఖ్యలివి! ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు ఈవీఎంలను హ్యాక్ చేస్తున్నారని రాహుల్‌గాంధీ అంటున్నారు కదా?" అనే ప్రశ్నకు రేఖా గుప్తా ఇలా బదులిచ్చారు. "వాళ్లు గెలిస్తే ప్రజాతీర్పు

మిగతా 2వ పేజీలో...

## నన్ను కుటుంబానికి దూరం చేసినోళ్ల భరతం పడతా

భవిష్యత్తులో నా జన్మభూమే నాకు కర్మ భూమి కావొచ్చు

సిద్దిపేట, చింతమడక ఎవరి సొత్తు కాదు

గతంలో ఇక్కడికి రావాలంటే కేజీఎఫ్‌లా ఆంక్షలుండేవి

ఇకపై ఆంక్షలు పెడితే మళ్లీ మళ్లీ వస్తా

11

తన స్వగ్రామం చింతమడకలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



# ప్రత్యేక జీవోతోనే..

## స్థానిక ఎన్నికలకు సర్కారు సిద్ధం.. దశమిలోపు షెడ్యూల్




రిజర్వేషన్లను ఖరారుచేసి రేపు సాయంత్రానికి పూర్తిస్థాయి నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

బీసీ రిజర్వేషన్ల ఖరారు 2024లో చేసిన కులగణన మేరకు!

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఖరారు 2011 జనాభా లెక్కల ప్రకారం

100% ఎస్సీ, ఎస్టీలున్నచోట వారికే.. అందులో 50% స్త్రీలకు

సర్కారు పచ్చజెండా ఊపగానే రిజర్వేషన్ల ప్రకటన

జడ్పీ సీఈవోలు, ఆర్డీవో, ఎంపీడీవోలతో నేడు కలెక్టర్ల భేటీ

ఒకటి, రెండ్రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక జీవోతోనే వెళ్లేందుకు సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూలును కూడా దశమిలోపే విడుదల చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ మేరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేయనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. బీసీల రిజర్వేషన్ల వ్యవహారంపై కేంద్రం ఎటూ తేల్చకపోవడంతో.. పెంచిన రిజర్వేషన్లను అమలుచేసేందుకు వీలుగా పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285(ఏ)లో చేసిన సవరణలతో జీవో జారీ చేసేందుకు సర్కారు సిద్ధమైనట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక నివేదికను రెండు రోజుల క్రితం నిర్వహించిన సమావేశంలో సీఎం, మంత్రులు పరిశీలించినట్టు సమాచారం. విజయదశమిలోగా షెడ్యూలు విడుదలకు వీలుగా.. వార్డులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్మన్‌ల ఎన్నికకు అవసరమైన రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని, రెండు రోజుల్లోగా వాటిని ఖరారు చేసి పంపాలని జిల్లాల కలెక్టర్లకు సర్కారు ఆదేశాలిచ్చింది.

| రాష్ట్రంలో మొత్తం ఓటర్లు | |
|---|---|
| | 1,67,03,168 |
| మహిళలు | 85,35,932 |
| పురుషులు | 81,66,732 |
| ఇతరులు | 504 |

పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, ఆ శాఖ డైరెక్టర్ సృజనలతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రధానమైన రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి కీలక సూచనలు చేసి.. పూర్తిస్థాయి నివేదికలను రూపొందించాలని.. ఖరారు చేసిన రిజర్వేషన్ల స్థానాల వివరాలన్నింటినీ సీల్డ్ కవర్‌లో ఉంచి, నివేదికలను మంగళవారం సాయంత్రానికల్లా ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెల్లడించిన వెంటనే ఆయా స్థానాల వారీగా ఖరారు చేసిన రిజర్వేషన్లను జిల్లాల వారీగా ప్రకటించేలా అన్ని ఏర్పాట్లూ చేసుకోవాలని కూడా కలెక్టర్లకు సూచించారు.

### భేటీలకు పిలుపు..

స్థానిక ఎన్నికలు, రిజర్వేషన్ల ఖరారుపై సూచనలు అందడంతో కలెక్టర్లు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు సబ్ కలెక్టర్లు, జిల్లా పరిషత్ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), ఎంపీడీవోలతో సోమవారం ఉదయం సమావేశాలను

మిగతా 13వ పేజీలో...



నేటి నుంచి జీఎస్టీ ఉత్సవం ప్రారంభం కాబోతోంది. దేశంలో కొత్త చరిత్ర మొదలవుతోంది. సంస్కరణ అనేది నిరంతర ప్రక్రియ. కాలం మారుతున్న కొద్దీ, దేశ అవసరాల దృష్ట్యా కొత్త సంస్కరణలు అవసరం. అందుకే.. జీఎస్టీ 2.0ను ప్రవేశపెట్టి మరో చరిత్రకు నాంది పలికాం

- ప్రధాని నరేంద్ర మోదీ

# జీఎస్టీ జోష్..!

## నేటి నుంచే పన్నుల తగ్గింపు అమలు

భారీగా తగ్గనున్న వస్తువుల ధరలు

నిత్యావసర వస్తువుల నుంచి కార్ల దాకా

ఔషధాల నుంచి టీవీల దాకా ధర తగ్గింపు

ఇప్పటికే తగ్గింపును ప్రకటించిన కంపెనీలు

తమ డీలర్లకు కొత్త ధరల పట్టిక చేరవేత

ధరల తగ్గుదలతో దేశ ప్రజల్లో హర్షాతిరేకాలు

శరన్నవరాత్రుల ప్రారంభం రోజే సంబరాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దసరా నవరాత్రి ఉత్సవాలు.. దేశ ప్రజలకు ఈసారి సంబరాలు తెచ్చాయి. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు సోమవారం నుంచే అమలులోకి రానున్నాయి. ఆహార పదార్థాల నుంచి గృహోపకరణాలు, బైక్‌ల నుంచి కార్లు, ఎయిర్ కండీషనర్ల నుంచి టీవీల దాకా అన్ని వస్తువుల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని జీఎస్టీ కౌన్సిల్ ఈ నెల మొదటి వారంలో ఆమోదించిన పన్ను శ్లాబుల తగ్గింపు ఆచరణలోకి రానుంది. ఇప్పటి దాకా 5, 12, 18, 28 శాతంతో నాలుగు శ్లాబులుగా అమల్లో ఉన్న జీఎస్టీ పన్ను.. పేద, మధ్య తరగతి

మిగతా 2వ పేజీలో...

### నవ శకం ఆరంభం

- నేటి నుంచి దేశంలో జీఎస్టీ పొదుపు ఉత్సవం
- జీఎస్టీ 2.0తో పేద, మధ్య తరగతికి డబుల్ బొనాంజా
- కొత్త సంస్కరణలతో ఆత్మనిర్భరత, వేగంగా దేశాభివృద్ధి
- ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించండి
- జాతినుద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ సందేశం

2




## హెచ్-1బీ రుసుము ఒక్కసారే!

కొత్త వీసాదారులకు మాత్రమే

ప్రస్తుత వీసాదారులకు వర్తించదు

రెన్యువల్స్‌కు కూడా రుసుము ఉండదు

హెచ్-1బీ వీసాదారులు అమెరికా నుంచి రాకపోకలు సాగించవచ్చు

లక్ష డాలర్ల ఫీజుపై శ్వేతసౌధం వివరణ

భారతీయులకు అత్యవసర హెల్ప్‌లైన్

వాషింగ్టన్, సెప్టెంబరు 21: అమెరికాలో ఐటీ, ఇతర ప్రత్యేక నైపుణ్య ఉద్యోగాలు చేయడానికి అవసరమైన హెచ్1బీ వీసాలకు లక్ష డాలర్ల రుసుమును విధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోగా.. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులపై ఈ నిబంధన తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ క్రమంలో లక్ష డాలర్ల రుసుముపై శ్వేతసౌధం వివరణ ఇచ్చింది. ట్రంప్ తీసుకొచ్చిన కొత్త నిబంధనపై శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ 'ఎక్స్'లో స్పష్టత ఇచ్చారు. హెచ్-1బీ వీసాపై

మిగతా 9వ పేజీలో...

### అమెరికా టికెట్ల ధర పెరుగుదల.. ఓ భారీ కుట్ర!

9

విమాన సీట్లను బ్లాక్ చేసి కృత్రిమ డిమాండ్ సృష్టించిన మాగా, 4చాన్

భారతీయుల్ని అడ్డుకునేందుకు పన్నాగం

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై నేడు భారత్-అమెరికా చర్చలు

## రెండున్నర రెట్లు పెరిగిన ఖర్చు

జీతాలు, పెన్షన్లు, రుణ చెల్లింపులకే రాష్ట్రాల సొమ్ములన్నీ ఖతం



వీటిపై పదేళ్లలో భారీగా పెరిగిన వ్యయం

మొత్తం రెవెన్యూ ఖర్చులో దాదాపు సగం

వీటికి రాయితీలు, గ్రాంట్లు అదనం

కాగ్ తాజా నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దేశంలోని అన్ని రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. గత దశాబ్ద కాలంలోనే రాష్ట్రాల రుణభారం ఏకంగా మూడు రెట్లు పెరిగిపోవడంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 2013-14 ఆర్థిక సంవత్సరం నాటికి 28 రాష్ట్రాల అప్పులు రూ.17.57 లక్షల కోట్లు ఉండగా, 2022-23 నాటికి రూ.59.60 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించింది. దీంతో పాటుగా అప్పులు, రాష్ట్రాల అభివృద్ధి అవకాశాలకు ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లపై కాగ్ తాజా నివేదికలో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. రాష్ట్రాలు ఎక్కువగా వేతనాలు, పింఛన్లు, రుణాల వడ్డీల చెల్లింపులపై అధిక భాగం వ్యయం చేస్తున్నట్లు పేర్కొంది. ఈ ఖర్చు అన్ని రాష్ట్రాల వ్యాప్తంగా పదేళ్లలో 2.49 రెట్లు పెరిగిందని

మిగతా 2వ పేజీలో...



వరంగల్‌లోని వేయి స్తంభాల దేవాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## చిత్తూచిత్తూల బొమ్మ.. శివునీ ముద్దులగుమ్మ!

రాష్ట్రవ్యాప్తంగా మొదలైన బతుకమ్మ పండగ

ఎంగిలిపూల బతుకమ్మల వద్ద మహిళల సందడి

ప్రభుత్వ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఘనంగా వేడుక

కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురం రాష్ట్ర వ్యాప్తంగా మొదలైంది. తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల, గులాబీ, బంతి పూలతో అందంగా పేర్చిన ఎంగిలి పూల బతుకమ్మల చుట్టూ.. ఏమేమీ పువ్వొప్పునే గౌరమ్మా.. ఏమేమీ కాయొ పున్నే..!!, బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో... అంటూ ఆడి, పాడిన మహిళా లోకం తొమ్మిది రోజులు పాటు సాగే బతుకమ్మ వేడుకలకు ఆదివారం అట్టహాసంగా శ్రీకారం చుట్టింది. పల్లె నుంచి పట్టణం దాకా ప్రతి ఊరిలో, ప్రతి వీధిలో పండగ శోభ

మిగతా 11వ పేజీలో...

## దంచికొట్టిన వాన

హైదరాబాద్‌లో పలు కాలనీలు జలమయం

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో పొంగిన వాగులు

రాకపోకలు బంద్.. దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి పంటలు

భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో 11.2 సెం.మీ. వర్షపాతం

పిడుగుపాట్లకు ఇద్దరు మహిళల మృతి

11

శ్రీశైలం 10 గేట్లు, సాగర్ 26 గేట్లు ఎత్తివేత

నేడూ భారీ వర్షాలు.. 25న బంగాళాఖాతంలో అల్పపీడనం



మహబూబాబాద్ జిల్లా నడివాడలో వర్షానికి నేలవాలిన మొక్కజొన్న

## 2047 తర్వాతే మోదీ రిటైర్మెంట్

రాబోయే అనేక ఎన్నికల వరకు ప్రధాని పదవి ఖాళీ ఉండదు: రాజ్‌నాథ్ సింగ్




న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంపూర్ణ విశ్వాసం ప్రకటించారు. బీజేపీలో తిరుగులేని నాయకుడు ఆయనేనని, రానున్న చాలా ఎన్నికల వరకు ఆయనే ప్రధాని అభ్యర్థి అని చెప్పారు. 2047లో భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు నిర్వహించిన తర్వాతే ఆయన రిటైర్ అవుతారని ప్రకటించారు. ఓ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ "చాలా చిన్న వాస్తవం ఏమిటంటే.. సమీప భవిష్యత్తులో ప్రధాని పదవికి ఎలాంటి ఖాళీ ఏర్పడబోదు. రానున్న ఎన్నికల్లో మోదీజీయే మా పార్టీ అభ్యర్థిగా ఉంటారు. 2029, 2034, 2039, 2044 ఎన్నికల్లోనూ ఆయనే

మిగతా 2వ పేజీలో...

## 2047 తర్వాతే మోదీ రిటైర్మెంట్

(మొదటి పేజీ తరువాయి)



మా పార్టీ అభ్యర్థి. 2047లో దేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరిగిన తరువాత ఆయన రిటైర్ అవుతారు" అని చెప్పారు. తనకు 1980 నుంచి మోదీతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలతో మమేకమయ్యే అరుదైన సామర్థ్యం ఆయనలో ఉందని ప్రశంసించారు. సంక్లిష్టమైన సమస్యలను సులువుగా పరిష్కరిస్తారని, క్లిష్ట సమయాల్లో సరైన నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ప్రపంచ సమస్యలపై ఇతర దేశాల నాయకులు సయితం ఆయన సలహాలు తీసుకుంటారని చెప్పారు. అంతమంది ప్రపంచ నాయకుల నుంచి పుట్టిన రోజు శుభాకాంక్షలు అందుకున్న మరో ప్రధానిని తాను చూడలేదని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై ప్రభుత్వం స్పందించిన తీరే మోదీ వ్యవహార శైలికి నిదర్శనమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చే ముందు ఆయన మూడు దళాల అధిపతులు, జాతీయ భద్రత సలహాదారుతో చర్చలు జరిపారని అన్నారు. 2013లో మోదీని బీజేపీ జాతీయ ప్రచార కన్వీనర్‌గా, అనంతరం ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తూ పార్టీ పార్లమెంటరీ బోర్డు ప్రకటించిన తీరును రాజ్‌నాథ్ సింగ్ గుర్తు చేసుకున్నారు. ఆ సందర్భంగా సీనియర్ నాయకుడు ఎల్.కె. అద్వానీని అగౌరవపరచలేదని, కానీ మోదీ నాయకత్వం కావాలని దేశ ప్రజలు కోరుకున్నారని తెలిపారు.

## 70 ఏళ్లుగా వాళ్లు చేస్తే రైటు.. మేం చేస్తే తప్పా?

(మొదటి పేజీ తరువాయి)



అంటారు. మేం గెలిస్తే ఈవీఎం హ్యాక్ అంటారు. ఈ ఫార్ములా ఏ పుస్తకంలో ఉందో ఎవరైనా చెబుతారా నాకు? రాహుల్‌గాంధీ దీన్ని ఎక్కడ చదువుకున్నారు? దేశప్రజలను తప్పుదోవ పట్టించడం ఆయనకు ఇంకేమైనా వచ్చా?" అని ప్రశ్నించారు. "ఢిల్లీ సీఎం ఏం చెబుతున్నారు" అంటూ.. ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆ ఇంటర్వ్యూలోని 13 సెకన్ల వీడియో బిట్‌ను 'ఎక్స్'లో పోస్ట్ చేయగా.. అది విస్తృతంగా వైరల్ అవుతోంది. అయితే.. అది 'ట్రిమ్' చేసిన వీడియో అని.. పూర్తి వీడియో ఇదీ అంటూ కొన్ని ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్లు ఒక నిమిషం ఇరవై సెకన్ల వీడియోను పోస్ట్ చేశాయి. పూర్తి వీడియోలో సైతం అవే వ్యాఖ్యలు ఉండడం గమనార్హం.

## రెండు దశల్లో బిహార్ పోలింగ్!

**» అక్టోబరు తొలి వారంలో షెడ్యూల్**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సమాయత్తమవుతోంది. రెండు దశల్లో వీటిని నిర్వహిస్తారని ఈసీ వర్గాలు తెలిపాయి. అక్టోబరు మొదటి వారంలో షెడ్యూల్ ప్రకటించే అవకాశముందని వెల్లడించాయి. మహిళల ఓట్లే లక్ష్యంగా సీఎం నితీశ్‌కుమార్ అమలు చేస్తున్న పథకాలు, కులగణన, జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో నిత్యావసరాలు, విలాస వస్తువుల ధరలు తగ్గుతుండడం.. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ నిర్వహించిన ఓటర్ అధికార యాత్ర, ఆర్‌జేడీ సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ చేపట్టిన బిహార్ అధికార యాత్ర, ఎన్‌డీఏ పక్షాల ర్యాలీలు, ప్రధాని మోదీ పర్యటనలతో ఇప్పటికే రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అన్ని కూటములూ ఎన్నికల ప్రకటన ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నాయి. ఈ నెలాఖరుకల్లా తుది ఓటర్ల జాబితాను ప్రకటించి.. వచ్చే నెల మొదటి వారంలో షెడ్యూల్ ప్రకటించనున్నట్లు ఈసీ వర్గాలు పేర్కొన్నాయి.

## దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన!

**» సన్నద్ధతకు ఈ నెల 30వ తేదీ డెడ్‌లైన్**

**» రాష్ట్రాల సీఈవోలకు ఎన్నికల సంఘం ఆదేశాలు**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దేశవ్యాప్తంగా సమగ్ర ఓటర్ల సవరణ(ఎస్ఐఆర్) చేపట్టేందుకు ఎన్నికల కమిషన్(ఈసీ) సమాయత్తమవుతోంది. అక్టోబరులో అన్ని రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాల ప్రక్షాళన చేపట్టే అవకాశముందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ నెల (సెప్టెంబరు) 30 నాటికి ఇందుకోసం సిద్ధం కావాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారు(సీఈవో)లను ఈసీ ఆదేశించింది. ఇటీవల ఢిల్లీలో సీఈవోలు, ఎన్నికల సంఘం అధికారులతో ఈసీ ఒక సమావేశం నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టడంపై ఆ సమావేశంలోనే అధికారులకు మార్గనిర్దేశనం చేసినట్లు సమాచారం. చివరిసారి ఎస్ఐఆర్ చేపట్టిన ఓటరు జాబితాలను సిద్ధం చేసుకోవాలని, ఈ ప్రక్రియను రాబోయే పది పదిహేను రోజుల్లో పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని అన్ని రాష్ట్రాల సీఈవోలను ఈసీ ఆ సమావేశంలోనే ఆదేశించింది. కాగా, చాలా రాష్ట్రాలు ఇప్పటికే ఓటరు జాబితాలను వెబ్‌సైట్లలో అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఢిల్లీ 2008లో, ఉత్తరాఖండ్ 2006లో చివరిసారి ఎస్ఐఆర్‌ను నిర్వహించాయి. దేశంలోని చాలా రాష్ట్రాల్లో 2002-2004 మధ్య ఎస్ఐఆర్ చేపట్టిన ఓటరు జాబితాలే అందుబాటులో ఉన్నాయి.

## నియంత్రణ రేఖ వెంబడి పాక్ కాల్పులు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడింది. భారత ఆర్మీ వర్గాల కథనం ప్రకారం.. జమ్మూకశ్మీర్, కుప్వారా జిల్లాలోని నౌగామ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి శనివారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో పాకిస్థాన్ కాల్పులు జరిపింది. పాక్ చర్యలకు బదులుగా భారత సైన్యం కూడా ఎదురు కాల్పులకు దిగింది. పాకిస్థాన్ భూభాగం నుంచి భారత్ వైపు చిన్న ఆయుధాలతో నాలుగు రౌండ్ల కాల్పులు జరగ్గా, భారత బలగాలు దాదాపు 20 రౌండ్లు కాల్పులు జరిపాయి. దాదాపు గంట సేపు జరిగిన ఈ కాల్పుల్లో ఎవరూ గాయపడలేదు. ఈ కాల్పుల ఘటనపై భారత సైన్యం అధికారిక ప్రకటన చేయలేదు. కాగా, పూంచ్ జిల్లాలోని బాలాకోట్ సెక్టార్ వద్ద సెప్టెంబరు 1న జరిగిన చొరబాటు యత్నాన్ని సైన్యం అడ్డుకుంది. ఈ క్రమంలో చొరబాటుదారులు, సైన్యం మధ్య కాల్పులు జరిగాయి.



## జుబిన్ గార్గ్ అంతిమ యాత్రకు వేలాది మంది

**» ఆయన మృతిపై సీఐడీ విచారణ : అసోం సీఎం**

గువాహటి, సెప్టెంబరు 21 : బాలీవుడ్ ప్రముఖ గాయకుడు అసోంకు చెందిన జుబిన్ గార్గ్ సింగపూర్‌లో మరణించగా ఆయన మృతదేహం ఆదివారం గువాహటి విమానాశ్రయానికి చేరుకుంది. చివరి చూపు కోసం వేలాది మంది తరలి వచ్చారు. విమానాశ్రయం నుంచి ఆయన ఇంటి వరకు హైవే జన సంద్రమైంది. సింగపూర్‌లో శుక్రవారం లైఫ్ జాకెట్ లేకుండా సముద్రంలో ఈతకు దిగి జుబిన్ చనిపోయారు. కాగా ఆయన మృతిపై విచారణకు ఆదేశించినట్లు అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. జుబిన్ మృతిపై అసోంలో అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిని సీఐడీకి బదిలీ చేసి విచారణ చేపట్టాలని డీజీపీని ఆదేశించినట్లు సీఎం హిమంత చెప్పారు. ఈ అంశంపై భారత్‌లో సింగపూర్ హైకమిషనర్ సైమన్ వాంగ్‌తో కూడా మాట్లాడానని, గాయకుడి మరణంపై లోతైన విచారణ జరిపించాలని కోరానన్నారు. అసోం సీఐడీ పోలీసులు నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ ముఖ్య నిర్వాహకుడు శ్యామ్‌కను మహంత, జుబిన్ మేనేజర్ సిద్ధార్థ శర్మ, ఇతరులపై కేసు నమోదు చేశారు. వీరిద్దరు కుట్రతో జుబిన్‌ను విదేశాలకు తీసుకువెళ్లారని, అతడిని చంపాలన్నదే వారి ఉద్దేశమని పలువురు ఫిర్యాదుదారులు ఆరోపించారు.

# జీఎస్టీ జోష్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు మేలు చేసేలా ఇకపై 5, 18 శాతానికే పరిమితం కానుంది. హానికర వస్తువులకు మాత్రం 40 శాతం ప్రత్యేక పన్ను అమలు కానుంది. కాగా, ఎఫ్ఎంసీజీల నుంచి ఆటోమొబైల్స్ దాకా వివిధ కంపెనీలు జీఎస్టీ తగ్గుదలకు అనుగుణంగా తమ ఉత్పత్తుల ధరను తగ్గిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి. దాదాపు 375 వస్తువుల ధరలు తగ్గనుండడంతో దేశ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

### ధరలు తగ్గే వస్తువులు ఇవే..

ఇప్పటిదాకా 12 శాతం పన్ను కలిగిన వివిధ నిత్యావసర వస్తువులు ఇకపై 5 శాతం పన్ను పరిధిలోకి రానున్నాయి. వాటిలో టూత్ పేస్టులు, సబ్బులు, షాంపూలతోపాటు బిస్కట్లు, స్నాక్స్, ఫ్రూట్ జ్యూస్‌లు వంటి ప్యాక్ చేసిన ఆహార పదార్థాల ధరలు తగ్గనున్నాయి. ఇవే కాకుండా.. నెయ్యి, ఘనీభవించిన పాలు వంటి డెయిరీ పదార్థాలు, సైకిళ్ల వంటి వాహనాలు, స్టేషనరీ సామగ్రి, రూ.2500 కన్నా తక్కువ ధర కలిగిన పాదరక్షల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. ఇక ఇప్పటిదాకా 28 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఇకపై 18 శాతం పన్ను పరిధిలోకి రానున్నాయి. వీటిలో..ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు, డిష్ వాషర్లు, టెలివిజన్లు, సిమెంటు (ప్రత్యేకించి ఇళ్ల నిర్మాణానికి), ఆటోమొబైల్ రంగంలో 1200 సీసీ కన్నా తక్కువ కలిగిన చిన్న కార్లు, ద్విచక్ర వాహనాల ధరలు భారీగా తగ్గనున్నాయి.

### ధర తగ్గని వస్తువులు..

జీఎస్టీ సంస్కరణలతో ధరలు తగ్గని వస్తువులు కూడా ఉన్నాయి. హానికర వస్తువులు 40 శాతం పన్ను పరిధిలోకి వస్తాయని జీఎస్టీ మండలి ఇప్పటికే ప్రకటించింది. దీని ప్రకారం.. పొగాకు ఉత్పత్తులు, ఆల్కహాల్, పాన్ మసాలా వంటి వస్తువుల ధరలు మరింత పెరగనున్నాయి. వీటితోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ప్లాట్‌ఫారాలకు పన్ను పెరగనుంది. ఇక పెట్రోలియం ఉత్పత్తులు ప్రస్తుతం జీఎస్టీ పరిధిలో లేనందున వాటి ధరల్లో ఎటువంటి మార్పు ఉండబోదు. వజ్రాలు, ప్రెషియస్ స్టోన్స్ వంటి లగ్జరీ వస్తువుల రేట్లు కూడా అలాగే కొనసాగనున్నాయి.

### ధరలు తగ్గించిన కంపెనీలు..

జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటి పరిధిలోకి వచ్చే వస్తువులను ఉత్పత్తి చేసే సంస్థలు.. ఆయా వస్తువుల ధరను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. వీటిలో టెలివిజన్ కంపెనీలు, ఆటోమొబైల్ కంపెనీల వంటివి ఉన్నాయి. 32 ఇంచుల కన్నా పెద్దసైజు టీవీలకు జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతం పరిధిలోకి తేవడంతో టీవీ కంపెనీలు కూడా అందుకు




అనుగుణంగా ధరను తగ్గించాయి. దీంతో సైజును బట్టి వివిధ రకాల టీవీల ధర రూ.2500 నుంచి రూ.85 వేల దాకా తగ్గనుంది.

### రూ.లక్షకు పైగా తగ్గిన కార్ల ధర..

జీఎస్టీ సంస్కరణలకు అనుగుణంగా కార్లు, బైక్‌ల ధరలు భారీగా తగ్గనున్నాయి. మారుతి సుజుకి, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ కార్ల తయారీ సంస్థలు ఇప్పటికే తాము ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ అయిన మారుతి సుజుకి.. తమ వాహనాల ధరలను సుమారు రూ.1.29 లక్షల దాకా తగ్గించింది. మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ తమ కార్ల ధరలను తగ్గిస్తున్నట్లు గతంలోనే ప్రకటించింది. ఈ నెల మొదటివారం జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం వెలువడిన రోజే తమ ప్యాసింజర్ వాహనాల ధరలను రూ.1.56 లక్షల దాకా తగ్గిస్తున్నట్లు పేర్కొంది. ఈ కంపెనీ కనిష్ఠంగా బొలెరో/నియో రేంజ్ ధరను రూ.1.27 లక్షలు, గరిష్ఠంగా ఎస్‌యూవీ టక్సన్ ప్రీమియం ధరను రూ.2.4 లక్షలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక హోండా కంపెనీ తమ సిటీ కారు ధరను రూ.57,500 తగ్గించగా, కియా ఇండియా ఏకంగా రూ.4.48 లక్షల దాకా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కాగా, టొయోటా కిర్లోస్కర్ కారు ధర రూ.3.49 లక్షల దాకా తగ్గనుంది. మరోవైపు లగ్జరీ కారు మెర్సిడెస్ బెంజ్ ధరను ఏ-క్లాస్‌కు రూ.2 లక్షలు, ఎస్-క్లాస్‌కు రూ.10 లక్షల దాకా తగ్గిస్తున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. ఇక బీఎండబ్ల్యూ అయితే అత్యధికంగా రూ.13.06 లక్షల తగ్గింపును ప్రకటించడం గమనార్హం. ఆడి కంపెనీ కార్లు రూ.2.6 లక్షల నుంచి రూ.7.8 లక్షల దాకా తగ్గింపునకు రానున్నాయి. జాగ్వార్ ల్యాండ్ రోవర్ సైతం గరిష్ఠంగా రూ.30.4 లక్షల దాకా ధర తగ్గించింది.

**మారుతి సుజుకి కంపెనీ కార్లు**

| మోడల్ | తగ్గనున్న ధర |
|---|---|
| ఎస్ ప్రెస్సో | రూ.1,29,600 |
| ఆల్టో కె10 | ధూ.1,07,600 |
| సెలెరియో | రూ.94,100 |
| వ్యాగన్ ఆర్ | రూ.79,600 |
| ఇగ్నిస్ | రూ.71,300 |
| స్విఫ్ట్ | రూ.84,600 |
| బెలనో | రూ.86,100 |
| టూర్-ఎస్ | రూ.67,200 |
| డిజైర్ | రూ.87,700 |
| బ్రెజ్జా | రూ.1,12,700 |
| గ్రాండ్ విటారా | రూ.1,07 లక్షలు |

హారియర్, సఫారీ ఎస్‌యూవీ కార్ల ధరలు రూ.1.4 లక్షలు, రూ.1.45 లక్షల చొప్పున తగ్గనున్నాయి.

| టీవీ కంపెనీ | సైజు(అంగుళాల్లో) | తగ్గనున్న ధర |
|---|---|---|
| సోనీ ఇండియా | 43 | రూ.5,900 |
| | 98 | రూ.71,000 |
| ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ | 43 | రూ.2,500 |
| | 100 | రూ.85,800 |
| ప్యానసోనిక్ | 75 | రూ.32,000 |

### నిత్యావసరాలు ఇక అగ్వ..

జీఎస్టీ సంస్కరణల కారణంగా దేశ ప్రజలకు నిత్యావసర వస్తువులు అగ్వకు రానున్నాయి. పలు కంపెనీలు తమ ఉత్పత్తుల ధరను తగ్గిస్తున్నట్లు పేర్కొంటూ కొత్త ధరల పట్టికను విడుదల చేశాయి. సబ్బులు, షాంపూలు, బేబీ డైపర్స్, టూత్ పేస్టులు, రేజర్లు, లోషన్లతోపాటు స్నాక్స్, నమ్‌కీన్, భుజియా నుంచి స్వీట్ల దాకా, కాఫీ, టీ, బటర్, నెయ్యి, ఐస్‌క్రీమ్, చాక్లెట్లు వంటి వాటి ధరలను సవరిస్తూ కొత్త ఎమ్మార్పీ ట్యాగ్‌లను ఆయా కంపెనీలు తమ డిస్ట్రిబ్యూటర్లకు, కిరాణా స్టోర్లు, ఈ-కామ్‌లకు పంపించాయి. డాబర్, ఐటీసీ, పీఅండ్‌జీ, ఇమామి, అమూల్ వంటి కంపెనీలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపునకు సంబంధించిన వివరాలను తమ వెబ్‌సైట్లలో పేర్కొన్నాయి. ప్రకటనలు ఇచ్చాయి.

### బైక్‌ల ధర రూ.19 వేల దాకా తగ్గింపు..

ద్విచక్ర వాహనాల ధరలు కూడా గణనీయంగా తగ్గనున్నాయి. హీరో కంపెనీ బైక్‌లు, స్కూటర్ల ధరలను రూ.15,743 దాకా తగ్గించగా, హోండా కంపెనీ 350 సీసీ వాహనాల వరకు రూ.18,800 దాకా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.

### చౌకగా ఔషధాలు..

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ఔషధాలు, వైద్య పరికరాలు ఇకపై చౌకగా లభించనున్నాయి. ఇదివరకు 12 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న అత్యధిక ఔషధాలు ఇప్పుడు 5శాతం పరిధిలోకి రానున్నాయని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ జైన్ తెలిపారు. అంతేకాకుండా.. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడే 36 రకాల మందులకు పన్నును పూర్తిగా ఎత్తివేసినట్లు పేర్కొన్నారు.

**షాపుల్లో ధరల తగ్గింపు బోర్డులు**

ధరలు తగ్గిన వస్తువులకు సంబంధించి ఆయా దుకాణాలు, షోరూంలలో బోర్డులు ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో వస్తువుల ధరలను ఏ మేరకు తగ్గించారన్నదీ అందులో తెలియజేయాల్సిందిగా కోరారు. మరోవైపు ఇప్పటికే పాత ధరలతో ఉన్న వస్తువులకు ధరలు తగ్గితే.. కొత్త ధరతో స్టిక్కర్ అంటించాల్సిందిగా సూచించారు.



## లోకం తీరు

నవరాత్రులు ప్రారంభం ≡




# కొత్త శకం ఆరంభం

**నేటి నుంచి దేశంలో జీఎస్టీ పొదుపు ఉత్సవం**

**» ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించండి: మోదీ**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "నేటి నుంచి జీఎస్టీ ఉత్సవం ప్రారంభం కాబోతోంది. దేశంలో కొత్త చరిత్ర మొదలవుతోంది" అని ప్రధాని మోదీ అన్నారు. నవతరం జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వస్తున్నాయని, ఇవి అన్ని రంగాలకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. సోమవారం నుంచి జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆదివారం జాతినుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. దేశ ప్రజలందరికీ అమ్మవారిని ఆరాధించే దసరా పండుగ సందర్భంగా నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. నవరాత్రి మొదటి రోజు నుంచే ఆత్మనిర్భర్ వైపు మరో కీలక అడుగు వేస్తున్నామన్నారు. మన దేశంలోని పేదలు, మధ్య తరగతి, యువత, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యాపారులు, వ్యవస్థాపకులు.. ఇలా అందరూ బచత్ ఉత్సవ్ (పొదుపు పండుగ) చేసుకోబోతున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలతో దేశ ఆర్థిక వృద్ధి వేగవంతం అవుతుందని, వ్యాపారాన్ని సులభతరం చేస్తాయని, పెట్టుబడులు మరింత ఆకర్షణీయంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతి రాష్ట్రాన్నీ సమాన భాగస్వామిగా చేయడంలో జీఎస్టీ సంస్కరణలు కీలక భూమిక పోషిస్తాయన్నారు. "దేశ ప్రజలు ఎంతో నమ్మకంతో 2014లో నాకు ప్రధానిగా బాధ్యతలు అప్పగించారు. మొదట్లోనే.. విదేశీ పత్రిక ఒక ఆసక్తికరమైన కథనాన్ని ప్రచురించింది. ఒక కంపెనీ ఇబ్బందులను ప్రస్తావించింది. 'బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 570 కిలోమీటర్ల దూరం. వస్తువుల సరఫరాలో ఎన్నో ఇబ్బందులు ఉండేవి. మొదట బెంగళూరు నుంచి యూరప్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వస్తువులను పంపడం ఉత్తమమని ఓ కంపెనీ భావించింది' అనేది ఆ కథనంలోని సారాంశం. అప్పటికి దేశంలో పన్నులు, టోల్ ఇతర పరిస్థితులు అంత దారుణంగా ఉండేవి. ఆ రోజే దేశాన్ని ఈ పరిస్థితి నుంచి బయటపడేయడం అత్యవసరమని నేను భావించాను. దేశంలోని అన్ని వర్గాల వారితో చర్చించి 2017లో జీఎస్టీతో కొత్త చరిత్రకు నాంది పలికాను. అదే భారతదేశంలోనే అతిపెద్ద పన్ను సంస్కరణ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి ఫలితంగా దేశం డజన్ల కొద్దీ పన్నుల నుంచి విముక్తి పొందింది. ఒకే దేశం-ఒకే పన్ను కల సాకారమైంది. అయితే.. సంస్కరణ అనేది నిరంతర ప్రక్రియ. కాలం మారుతున్న కొద్దీ, దేశ అవసరాల దృష్ట్యా కొత్త సంస్కరణలు అవసరం. అందుకే.. జీఎస్టీ 2.0ను ప్రవేశపెట్టి మరో చరిత్రకు నాంది పలికాం" అనే ప్రధాని మోదీ వివరించారు.

### పేద, మధ్య తరగతికి డబుల్ బొనాంజా

మధ్య తరగతి ప్రజలకు డబుల్ బొనాంజా ఇచ్చామని మోదీ తెలిపారు. ఇప్పటికే రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇచ్చామని, దానికితోడు జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతాయని పేర్కొన్నారు. గడిచిన పదకొండేళ్లలో దేశంలో జీఎస్టీ వల్ల



25 కోట్ల మంది పేదరికాన్ని జయించారని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలతో దుకాణదారులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. దేశీయ ఉత్పత్తులపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని అన్నారు.

### స్వదేశీ మంత్రం శక్తినిస్తుంది..

స్వదేశీ మంత్రం దేశ స్వాతంత్ర్యానికి శక్తినిచ్చినట్లే.. భారతదేశ శ్రేయస్సుకు కూడా శక్తినిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. "ప్రస్తుతం మనకు తెలిసో, తెలియకో అనేక విదేశీ వస్తువులు దైనందిన జీవితంలో భాగమయ్యాయి. మన జేబులో ఉన్న దువ్వెన తయారు చేసింది విదేశీయులా? లేక స్వదేశీయులా? అనేది కూడా మనకు తెలియదు. దీని నుంచి మనం విముక్తి చెందాలి. ఇకపై.. దేశంలో తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయాలి. ప్రతి ఇంటినీ స్వదేశీ చిహ్నంగా మార్చాలి. ప్రతి దుకాణాన్నీ స్వదేశీ వస్తువులతో అలంకరించాలి. ఇది స్వదేశీ అని, నేను స్వదేశీ వస్తువులనే కొంటానని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పండి. నేను స్వదేశీ వస్తువులను కూడా అమ్ముతానని ప్రకటించండి. దీనివల్ల దేశంతోపాటు ప్రతి రాష్ట్రంలోని తయారీ రంగం ఎంతో అభివృద్ధిని సాధిస్తుంది. దీనికోసం సహకరించాలని నేను ప్రతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను" అని మోదీ వివరించారు.

## త్రిభాషా విధానంపై రాజకీయ రాద్ధాంతం తగదు

**» ఏ రాష్ట్రంపైనా.. ఏ భాషనూ నిర్బంధంగా అమలు చేయం: ధర్మేంద్ర ప్రధాన్**



చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విద్యావిధానంపై అనవసరమైన రాజకీయ రాద్ధాంతం తగదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. సంకుచిత రాజకీయ అభిప్రాయాలు ఉన్నవారే ఈ విధానాన్ని వివాదంగా మారుస్తున్నారని ఆరోపించారు. కేంద్రం రూపొందించిన నూతన విద్యావిధానం ప్రకారం ఏ రాష్ట్రంపైనా.. ఏ భాషనూ నిర్బంధంగా అమలు చేయాలని ఒత్తిడి చేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాలూ నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్నాయని, తమిళనాడు ప్రభుత్వం మాత్రం తీవ్ర నిరసన ప్రకటిస్తూ ద్విభాషా విద్యావిధానానికే కట్టుబడి ఉంటామని మొండి వైఖరిని అవలంస్తోందని ఆరోపించారు. త్రిభాషా విధానంతో వచ్చిన సమస్య ఏమిటని ప్రశ్నించారు. ఐఐటీ మద్రాసులో 'దక్షిణాపథ్ సమ్మిట్' పేరుతో ఆదివారం ఏర్పాటైన సదస్సులో ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, 'ఐఐటీఎం ఫర్ ఆల్' పథకం కింద నాలుగేళ్ల ఆన్‌లైన్ బీఎస్ (డేటా సైన్స్) కోర్సులో చేరిన గ్రామీణ, పేద, దివ్యాంగ విద్యార్థులతో ఆయన భేటీ అయ్యారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ నిధుల నిలిపివేతపై తాను రెండేళ్లుగా ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడుతూనే ఉన్నానని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు జాతీయ విద్యావిధానాన్ని అవలంబిస్తుండగా తమిళనాడు మాత్రం ద్విభాషా విద్యావిధానానికే కట్టుబడి ఉంటామని రాజకీయ రాద్ధాంతం చేయడం తగదన్నారు. తమిళనాడులోని పాఠశాలల్లో తెలుగు, ఉర్దూ, మలయాళం సహా పలు ప్రాంతీయ భాషలు నేర్పుతున్నప్పుడు త్రిభాషా విధానం వద్దని ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం భావ్యమేనా అని ప్రశ్నించారు.

# 2.5 రెట్లు పెరిగిన ఖర్చు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 6.26 లక్షల కోట్లు ఉండగా.. 2022-23 అది ఏకంగా 15.63 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించింది. ఈ మొత్తం రాష్ట్రాల మొత్తం రెవెన్యూ వ్యయంలో దాదాపు సగమని తెలిపింది. ఇంకా సబ్సిడీలు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌లను కలిపితే.. రాష్ట్రాలు చేసే వ్యయంలో ప్రతి రూపాయిలో ఐదింటిలో నాలుగుకు పైగా వంతు వాటికే పోతోందని వివరించింది. జీతాలు, పెన్షన్లు, ప్రభుత్వ అప్పులపై వడ్డీ చెల్లింపులను 'నిబద్ధ వ్యయం'గా పరిగణిస్తారు. 2013-14, 2022-23 మధ్య రాష్ట్రాల మొత్తం వ్యయంలో రెవెన్యూ వ్యయం స్థిరంగా 80-87 శాతం నడుమ ఉంటోంది. రాష్ట్రాల మొత్తం జీఎస్డీపీలో ఆ వాటా 13-15 శాతం మధ్య ఉంది. 2022-23 ఆర్థిక ఏడాది వరకు చూస్తే.. రెవెన్యూ వ్యయం రూ.35.96 లక్షల కోట్లుగా ఉంది. ఇది మొత్తం వ్యయంలో 85 శాతం, మొత్తం జీఎస్డీపీలో 13.85 శాతం. 2022-23లో మొత్తం రెవెన్యూ వ్యయంలో వేతనాలు, పింఛన్లు, రుణాలకు వడ్డీ వంటి వాటికి రూ.15.63 లక్షల కోట్లు ఖర్చు చేయగా, సబ్సిడీలు రూ.3.09 లక్షల కోట్లకు చేరాయి. అదేవిధంగా గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌లు రూ.11.26 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఈ మూడింటిని కలిపితే మొత్తం రెవెన్యూ వ్యయంలో 83 శాతంగా తేలింది. దీని వలన అభివృద్ధి, మూలధన వ్యయం కోసం తక్కువ వెసులుబాటు ఉంటోందని కాగ్ తన నివేదికలో వెల్లడించింది.

### రెవెన్యూ లోటులో పలు రాష్ట్రాలు

2022-23లో 17రాష్ట్రాలు రెవెన్యూ మిగులు లక్ష్యం పెట్టుకోగా.. 12 రాష్ట్రాలు ఆ టార్గెట్‌ను చేరుకున్నాయి. అసోం, బిహార్, హిమాచల్‌ప్రదేశ్, మేఘాలయ, రాజస్థాన్‌లు రెవెన్యూ లోటుతో ముగిశాయి. రెవెన్యూ లోటును తగ్గించుకోవాలని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, హరియాణా, మహారాష్ట్ర, పంజాబ్ లక్ష్యంగా పెట్టుకోగా.. వీటిల్లో కర్ణాటక రెవెన్యూ మిగులులోకి వెళ్లగా.. మహారాష్ట్ర మాత్రమే పెట్టుకున్న లక్ష్య పరిమితికి తగ్గించుకుంది. 2022-23లో రెవెన్యూ లోటులో ఉన్న 12 రాష్ట్రాలకుగానూ ఏపీ సహా తొమ్మిది రాష్ట్రాలు మాత్రమే ఆర్థిక సంఘం నుంచి రెవెన్యూ లోటుకు సంబంధించిన గ్రాంట్లు పొందాయి.

**ఎక్కువ రాష్ట్రాల్లో జీతాలపై ఖర్చే టాప్**

*2013-14 నుంచి 2022-23 మధ్య రెవెన్యూ వ్యయం 2.66 రెట్లు పెరిగింది. చాలా వరకు రాష్ట్రాల్లో 'నిబద్ధ వ్యయం'లో వేతనాలపై అధికంగా ఖర్చు చేస్తుండగా.. ఆ తర్వాతి స్థానాల్లో పింఛన్లు, వడ్డీ చెల్లింపులు ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హరియాణా, కర్ణాటక, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో పింఛన్ల కంటే వడ్డీ చెల్లింపులు అధికంగా ఉన్నాయి. 2013-14, 2021-22 మధ్య తొమ్మిది సంవత్సరాల కాలంలో వ్యయంలో వేతనాల తర్వాత వడ్డీలు స్థిరంగా రెండో స్థానంలో ఉంది. మరోవైపు సబ్సిడీలపై వ్యయం వేగంగా 3.21 రెట్లకు పెరిగిందని కాగ్ తెలిపింది. 2013-14లో రాష్ట్రాల మొత్తంగా రూ.96,479 కోట్లు ఉండగా.. 2022-23 నాటికి అవి రూ.3.09 లక్షల కోట్లకు చేరాయని వివరించింది.*

## పాలస్తీనాను దేశంగా గుర్తిస్తున్నాం

**» బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా కీలక ప్రకటన**

**» ఇదే బాటలో ఫ్రాన్స్, పోర్చుగల్ కూడా!**

లండన్, సెప్టెంబరు 21: పాలస్తీనాను బ్రిటన్ అధికారికంగా దేశంగా గుర్తించింది. అమెరికా, ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల్లో శాంతి స్థాపన ఆశలు పునరుద్ధరించేందుకు రెండు దేశాల విధానం సరైనదని స్టార్మర్ అభిప్రాయపడ్డారు. బ్రిటన్‌తో పాటు ఆస్ట్రేలియా, కెనడా కూడా పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాయి. అతి త్వరలో ఫ్రాన్స్, పోర్చుగల్ కూడా పాలస్తీనాను దేశంగా అధికారికంగా గుర్తించనున్నాయి. పాలస్తీనాను దేశంగా గుర్తించడమంటే 2023 అక్టోబర్ 7నాటి దాడిపై హమాస్‌కు బహుమతి ఇచ్చినట్లేనని ఇజ్రాయెల్ వ్యాఖ్యానించింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల వేళ పాలస్తీనాను దేశంగా గుర్తిస్తూ ఆయా దేశాలు చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఐక్యరాజ్యసమితిలోని 145 దేశాలు పాలస్తీనాను ఇప్పటికే దేశంగా గుర్తించాయి. అయితే, భద్రతా మండలిలో ఆమోదం పొందితేనే పాలస్తీనాను ఐక్యరాజ్యసమితిలో సభ్య దేశంగా గుర్తిస్తారు. అమెరికా వీటో చేస్తుండటంతో పాలస్తీనాకు మోక్షం లభించడం లేదు. కాగా, గాజాలో ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.


For the Historic and Progressive GST Reform, Emami thanks the Hon'ble Prime Minister
emami
Shri Narendra Modi
Hon'ble Prime Minister of India
The care of ayurveda.
At prices that care.
In every Indian heart. In every Indian home.
Building a stronger India.
Buy 1 Get 1 Free
BoroPlus Doodh Kesar Lotion 300 ml + 300 ml ₹340 ₹319
Navratna Ayurvedic Oil Cool 180 ml ₹155 ₹145
Emami 7 Oils in One Hair Oil 100 ml ₹75 ₹67
Zandu Balm 8 ml ₹46 ₹43
Zandu Chyavanprashad 900 gm ₹430 ₹403
Zandu Roll-on 5 ml ₹35 ₹33
BoroPlus Vasocare Herbal Petroleum Jelly 50 ml ₹95 ₹89
Kesh King Gold Oil 100 ml ₹190 ₹178
Zandu Pancharishta Ayurvedic Digestive Tonic 450 ml ₹160 ₹150
Kesh King Gold Shampoo 340 ml ₹300 ₹280
BoroPlus Ayurvedic Antiseptic Cream 80 ml ₹165 ₹155
Revised price list is available with retailers and on www.emamiltd.in
*Maximum Retail Price (MRP) reduction is an outcome of revised rate slabs, effective 22nd September, 2025 onwards. Benefits have been passed on across the above packs and across a wide range of products. Stocks manufactured with reduced MRP (inclusive of all taxes/GST) or with higher grammage/volume are in the process of reaching retailers.


MARUTI SUZUKI COMMERCIAL
GST తగ్గింపుతో
ఇప్పుడు
వేడుకలు
మరింత ఘనంగా మారాయి.
ఇప్పుడు ప్రారంభ ధర
₹5 06 100^
₹52 100^
వరకు ధరపై తగ్గింపు
₹58 000**
వరకు ప్రత్యేక పండుగ ఆఫర్
సూపర్ శక్తివంతమైన 1.2 L ఆధునిక K-సిరీస్ ఇంజన్
S-CNG + PETROL
CNG + 5L అత్యవసర పెట్రోల్ ట్యాంక్
సూపర్ మైలేజ్
ELECTRONIC STABILITY PROGRAM
మినీ ట్రక్ విభాగంలో మొదటిది
ESP® తో గొప్ప భద్రత
నిటారు ఏటవాలుపై ఉన్నతమైన సామర్థ్యం
3 years 100 000 km WARRANTY* EXTENDABLE UPTO 6 YEARS
NEW SUPER CARRY
WWW.MARUTISUZUKICOMMERCIAL.COM | వివరాల కోసం, టోల్ ఫ్రీ నంబర్ 1800 102 1800/1900 1800 150 కు కాల్ చేయండి.
VARUN MOTORS NIZAMABAD CALL: 9052460088
SRI JAYARAMA MAHABUBNAGAR CALL: 99896 88036
ADARSHA AUTOMOTIVES KARIMNAGAR CALL: 80749 17077
PAVAN MOTORS NALGONDA CALL: 87126 04552
ADARSHA AUTOMOTIVE WARANGAL CALL: 91333 42366

# వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

## అద్దం వెనుక వర్షం



ఆకాశం తన నరాలన్నీ తెంచుకుని
ఒక పిచ్చివాడిలా వీధుల మీద పడింది.
నగరపు మురికిని, కపటత్వాన్ని
కడిగి పారేయాలన్న కసితో
ప్రతి నీటిచుక్క ఒక ఉలిదెబ్బలా కురుస్తోంది.

తగరపు రేకుల పైకప్పుల మీద
లక్షలాది సైనికుల కవాతు శబ్దం.
మట్టి వాసన...
ఎప్పుడో సమాధి చేసిన జ్ఞాపకంలా
ఒక్కసారిగా పైకి లేస్తోంది.

నేను ఈ పన్నెండో అంతస్తు కిటికీ వెనుక
ఏసీ చలిలో బిగుసుకుపోయి
నా ఫోన్ తెర మీద
ఇదే వర్షపు ఫోటోలకు 'లైక్' కొడుతున్నాను.
బయట కురుస్తున్నది నిజమైన వర్షం
నా చేతిలో తడుస్తున్నది ఒక గాజు అబద్ధం.

నాకూ ఈ హోరువానకూ మధ్య
ఈ చల్లని, మందపాటి అద్దం
నా చర్మానికీ, స్పర్శకీ మధ్య
నా హృదయానికీ, వాస్తవికతకీ మధ్య
నిలబడిన ఒక పారదర్శకమైన శత్రువు.

చిన్నప్పుడు అమ్మ చీరచాటు నుండి
బయటకు దూకిన జ్ఞాపకం...
మొదటి వాన చుక్క ఒంటి మీద పడగానే
ఒళ్ళు పులకరించిన అనుభూతి...
బురదలో గెంతిన పాదాలు...
ఆ స్వేచ్ఛ ఇప్పుడు నాకెంత దూరం?

బయట కురుస్తున్నది నీళ్ళు
నా గొంతులో ఆరని అస్తిత్వ దాహం.
కిటికీ తలుపులు బాదుతున్న ఈ శబ్దం
నన్ను లోపలికి రమ్మని పిలుస్తున్న మృత్యువా?
బయటకు రమ్మని పిలుస్తున్న స్వేచ్ఛా?

నా వేలికొనతో అద్దాన్ని తాకాను
అది నా సమాధిలా చల్లగా ఉంది
అద్దంలో నా ప్రతిబింబం
వర్షంలో తడుస్తున్న ఒక నీడలా...

ఈ గాజు గోడను బద్దలుకొట్టి
బయటి ప్రపంచంలో కలిసిపోవాలా?
లేక ఈ నాలుగు గోడల మధ్యే
నాలో నేను కురిసి, నాలోనే ఇగిరిపోవాలా?

■ భూక్యా గోపినాయక్
✆ 99891 59196

### 'నేను మరణిస్తూనే ఉన్నాను' కవిత్వ పరిచయ సభ

బిల్ల మహేందర్ కవిత్వ సంపుటి 'నేను మరణిస్తూనే ఉన్నాను' పరిచయ సభ సెప్టెంబర్ 23 సా.4 గంటలకు రవీంద్రభారతి హైదరాబాద్‌లో జరుగుతుంది. నామోజు బాలాచారి, నెల్లుట్ల రమాదేవి, యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, సామిడి జగన్ రెడ్డి పాల్గొంటారు.

**తెలంగాణ సాహిత్య అకాడమీ**

### అలాయిబలాయి కవిసమ్మేళనం

సెప్టెంబర్ 26 ఉదయం 9.30 నుంచి సా.5 గం.ల దాకా వరంగల్ జిల్లా తొర్రూరు దగ్గరలో అన్నారం యాకన్న (యా కూబ్ షా వలీ) దర్గా వద్ద అలాయిబలాయి కవిసమ్మేళనం జరుగుతుంది. గోరటి వెంకన్న, జి. లక్ష్మీనరసయ్య, ప్రసేన్, కవి యాకూబ్, జూపాక సుభద్ర, సిద్ధార్థ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటారు. వివరాలకు: 94404 27968.

**వడ్లకొండ దయాకర్**

### మంటో జీవితం – రచనలు

ఫాసిజం సందర్భంలో మంటో జీవితం - రచనలు జూమ్ మీటింగ్ సెప్టెంబరు 27సా.6 గం.లకు జరుగుతుంది. పంజాబీ రచయిత పవన్ టిబ్బా, పూర్ణిమ తమ్మిరెడ్డి, ఉదయ మిత్ర, స్కైబాబ, విప్లవ శ్రీనిధి, హాథీరాం సబావట్, పేర్ల రాము, లావణ్య, మెర్సీ మార్గరెట్, నరేష్కుమార్ సూఫీ పాల్గొంటారు.

**సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్**

### 'నల్ల పద్యం' కవిత్వ పరిచయ సభ

పిన్నంశెట్టి కిషన్ రాసిన 'నల్ల పద్యం' కవితా సంపుటి పుస్తక పరిచయ సభ సెప్టెంబర్ 28ఉ.10 గంటలకు కరీంనగర్ ఫిలిం భవన్‌లో తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతుంది. సి.వి. కుమార్, అన్నవరం దేవేందర్, పి.ఎస్. రవీంద్ర, రఘురామన్, పుప్పాల శ్రీరామ్ హాజరవుతారు.

**దామరకుంట శంకరయ్య**

## భ్రమలు తొలగిన నైరాశ్యంలో వెలిగింది నా 'దీపశిఖ'

**నా మొదటి పుస్తకం**

రామా చంద్రమౌళి

**1950 లో** వరంగల్లులో జన్మించిన నేను జన్మతః కొంత సాహిత్య వారసత్వాన్ని కలిగి ఉన్నానని చిన్నప్పటి నుండీ అనుకునేవాణ్ణి. పాలకుర్తి సోమనాథుడు, బమ్మెర పోతన, వానమామలై వరదాచార్యుల నుండి నాకు వ్యక్తిగతంగా బాగా పరిచయమున్న ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారాచార్య, ప్రజాకవి కాళోజీ, పాములపర్తి సదాశివరావు, పత్రికా సంపాదకులు ఎం.ఎస్. ఆచార్య, తను రాసే ప్రతి అక్షరాన్నీ ఆచరిస్తూ జీవించే మహారచయిత వరవరరావు (నాకన్నా పదేళ్ళు పెద్ద), ప్రసిద్ధ నవలా రచయిత అంపశయ్య నవీన్... ఇత్యాదుల వైభవోపేతమైన ప్రేరణ (induction) నాలో చిన్ననాటినుండీ వాహకంలో విద్యుత్తులా ప్రవహించేది. కాళోజీ గురువుగారైన గార్లపాటి రాఘవ రెడ్డి గారి శిష్యరికంలో (మహబూబియా ఉన్నత పాఠశాలలో) తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు భాషా వ్యామోహంతో రాసిన నా మొట్టమొదటి కథ 'సువర్ణ శతదళ పుష్పరహస్యం' పిల్లల పత్రిక 'చందమామ'లో అచ్చయితే పొందిన పులకింత మహోద్విగ్నమైంది. కాని ఇరవై ఏళ్లు వచ్చేనాటికి ఇంజనీరింగ్ చేస్తూ ఎందుకో కవిత్వమే నా మాధ్యమమని తెలుసుకుని, ప్రయోజనకర సృజన తోనే అక్షరాన్ని సంధించాను. పుస్తకాన్ని అచ్చువేసుకోగల ఆర్థిక స్తోమత లేని స్థితిలో నా చిన్ననాటి మిత్రుడు రావుల గిరి సహకారంతో అతికష్టం మీద ఆగస్ట్, 1971లో వెలువరించిన నా మొదటి కవిత్వ పుస్తకం 'దీపశిఖ'. ఇరవై ఏళ్ళ వయసులో అప్పుడే ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్లులో డిమాన్‌స్ట్రేటర్‌గా చేరిన సంవత్సరమే మా కాలేజ్ ఆడిటోరియంలోనే 'దీపశిఖ' ఆవిష్కరణ జరిగింది. నాటి సభను అధ్యక్షించినవారు కళాప్రపూర్ణ నేరెళ్ళ వేణుమాధవ్, ఆవిష్కర్త ఆంధ్రప్రభ ఎడిటర్ పొత్తూరి వెంకటేశ్వర రావు, పుస్తక విశ్లేషణ కోవెల సుప్రసన్నాచార్య, ఎం.ఎస్. ఆచార్య, ఎడిటర్ జనధర్మ, విద్వాన్ టి.వి. సుబ్బారావు, ప్రసిద్ధ కథా రచయిత తులసి బాలకృష్ణ. ఆ పుస్తకంపై దాదాపు అన్ని పత్రికలూ, చాలా మంది మిత్రులూ పాజిటివ్‌గా స్పందించారు.






ఐతే ఇక్కడ అప్పటి ఆ పుస్తకం వెనుక నాటి నా అంతరంగ స్థితిని తెలియజేసుకోవలసిన అవసరముంది. బాల్యం నుండీ నన్ను నేను తెలుసుకుంటున్నప్పుడు క్రూరమైన హింసతో కూడిన తెలంగాణ సాయుధ పోరాటం, పోలీస్ యాక్షన్, కమ్యూనిస్ట్ యోధుల ఊచకోత... ఈ అతిభయంకరమైన పీడకల లాంటి గతం నా బాల్యాన్నీ, యవ్వనాన్నీ పూర్తిగా ఆక్రమించి మాయని గాయాన్ని మిగిల్చింది. భారత దేశంలో 1952 లో జరిగిన మొట్టమొదటి పార్లమెంటరీ ఎన్నికల ప్రహసనం నుండి ఇప్పటిదాకా జరుగుతూ వస్తున్నదంతా 'ప్రజాస్వామ్యం' పేరుతో జరుగుతున్న అతిపెద్ద దగా, మోసం, కంటితుడుపు చర్య. ఒక్క నాల్గయిదు లోకసభ ఎన్నికల తర్వాతే అసలు రంగు బయటపడి, పరాయి దోపిడీదారుల కంటే మన ఇంటిదొంగలే పరమ ప్రమాదకారులని తెలిసి 'అంతా భ్రాంతియేనా' అన్న నిస్సహాయ అంతర్మథనంలో కసితో రాసిన కవితల గుచ్ఛమే ఈ నా 'దీపశిఖ'. నాకు ఆదర్శమూర్తియైన వరవరరావు తన 'చలినెగళ్ళు'లో ఎంతో విశ్వాసంతో ఒక కవిత రాశాడు: "భళ్ళున తెల్లవారునింక భయంలేదు" అని. కాని ఇంకా తెల్లవారలేదు. "చలితెరలు తొలగి సూర్యుడు మిట్టమింటికి రావాలి" అని కూడా ఆకాంక్షించాడు వివి. కాని మిట్ట మింటికి సూర్యుడు ఇంకా రానేలేదు. కిష్కింధాకాండ ఇంకా జరుగుతూనే ఉంది. ■

## మధునాపంతుల స్ఫూర్తి చిహ్నం 'ఆంధ్రీ కుటీరం'

ఫ్రెంచి యానాం పట్టణ గ్రామానికి అతి సమీపంలో ఉన్న కుగ్రామం పల్లిపాలెం. ఇక్కడి నుంచే ఆంధ్ర పురాణం కావ్యకర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు తన సాహిత్య ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయనే దాదాపు ఏడున్నర దశాబ్దాల క్రితం ఈ ఊరిలో 'ఆంధ్రీ కుటీరం'ను ప్రారంభించారు. ప్రాంతాలతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు ఈ గ్రామం వచ్చి, ఆంధ్రీ కుటీరంలో తమ సాహిత్య సంపదను పంచుకున్నారు. ఈ కుటీరాన్ని, దాని తరఫున జరిగిన సాహిత్య సేవని ఇప్పుడు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి తమ్ముడి కుమారుడు మధునాపంతుల సత్యనారాయణ నేటికీ కొనసాగిస్తున్నారు. ఆంధ్రీ కుటీరం నిర్వహణ గురించి, దాని ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి సత్యనారాయణ గారితో జరిపిన సంభాషణ ఇది.




**కోనసీమ జిల్లాలో మారుమూల ఉన్న ఈ పల్లిపాలెంలో ఆంధ్రీ కుటీరం గురించి, ఇక్కడికి వచ్చిన గొప్ప సాహితీవేత్తల గురించి, మీరు ఇప్పుడు చేస్తున్న కార్యక్రమాల గురించి చెప్పండి?**

కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, పల్లిపాలెం మా స్వగ్రామం. శతాబ్దాల క్రితం ఇక్కడకు వచ్చి మా కుటుంబాలు స్థిరపడ్డాయి. భిషగ్రత్న మధునాపంతుల సత్యనారాయణ మూర్తి – లక్ష్మమ్మల ప్రథమ సంతానం కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు. ఆయన తమ్ముడు మధునాపంతుల సూరయ్య శాస్త్రి. సత్యనారాయణ శాస్త్రి గారు తన 14వ ఏట ఈ ఆంధ్రీకుటీరం స్థాపించారు. ఆంధ్రీ కుటీర లక్ష్యాలు– గ్రామంలో సాహిత్య చైతన్యం తీసుకురావడం, యువత దారి తప్పకుండా వారిని పఠనం వైపు, రచనల వైపు మళ్ళించడం, దళితులకు సంస్కృత విద్యాబోధన, అలాగే ఒక గ్రంథాలయ స్థాపన. ఆంధ్రీకుటీరం 1939లో 'ఆంధ్రి' అనే మాసపత్రికను ప్రారంభించింది. దీనికి పిఠాపురం ఆస్థాన కవి ఓలేటి వేంకట రామ శాస్త్రి సర్వాధ్యక్షులు. 'ఆంధ్రి' పత్రికకు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి మొదలుకొని గుర్రం జాషువా వంటివారు తమ రచనలు పంపి ప్రోత్సహించారు. అయితే 42 సంచికలు మాత్రమే వచ్చాయి. రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా పేపర్ కొరత మొదలైన సమస్యల వల్ల పత్రిక ఆగిపోయింది. 'ఆంధ్రి' పత్రిక ద్వారా ప్రసిద్ధులైన రచయితలను పరిచయం చేస్తూ మధునాపంతుల సంపాదక వ్యాసాలు రాశారు. అవి అనంతర కాలంలో శతాధిక రచయితల సమాచారంతో 'ఆంధ్ర రచయితలు' అనే ప్రామాణిక గ్రంథంగా విడుదలయ్యింది.

**మీ పెద్దనాన్నగారికి మీరు సాహిత్య వారసులు అనుకోవాలా? మీ కుటుంబంలో మరెవరైనా సాహిత్య సృజన చేసినవారున్నారా?**

ఆస్తికైతే ప్రత్యేకించి వారసులు ఉంటారు. కానీ సాహిత్యకారులకు ఆ రంగంలో విశేష కృషి చేస్తున్న వారంతా వారసులే. నా వరకు నేను భాషా ప్రవీణ చదువుకుని పండిత శిక్షణ పొంది తెలుగు ఎంఏ చేసి మూడు దశాబ్దాలు తెలుగు పండితుడుగా పనిచేసిన వాడినే. కుటుంబ వాతావరణం, సంస్కృతాంధ్రాలు చదివి ఉండడం నన్ను సాహిత్యం వైపు, తెలుగు పండితుడిగా ఉద్యోగం వైపు ప్రోత్సహించాయి. పద్యం రాయడం మొదలుపెట్టిన రోజుల్లో పెదనాన్నగారి 'ఆంధ్ర పురాణం' చేతికొచ్చింది. రాస్తే పెద్దనాన్నగారిలా పద్యం రాయాలి. లేకపోతే ఊరుకోవాలి. కానీ ఊరుకోలేకపోయాను. వచన కవిత్వం వైపు మళ్లాను. 70–80 దశకాలలో కాకినాడలో గొప్ప సాహిత్య వాతావరణం ఉండేది. సోమ సుందర్, అద్దేపల్లి వంటి వారు ఉత్సాహభరితంగా సాహిత్య కార్యక్రమాలు చేసేవారు. వాటిలో పాల్గొనడం నాకు మరింత స్ఫూర్తినిచ్చింది. అప్పుడప్పుడు నేను రాసిన వచన కవిత్వం పత్రికల్లోనూ, ప్రత్యేక సంచికల్లోనూ ప్రచురణ కావడం మరింత ప్రోత్సాహాన్ని అందించింది.

మధునాపంతుల కుటుంబంలో సత్యనారాయణశాస్త్రి గారి మూడవ కుమారుడు మధునామూర్తి జర్నలిస్టుగా ఉద్యోగం చేస్తున్నాడు. వ్యాస రచనలు చేశాడు. మా చిన్నమ్మాయి మధునాపంతుల (ఆకొండి) రత్నకళిక కవిత్వం రాయడమే కాక 'ఆంధ్రి' పత్రికలపై పరిశోధన చేసి యంఫిల్ పట్టా పొందింది. మా తండ్రి 'మూక పంచశతి'ని అనువాదం చేసి 'దేవీ నవతి' పేరుతో ప్రకటించారు. మా తాతగారు 1927 లోనే ఆ కొండి రామమూర్తి గారి ఆయుర్వేద జీవితం మీద పెద్ద పుస్తకం రాశారు. ఆ విధంగా సత్యనారాయణ శాస్త్రి గారికి పూర్వమే సాహిత్య సృజన దిశగా అడుగులు వేసిన కుటుంబం మాది.

**ప్రతి ఏటా ఒక సీనియర్ రచయితకి, ఇద్దరు కొత్త వారికి మీరు కథా గౌరవ పురస్కారం ఇస్తున్నారు. దీని నేపథ్యం ఏమిటి? ఎంపిక బాధ్యత ఎవరిది? అలాగే ఆంధ్రీకుటీరం ఇస్తున్న ఇతర పురస్కారాల గురించి చెప్పండి?**

మా కుటుంబాలకే చెందిన మధునాపంతుల వెంకటేశ్వర్లు మధుశ్రీలు పేరుతో కవితలు, కథలు రాసేవారు. ఆయన కుమారుడు కిరణ్ మధునాపంతుల సాఫ్ట్వేర్ రంగానికి చెందిన పారిశ్రామికవేత్త. ఆయన తన తండ్రి మరణానంతరం ఏటా 'కథా గౌరవం' అనే పేరుతో ఇద్దరు సీనియర్లకు రూ.20,000 చొప్పున ఒక కొత్త కథా రచయితకు రూ.10,000 చొప్పున నగదు బహుమతి ఇచ్చి సన్మానిస్తున్నారు. ఇక ఆంధ్రీకుటీరం పురస్కారాల మాటకొస్తే ఏటా మధునాపంతుల వారి జయంతులు, వర్ధంతులు జరుపుతాం. కవి పండితులను గౌరవిస్తాం. అలాగే రామకృష్ణ కవుల సాహిత్య సమాలోచన సభలు జరుపుతాం. అవధాన రంగానికి చెందిన వారిని గౌరవిస్తాం. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం (పద్యకవిత్వం), దర్భశయనం శ్రీనివాస ఆచార్య (వచన కవిత్వం) మొదటి పురస్కారాలను అందుకున్నారు. ఇక పురస్కారాల ఎంపికకు ప్రత్యేకమైన జ్యూరీ అంటూ ఏమీ ఉండదు. మా కుటుంబాలలో చాలా మంది మంచి చదువరులు ఉన్నారు. మేమే వీలైనప్పుడల్లా సేకరించి చదువుకొని ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకొని నలుగురు ఐదుగురిని ఎంపిక చేస్తాం. కిరణ్ మధునాపంతుల, నేను ఒక నిర్ణయానికి వచ్చాక ప్రకటిస్తాం. కొందరు మిత్రులు 'ఫలానా రచయితలు మీ దృష్టికి వచ్చారా' అని అడిగినప్పుడు ఆ పుస్తకాలు మా దగ్గర లేకపోతే డబ్బు పంపి తెప్పించుకుని, చర్చించుకుని ఒక నిర్ణయానికి వస్తాం.

**ఈ మధ్య మీరు ఈ ఆంధ్రీ కుటీరంలో ప్రారంభించి 'రత్నప్రభ' గ్రంథాలయం గురించి చెప్పండి?**

రత్న ప్రభా గ్రంథాలయం 2024 జనవరిలో ప్రారంభించాం. కవి, రచయిత మిత్రులు కొందరు వదాన్యులు ఇప్పటికీ 12 వేలకు పైగా పుస్తకాలు వితరణ చేశారు. ఈ గ్రంథాలన్నీ సంరక్షించడానికి ఒక సువిశాలమైన గదిని, లైబ్రేరియన్‌ను ఏర్పాటు చేశాం. పరిశోధకులు, కవులు వస్తే వారు ఉండడానికి మంచి గది ఏర్పాటు చేశాం.

ఇంటర్వ్యూ ■ ముక్కామల చక్రధర్

## వేయి గుండెల పద ప్రదర్శన

Art in its existence itself is subversive.
Because it has to destroy the old
to create new - Habib Tanvir
(కళ తన అస్తిత్వంలోనే తిరుగుబాటు తత్వాన్ని కలిగి ఉంటుంది. ఎందుకంటే కొత్త దాన్ని సృష్టించడానికి పాత దాన్ని ధ్వంసం చేయాల్సి వుంటుంది – హబీబ్ తన్వీర్)

స్వపల్లేరు పర్వతాలెక్కి సమస్త భూ దుఃఖ సాగరం లోకి దూకి మరణించి... తన నెత్తుటితో తానే లోదీపాలని వెలిగించుకొని... మళ్లీ దూకే ఒక పునః ఫినిక్స్ రసక్రీడ: గాజోజు నాగ భూషణం సృజన – కవితైనా, కథైనా.



తమ యమపాశాల్తో తమను తామే బంధించుకొని, కోటి గాయాల వీణ తెలంగాణ స్వహస్త మీటులతో మెట్లెక్కుతున్న వాడు కాదు మనవాడు. ఏసీ గదుల్లో పడుకొని, ఉద్యమ యాగం లోకి నరమానవ పెట్రోళ్లు పోస్తూ నాగస్వరం ఊదుతున్నవాడు కాదు. అక్షరాలతో రాజచరణాలకు Luxలవుతున్నవాడు కాదు.

అతని కవిత్వ సంపుటి 'ప్రాణదీపం' ఎనభై ముక్కల కన్నీటి ఆట... తెరవంగనే టైటిల్స్ లోనే విభిన్న నామాలు, సర్వనామాలు, మానాలు, విశేషణాలు, అశక్తతలు, ప్రశ్నలు, ఆశ్చర్యాలు, పదచిత్రాలు, రూపకాలు, ధిక్కారాలు, Metanonyలు, simileలు సవాలక్షల కలగూర గంపలై, చేతుల్లో కాళ్ళేసుకొని నడుములకు రెక్కలు తొడుక్కొని, నీ చుట్టూ తిరిగి, భూమి చుట్టూ తిరిగి తిరిగి, నీ ఎముకల్లోకి ఇంకిపోతాయి. ఇప్పుడిక నువ్వు నువ్వు కాకుండా పోయి ఒక మహా దుఃఖాన్నీ అనంత ఆగ్రహాన్నీ శిగమూగుతావు. భూషణం వాడిన కొన్ని తెలంగాణ సజీవ జన భాషణలు: తాయిమాయి తండ్లాట, నెత్తి మీద నిండవడ్ల బస్తా, తీరొక్క శోకం, మాయా తెర్మల మర్మం, ఎడ్దేడ్చిన ఎవుసం, తెగ్గోసుకున్న బొడ్డుతాడు, ఊపిరి ఊరి వరదగూడు, వాగు వట్టిపోయి, గత్తరచ్చి విడిచిపెట్టిన గ్రామం, తేజాబులో ముంచి, ఇవురంతో ఇంటి మొగురం, పన్గడి దాటాలే, పబ్బతి పట్టలేరా, తాయిలాల తరాజు, పగిలిన సల్లకుండ, నెనరెక్కువ... ఇలా ఎన్నో.


యే దేశపు, యే ప్రాంతపు, యే వర్గపు, యే కులపు, యే లింగపు కవి అయినా లోపల ఒక పసిబాలిక, వో సౌందర్యోపాసకుడు ప్రేమ మాలలు ధరించి నిత్యం ఖడ్గనాట్యం చేస్తుండాలి. ఎటో ఒకవైపు ఉన్నవాడు మాత్రమే సృజన చేయగలడు. గోడమీది పిల్లులు నెలనెలా మూడొందల కాపీల అక్షరాల గుట్టల్ని మాత్రమే పోగు చేయగలవు. కవీ, కళాకారుడు మరణించే వరకూ మహా స్వార్థపరుడై ఉండాలి – తన కవిత కోసం, తన కళ కోసం. అర్జునుడికి శతకోటి ఆకుల కోటికొమ్మల లక్షల పావురాల గుంపులోని ఒకే పావురపు ఒకే కన్ను కనిపించినట్టు, రాత్రీ పగలూ ఇరవ ఐదు గంటలూ తన కంటికి తన కవితా తన కళా తప్ప ఇంకేమీ కనిపించకూడదు. తన అంతర్ బాహ్య ప్రపంచాల్ని – అందువసించు, వర్ధిల్లు, ఘర్షించు సమస్త భౌతిక, అధిభౌతిక జీవనిర్జీవాల్ని ధ్వంసం చేసుకోవాలి – బంధాల్నీ జల సంద్రాల్నీ విప్లవాల్నీ పోరాటాల్నీ దుఃఖాల్నీ నెత్తురుల్నీ దేవుళ్లనీ మనుషుల్నీ మతాల్నీ వర్గాల్నీ కులాల్నీ ప్రకృతినీ సంఘర్షణల్నీ సంవేదనల్నీ సకల తాత్వికతల్నీ ఉద్వేగాల్నీ – ధ్వంసం చేసీ – చివరకు తనని తాను ధ్వంసం చేసుకొని అంతర్ధానమైపోవాలి – 'ఇంకా ఇంకేం మిగిలింది దెంచనాలా! సకలం బూడిద కుప్పలే కదా' అనుకుంటున్నారు కదా! Yes, exactly! – ఆ బూడిద plus సృజన పనిముట్లూ మాత్రమే మిగలాలి. అప్పుడు దానంతట అదే ఒక abstract mythological act జరిగి కళ ఉద్భవిస్తుంది. ఆ కళే తన సృజనకారున్ని మళ్ళీ బతికించుకుంటుంది.

'ప్రాణదీపం' కవిత్వ సంపుటి లోని 'విభ్రాంత క్రీడ' కవిత గాజోజును తన ముప్పై ఏళ్ల ప్రస్థానం నుంచి వేరు చేసి ఒక గొప్ప ఆధ్యాత్మికతత్వ కవిగా నిలబెడుతుంది. శృతిలయల సంభోగ సంద్రంలో నిండా మునిగి, పాట–వచన కవిత అర్ధనారీశ్వరమైనది ఇక్కడ– పాడుకోడానికీ చదువుకోడానికీ ఆడుకోడానికీ. ఒక తెలుగు సీనియర్ కవి వచన కవితను సంగీతం నుంచి విడదీయాలన్నాడు కానీ అలా విడదీయటం పాశ్చాత్య ప్రతిభకు పెద్ద పీట వేసి, భారతీయ indigenous సిద్ధ సాధు యోగుల భక్త మూలవాసుల ఆదివాసీ బహుజన కవుల జన సహజ సృజనకు చిన్న పీట వేస్తుందని నా అభిప్రాయం. 'జలకన్య అడుగులకు తడబడని ఆటనేర్పేటి ఆదిగురువెవ్వరు?/ విశ్వవినువీధుల్లో వెలిగేటి దీపాల కాంతి కారకుడైన విభుడు ఎవరు?'... ఇలా సాగే ఈ కవితను హేతువాది, కమ్యూనిస్టు అయిన గాజోజు ఎట్లా రాస్తాడు? అని మనం అనుకోవచ్చు. సైన్సునీ దేవుడ్నీ విశ్వసృష్టి నిరూపణలనీ మతాన్నీ అనుమానించడం అంటేనే ఓషో వలె గాజోజు కొన్ని వందలేళ్ళు ముందుకు పోయి ఆలోచిస్తున్నాడని అర్థం. కవిత చివరి పంక్తుల్లో ఆయనలోని సాంప్రదాయ హేతువాదిని కూడా మనం దర్శించొచ్చు.

'ప్రాణ దీపం'లోని చాలా కవితలు ఆశావాద కవితలు. తరువాత రాసిన 'ఉదయాస్తమయాల ఊయల' లో కనీసం ఆశానిరాశల సందిగ్ధ సంఘర్షణను ప్రదర్శిస్తాడు 'చీకటి కడుపులో వెలుగు దాగుందో వెలుతురు పిడికిట్లో చీకటి బందీ అయ్యిందో' అంటూ... బైరాగి నైరాశ్యం గురించి పాలగుమ్మి 'అది మనసును క్రిందకు లాగేది కాదు, అంతరాత్మను బయటకుతీసే ప్రభంజనంలాంటిది అంటాడు'. కరీంనగరం మట్టికి పుట్టడం మూలాన గాజోజు బోధించే కవిత్వం కూ.... డా.... రాస్తాడు. ఏకశిల్ప అనేకవస్తువుల

> **భూమి ఆచంద్రతారార్కం ఉన్నట్టే యుద్ధాలూ, పోరాటాలూ, పెద్దమ్మలూ, అవమానాలూ, చెరువులూ, చిలకలూ ఉంటాయి. ఆధునికానంతర కవిని అంత్యక్రియల వరకూ ఇవి మాత్రమే వేటాడకూడదు. ఇప్పుడిక వర్తమాన కవి ఎప్పటికీ పొడవని ఉదయాల్ని కాక నిత్యం అనుభవిస్తున్న అస్తమయాలని ఆహ్వానించాలి.**

గాజోజు కవిత్వం చదువరుల్ని తప్పక disturb చేస్తుంది. తన తల్లి మీద రాసిన semi biographical కవిత 'ప్రాణదీపం' మన అమ్మలను మనకు ఒడినింపుతుంది– ఈమె గ్రామీణ అమ్మ, కుటుంబం కోసం లోకంతో పోరాడి గెలుపోటముల శిలువే యించుకున్న అమ్మ, తాను ఉపాసముండి మనకు ఆన్లెపు కాయలు తినిపించిన అమ్మ, ఒక చేతిలో కొడుకును మరొక చేతిలో వడ్ల బస్తాను మోస్తూ జీవన గంగను దాటిన అమ్మ, గడప గడపకొక గాయాన్ని చేసుకున్న అమ్మ.





'మహా నిర్మాణ వేదిక' కవితలో పద చిత్రాలు అంత్య కవితల్లో లేని నైరాశ్యం వర్ణించడం నాకు మహానందమున్నూ మహాశ్చర్యమున్నూ. 'విస్ఫోటానంతర వినిర్మాణ సౌందర్య రూపమే జగత్తంతా/ జొమాటో కుర్రాడిలా మరణం తలుపు ముందర నిల్చొని ఎదురుచూస్తుంది/ రిక్తహస్తాల నిష్క్రమణలు/ బతుకమ్మ పూలకు బదులు నదుల శవాలను.../ మునిగిపోతున్న నావలో మునగబోతున్న ముసాఫిర్‌వి/ పట్టుకపోవడానికి పిడికెడు మట్టి పనికి రానిదయ్యె'. – ఇట్లా విభిన్న నవ సమయాల మీద రాసిన కవి.. కొన్ని 'అడివంటుకోకముందే', 'యదాతథంగా', 'కవిత్వం ఒక తపస్సు', 'ఆ కలం' లాంటి cliche కవితలు కూడా రాశాడు.

భూమి ఆచంద్రతారార్కం ఉన్నట్టే యుద్ధాలూ, పోరాటాలూ, పెద్దమ్మలూ, అవమానాలూ, చెరువులూ, చిలకలూ ఉంటాయి. ఆధునికానంతర కవిని అంత్యక్రియల వరకూ ఇవి మాత్రమే వేటాడకూడదు. ఇప్పుడిక వర్తమాన కవి ఎప్పటికీ పొడవని ఉదయాల్నికాక నిత్యం అనుభవిస్తున్న అస్తమయాలని ఆహ్వానించాలి. సత్యానంతర సంధి యుగాన నిజ అనిజాల మధ్య చెరిగిపోతున్న రేఖలను దెయ్యమూగాలి. ఏక శిల్ప ఆధునిక కవులు అతికొద్దిమందే అవని మీద సృజనకారులైనారు. తెలుగు భూమండలంలో తొంభైమంది ఏకశిల్ప ఏకవస్తు పూజారులు. సకల కార్యకర్తలకు రక్తమేదైనా నెత్తురే. జన్మచితి ప్రయాణమంతా తన మీద అణచివేత ఉందనీ తనను రేప్ దోపిడీలు చేశారనీ తనను కులదహనం చేశారనీ క్షణానికొక యుద్ధం జరుగుతుందనీ ఆధునికానంతర కవి ఏకశైలి ఏకవస్తు మహాboring నర్తనం చేయకూడదు. చేస్తే తాను శాస్త్రీయ, జానపద కవిగా మిగిలిపోతాడు.

■ శ్రీనివాస్ దెంచనాల
✆ 98483 26517

బొమ్మలు: అక్బర్

## సాకలమ్మ



సూర్యుడు కాలాన్ని మోసినట్లు
క్రీస్తు శిలువను భరించినట్లు
వీపులమీద కొండంత మురికి బట్టల మూట
చాకిరేవుకీ ఊళ్లకీ రాసిచ్చిన రాగిశాసనం బాట
వానొచ్చినా రాకపోయినా వెలుగొచ్చినా కరువొచ్చినా
చెరువు బండ మీదనే బతుకింకిపాయే!

నిలబడిన నీళ్లల్ల సవికిన కాళ్లు బర్రెజెనిగల తూట్లు
ఉస్సో ఉస్సో హైలెస్సా బండపై వరుస బతుకు దర్వులు
దరువు దరువుకు పత్తిపూల తెలుపులు
ఆరేసిన బట్టల సింగిడి మీద పిట్టల ముచ్చట్లు
ఇంట్ల ఆకలి మంటలు వీధిలో ఎగతాళి సామెతల పోటులు
ఒక్కరోజు సుస్తయినా
సాకల్ది ఇంటికే రాకపాయని ఈరంగ మేసే పెత్తందారులు
మిరాశీ ఇచ్చేకాడ మాత్రం నెత్తులు గోకుతరు

చెరువెండినా
చెలిమె అలిగినా కాలువ వొట్టిపోయినా
చెరువుమీద చాకిరేవాగలే
చావు వార్తలకు పెళ్లి పిలుపులకు
ఊరూరూ ఉత్తరమ్మై తిరిగి ఎద్దుగిట్టల్లా అరిగిన కాళ్ళు
చాకిరేవు పిలుపు మేలుకొలుపు

పిల్లోడు బడికోయినట్లు
దినం తప్పకుండా ఇటింటి మైలగుడ్డలు
మూడురాళ్ల మీద గూనపెంకులా పొయ్యి
అరచేతిలో పులిమి పులిమి రేవు ఒడ్డున చెక్కరొచ్చే
పలక బలపం పట్టకపోయినా
ఏ ఇంటి కాయింటి ఏ అమ్మ కాయమ్మ
పిండేసిన బట్టల లెక్క మరువని లెక్కల టీచర్
సద్దిబువ్వేసినా బెల్లం గారెనేసినా ముక్కిరుసకుండా
ఊరి ఆరోగ్యమే మహాభాగ్యమని భూదేవిలా మురిసి నడిచే

చంద్రవంకలా దివిటి కోలెత్తి పెళ్లంత తానై ముందు నడిచే
అవిరేను ముందు అమ్మమ్మలా మిత్తితీసి దీవించే
చావుకర్మలల్ల రుడం తీసి అందరికన్న ముందే నీళ్లల్ల మునిగే
ఇల్లంత సున్నమేసి ఇండ్లసందాకలి ఊడ్సి
ఎంగిలి ఆకులు తీసి, ఇంటికోతమ్మా! అన్నప్పుడు
పాతచీర చేతుల పెట్టి పాడుబుద్ధిని పోనిచ్చుకోరు

పురుట్ల నెత్తురంతెత్తి పురుడుపోసే
సమర్తతే శుభ్రం చేసి మూలన బట్టపరిసి
ముట్టుగుడ్డలు పీతిబట్టలు కాన్పుబట్టలు చావుగుడ్డలు
ఇంటివెట్టి ఊరువెట్టి ఈతపోర్కై ఊడ్సే
సబ్బులు సర్ఫులు డిటర్జంట్లు లేని కాలంలో
సౌడును సబ్బుగా కనిపెట్టిన శాస్త్రజ్ఞులు
సచ్చేదాక సేవలై తనువు బాణమైనా ఏ గౌరవాన్ని నోచుకోలే

చావిడికైనా దేవళానికైనా
కోటమైసమ్మ పండుగైనా పోశమ్మకు బోనాలైనా
గోడల బూజు దులిపి నిండుపున్నమై పూసే కుంచెలు
దేవుడి ముందు నైవేద్యమైనా దేవర ముందు యాటకోసినా
ఎర్రకూడు పచ్చకూడు తెల్లకూడు దిష్టితీసే పెద్దమ్మ
గండదీపానికీ మట్టంటకుండా అరచేతులను కోకలుగా పరిచే
సాంప్రదాయాలను మూలసుక్కలా నిలబెట్టిన తల్లి

పనంతా తనదే బరువంతా ఆమెదే ఊరిమురికంతా మింగింది చాకిరంతా మోసింది
రేవునుండి బట్టలమూటతో వాకిట్లో చంద్రకాంతి
ప్రతి ఇంటికి కడపలా ఆడబిడ్డై సేవలుచేసే మానవతామూర్తి
సాకలమ్మ లేని ఊరు బండి యాట తాడుతెగినట్లే
తెలుపు లేని నలుపు మామిడి తోరణం లేని పెళ్ళే!

■ వనపట్ల సుబ్బయ్య
✆ 94927 65358

## నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు.

వేయిస్తంభాల ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



# దారంతా పూల వనమే..

### అలరించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

- పల్లె, పట్టణాల్లో గుబాలించిన పూల పరిమళం
- తంగేడు, గునుగు పూలతో అందంగా పేర్చిన మహిళలు
- కిటకిటలాడిన వేయిస్తంభాల గుడి ప్రాంగణం
- పాల్గొన్న డిప్యూటీ సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ఆరంభమైన ఉత్సవాలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళలు సంప్రదాయ బద్ధంగా ఆడిపాడారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మధ్యన పెట్టి చుట్టూ వలయాకారంగా తిరుగుతూ మహిళలు సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే వేడుకల్లో భాగంగా మొదటి రోజు తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల, గులాబీ, బంతి పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. పసుపుతో గౌరమ్మను చేసి పూజించారు. పూజా మందిరాల్లో పెట్టి పప్పు, బెల్లాలతో నైవేద్యం పెట్టారు. అందరినీ చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు.

**వేయిస్తంభాల ఆలయంలో..**

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలను డిప్యూటీ సీఎంతో సహా అనేక మంది మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలో వేడుకలను ప్రారంభించారు. వేయిస్తంభాల ఆలయంలో తొలి నాటి బతుకమ్మ వేడుకల ప్రారంభం పర్వంలో భాగంగా జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల, సంగీత నాటక అకాడమి చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాలతో సహా అనేక మంది ప్రముఖులు పాల్గొని మహిళలకు ఉత్తేజాన్ని నింపారు. అంతకుముందు వేదిక మీద నుంచి కొండా సురేఖ చిత్తు చిత్తుల బొమ్మ అంటూ బతుకమ్మ పాటను తాను పాడుతూ వేడుకలకు వచ్చిన మహిళలచే పాడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాంతికృష్ణ సేవాసమితి నిర్వాహకులు వంగాల శాంతికృష్ణ ఆచార్య రూపొందించిన బతుకమ్మ తల్లి ఆవిర్భావ చరిత్ర గ్రంథాలను మంత్రులకు బహూకరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తొలినాటి బతుకమ్మ వేడుకలకు ఆలయ ప్రాంగణాలు వేదికలుగా నిలిచాయి. మహబూబాబాద్, భూపాలపల్లి,

(మిగతా 6లో..)



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వేడుకలో పాల్గొన్న మంత్రులు సురేఖ, సీతక్క, ఎంపీ కావ్య, మేయర్ సుధారాణి





వేయిస్తంభాల ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గంధం పూసుకుంటున్న మహిళలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

# అదరహో 'చాకలి ఐలమ్మ'

- కాళోజీ కళాక్షేత్రంలో అలరించిన నృత్యనాటకం
- అద్భుతంగా అలేఖ్య పుంజాల నటనా కౌశలం
- ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంగీత, నాటక అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన చాకలి ఐలమ్మ నృత్య నాటిక అదరహో.. అనిపించేలా చేసింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రేక్షకులతో కాళోజీ కళాక్షేత్రం కిటకిటలాడింది. సమస్త జిల్లా యంత్రాంగం, మంత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నృత్య నాటికను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళ యోధురాలు చాకలి ఐలమ్మ గాధను ప్రేక్షకులకు నాట్య ప్రదర్శన ద్వారా అందించారని కొనియాడారు. ఐలమ్మగా అద్భుత ఆహార్యంతోపాటు నటన కౌశలాన్ని ప్రదర్శించిన సంగీత, నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాలను ఆయన అభినందించారు. నేటితరం యువతకు చాకలి ఐలమ్మ వంటి విప్లవ మహిళల గురించి తెలియజేసేలా ఉన్న ప్రదర్శన అద్భుతమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, దనసరి సీతక్క, రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే

(మిగతా 6లో..)

**నేటి కార్యక్రమాలు**

కాళోజీ కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న నృత్య నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు వరంగల్‌లోని తెలంగాణ డ్రమాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదానందం రాసిన రాణిరుద్రమ నాటక ప్రదర్శనతో పాటు గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాసాహిత్య కళారూపాలు జీవన సంఘర్షణ పేరిట అరుదైన నృత్యరూపక ప్రదర్శనను నిర్వహించనున్నారు.



చాకలి ఐలమ్మ నృత్య నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

## నేటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు

- 27 కిలోల పసుపుతో భద్రకాళి అమ్మవారికి హరిద్రాభిషేకం
- ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు



అమ్మవారికి హరిద్రా పసుపుతో అభిషేకం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ప్రజల ఆరాధ్య దేవత అయిన భద్రకాళి దేవస్థానంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆదివారం అమావాస్య రోజున 27 కిలోల పసుపు చూర్ణంతో వైదికపరంగా ప్రధానార్చకుడు భద్రకాళి శేష నేతృత్వంలో అర్చక బృందం

(మిగతా 6లో..)

# యజ్ఞంలా మేడారం పనులు

- అధికారులు సమన్వయంతో వ్యవహరించి పూర్తి చేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై సమీక్ష



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మేడారంలో అభివృద్ధి పనులను యజ్ఞంలా చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. చరిత్రలో నిలిచేలా శాశ్వత పనులకు శ్రీకారం చుట్టామని, సమ్మక్క-సారలమ్మ తల్లుల కీర్తిని భావి తరాలకు అందించాలన్నదే లక్ష్యమని తెలిపారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆమె ఆదివారం పర్యటించారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో మేడారంలో ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. దేవస్థానం ప్రాంగణం, పరిసరాలను పరిశీలించారు. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల స్థలాల మార్పు, ప్రాకారం విస్తరణ, మాస్టర్ ప్లాన్ డిజైన్, అతిథి గృహాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులపై కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తోపాటు వివిధ శాఖల అధికారులతో చర్చించారు. సెక్టార్ల వారీగా అభివృద్ధి పనుల బాధ్యతలను అధికారులకు అప్పగించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడారు. గుడి నిర్మాణ పనుల్లో అధికారులు అందరూ తమదైన బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ముందుగా ఏ పనులు చేపట్టాలో పూజారులను అడిగి తెలుసుకోవాలన్నారు. పనులన్నీ ఓ యజ్ఞంలా చేపడుతున్నామని, ఇందులో ఎవరికీ ఎలాంటి దురుద్దేశం ఉండొద్దని అన్నారు. రాష్ట్రంలో గిరిజన దేవస్థానానికి ప్రపంచ ప్రఖ్యాతి పొందాలనే సంకల్పంతో ప్రభుత్వం వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగానే 2వేల మంది వర్కర్లతో పనులు ప్రారంభిస్తున్నామన్నారు. వీటిని అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తల్లులపై ఉన్న భక్తిశ్రద్ధలతోనే చరిత్రలో నిలిచేలా శాశ్వత నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. 2026 జనవరి 28న జరిగే సమ్మక్క-సారలమ్మల మహాజాతరకు వచ్చే భక్తులకు సంపూర్ణ దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

**సీఎం పర్యటనపై సమీక్ష**

అనంతరం గద్దెల పరిసరాలలోని పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తో మంత్రి సీతక్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. సెక్టార్ల వారీగా నియమించిన పనులను అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించి సీఎం పర్యటనను విజయవంతం చేయలన్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.





# 'విషాద' యాత్ర

- దుసపాటిలొద్ది జలపాతం వద్ద ప్రమాదం
- నీట మునిగి యువకుడి మృతి
- కాపాడేందుకు యత్నించిన ముగ్గురు
- వారిని రక్షించిన మరో యువకుడు



మహేశ్విన్ మృతదేహం



మహేశ్విన్ స్నేహితులతో చివరి సెల్ఫీ

వాజేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో ఉన్న దుసపాటిలొద్ది జలపాతం వద్ద ఆదివారం ప్రమాదం జరిగింది. జలపాతంలో నీట మునిగి యువకుడు మృతి చెందాడు. స్నేహితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌కు చెందిన మహేశ్విన్ (18), హర్షారెడ్డి, శివారం, అర్జున్, అభిరామ్, సాక్షిత్‌తోపాటు దంపతులు రాకేష్, పూజ స్నేహితులు. వీరంతా కలిసి ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో బయల్దేరి వాజేడు మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో ఉన్న దుసపాటిలొద్ది జలపాతం వద్దకు వచ్చారు. ఉదయం 8.30 గంటల సమయంలో చేరుకున్నారు. ప్రకృతి అందాలను వీక్షిస్తూ జలపాతం వద్ద సందడి చేశారు. వీరిలో మహేశ్విన్ జలపాతం కింది భాగంలో ఉన్న నీటి అంచు భాగంలో నిలబడి ఫొటోలు తీసుకుంటూ ఒక్క సారిగా నీటిలోకి జారిపడ్డాడు. మునిగిపోతున్న అతడిని పక్కనే ఉన్న పూజ, శివరాం, హర్షారెడ్డి ఈత రాకపోయినప్పటికీ కాపాడేందుకు నీటిలోకి దూకారు. పూజను పట్టుకునేందుకు మహేశ్విన్ యత్నించినా ఫలితం లేకుండా పోయింది. పూజ, శివరాం, హర్షారెడ్డి సైతం మునిగిపోతుండగా ఒడ్డున ఉన్న వీరి స్నేహితుడు అర్జున్ నీటిలోకి దూకి ఈత రాకపోయినప్పటికీ వారు ముగ్గురిని ఒడ్డుకు చేర్చాడు. అప్పటికే మహేశ్విన్ నీట మునిగి గల్లంతయ్యాడు. ఈ క్రమంలో స్నేహితులు స్థానికుల సాయంతో పోలీసులకు, అటవీ, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్థానిక ఈతగాళ్ల సాయంతో మహేశ్విన్ మృతదేహాన్ని వెలికి తీశారు. మహేశ్విన్ హైదరాబాద్‌లో బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నాడు. తండ్రి పవన్ సాయి గణేష్ ఓ ప్రైవేటు కంపెనీలో

(మిగతా 6లో..)

## వాహనాల మరమ్మతులో వేగం పెంచండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- బాలసముద్రం వెహికల్ షెడ్డు అకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించిన వాహనాల మరమ్మతులో వేగం పెంచాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త తరలింపు వాహనాలకు జీపీఎస్‌ను అమర్చి బల్దియా ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీకి అనుసంధానం చేయాలన్నారు. చెత్తను సేకరించే వాహనాల డ్రైవర్లు తప్పకుండా రిజిస్టర్ నిర్వహించాలని, చెత్త సేకరించిన ప్రతీ ఇంటి నుంచి సంతకాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ మాధవీలత, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్‌తో పాటు అక్కడి సిబ్బంది పాల్గొన్నారు.



పాకాల మత్తడిలో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

## పాకాలలో పర్యాటకుల సందడి

ఖానాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్యాటక ప్రదేశమైన పాకాలలో ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చి సందడి చేశారు. పాకాల సరస్సు నెలరోజులకు పైగా మత్తడి పోస్తూ కనువిందు చేస్తుం డడంతో పర్యాటకులు మత్తడి అందాలను వీక్షిస్తూ ఈతలు కొడుతూ సరదాగా గడుపుతున్నారు. అదేవిధంగా పాకాల సరస్సులో బోటు షికారు చేశారు. కొందరు పర్యాటకులు సీతాకోకచిలుకలు, ఔషధమొక్కల పార్కును సందర్శించారు.

## టెట్‌పై ఆందోళన అవసరం లేదు

**రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రవి**




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రవి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): టెట్‌పై ఉపాధ్యాయులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైతే రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) తరఫున సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుని రవి స్పష్టం చేశారు. ఆదివారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన హనుమకొండ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ.. టెట్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా 25 లక్షల మందికి ఇబ్బందిగా మారిందన్నారు. 5 ఏళ్లకు మించి సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులందరూ టెట్ పాస్ కావాలనడం సరికాదని, దీనిలో అనేక సమస్యలున్నాయన్నారు. ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వం, ఎన్‌సీఈఆర్టీ దృష్టికి తీసుకెళుతామని, అవసరమైతే సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పెరిగిందని, ప్రతీ రోజు ఓ కొత్త కార్యక్రమం పెడుతూ ఉపాధ్యాయుల బోధన సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తున్నామని, ప్రభుత్వానికి త్వరలోనే ప్రాతినిధ్యం చేస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.రాంబాబు, వి.రాంబాబు, ఆర్థిక కార్యదర్శిగా డి.శివకోటి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ యాట సదయ్య, రాష్ట్ర ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, సాంబయ్య, వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మధులిమయే, నాగారాజు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

## పోడు చేస్తున్న వాహనాలు పట్టివేత

శాయంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరేణిగూడెం అటవీప్రాంతంలో పోడు చేస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు మారెపెల్లి సునిల్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అటవీ భూమిని చదునుచేస్తున్నారనే సమాచారంతో డిప్యూటీ రేంజర్ మైసయ్య తన సిబ్బంది అలాగే వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యులు రెండు బృందాలుగా విడిపోయి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రెండు డోజర్ల ను స్వాధీనపరుచుకుని, జిల్లా అటవీ కార్యాలయానికి తరలించినట్లు తెలిపా రు. తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



# ఆర్టీసీ టెండర్లలో గోల్‌మాల్

● అధికారుల కక్కుర్తితో సంస్థ ఆదాయానికి గండి ● మండిపడుతున్న టెండర్‌దారులు ● పట్టించుకోని ఉన్నతాధికారులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాల టెండర్లలో గందరగోళం నెలకొంది. ఏళ్ల తరబడి హోటల్ నిర్వహిస్తున్న వ్యక్తి విసిరిసిన కాసులకు ఓ అధికారి కక్కుర్తి పడి అతడికే దక్కేలా ప్లాన్ వేశారు. ఇది మిగతా టెండరు దారులకు ఆగ్రహాన్ని తెప్పించింది.




### సంస్థకు నష్టం

హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని ఐదేళ్లకోసారి టెండర్ల ప్రక్రియ నిర్వహించి షాపులను కేటాయిస్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బస్టాండ్‌లలో మొత్తం 28 స్టాల్స్‌కు టెండర్లను ఆహ్వానించగా, 40 మంది పాల్గొన్నారు. ఇందులో ఎక్కువ ధరకు కోట్ చేసిన వారికి కేటాయించకుండా డిజిటల్ కీ సమస్య కారణంగా ఈ టెండర్లను గతంలో రద్దు చేశారు. ఈ విషయంలో ఒక అధికారిపై చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ ఆదేశాలతో తిరిగి ఆగస్టు నెలలో టెండర్లను పిలిచారు. ఈ టెండర్ల ప్రక్రియలో 60 మంది టెండర్‌దారులు ఆన్‌లైన్ ద్వారా టెండర్ వేశారు. ఎవరు ఎక్కువ అద్దె చెల్లిస్తారో వారికి నిబంధనల ప్రకారం ఈ షాపులను ఆర్టీసీ అధికారులు కేటాయించాల్సి ఉంది. కానీ అక్రమ మార్గంలో ఓ అధికారి బస్టాండ్‌లోని ఓ హోటల్ వ్యక్తి నుంచి రూ. లక్షల్లో ముడుపులు తీసుకొని అతడికే టెండర్ దక్కేలా ప్రణాళిక రచించారు. నోటీస్ బోర్డులో పెట్టకుండా గుట్టు చప్పుడు కాకుండా టెండర్ పిలిచి ఎక్కువ వేసిన వారిని తిరస్కరించి ఆ హోటల్ నిర్వాహకుడికే టెండరు దక్కేలా చేశారు. దీంతో మిగతా టెండర్‌దారులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఆర్టీసీకి ఆదాయం వచ్చే షాపుల టెండర్లలో సుమారు ఒక క్యాంటీన్‌కు నెలకు రూ.ఎనిమిదిన్నర లక్షలకు పైగా ఆన్‌లైన్ ద్వారా టెండర్ వేసిన వ్యక్తిని తిరస్కరించి రూ.5లక్షలకు పైగా టెండర్ వేసిన వ్యక్తికి టెండర్ ఖరారు చేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నాలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒకవైపు ఆర్టీసీ సంస్థ నష్టాల్లో కూరుకుపోయి ఉంటే.. హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని టెండర్ల విషయంలో మామూళ్లకు అలవాటుపడి అక్రమమార్గంలో కేటాయిస్తున్నారని టెండర్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ టెండర్లలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించి అధికారులపై చర్యలు తీసుకొని ఆన్‌లైన్ టెండర్ ఎక్కువ వేసిన వారికే పారదర్శకంగా షాపులు కేటాయించాలని టెండర్‌దారులు కోరుతున్నారు. కాగా, ఈ విషయంపై వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభానును వివరణ కోరగా.. హనుమకొండ బస్టాండ్ లోని క్యాంటీన్ విషయంలో పైనుంచి వచ్చిన ఆదేశాలతో లిఖితపూర్వకంగా నోట్ ఫైల్ చేసి పంపించామన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

# కోచ్‌ఫ్యాక్టరీలో నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి నిర్వాసితుల వినతి**



కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న భూ నిర్వాసితులు

కాజీపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సమీపంలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన భూనిర్వాసితుల కుటుంబీకులకు కోచ్‌ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ.. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రైల్వే జేఏసీ, భూ నిర్వాసిత గ్రామస్థులు సంయుక్తంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మతో కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతి పత్రంలో కాజీపేటను రైల్వే డివిజన్‌గా ఉన్నతీకరించాలని, కాజీపేట టౌన్ స్టేషన్‌ను చర్లపల్లి రైల్వేస్టేషన్ మాదిరిగా కారిడార్‌గా నిర్మించాలని, రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌ను నూతన హంగులతో కొత్త భవనాన్ని నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకుగాను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భూనిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, కాజీపేటను డివిజన్ స్థాయి ఏర్పాటుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చిస్తానని సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, వైస్ చైర్మన్ అనుమాల శ్రీనివాస్, కో- కన్వీనర్ కేతిరి సాయిరాజ్ తోపాటు అయోధ్యపురం మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, మాజీ ఎంపీటీసీ ఏసోబు, గ్రామస్థులు ఎం.రాజయ్య, ఎం. మల్లయ్య, ఈ. ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

### పోస్టల్‌శాఖ విశ్రాంత ఉద్యోగుల కృతజ్ఞతలు

**రాంనగర్:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేయడంపై కేంద్ర ప్రభుత్వ పోస్టల్‌శాఖ విశ్రాంత ఉద్యోగులు ఆదివారం బీజేపీ హనుమకొండ మాజీ అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని బాధితులతో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు తుమ్మ నరోత్తంరెడ్డి, సముద్రాల చక్రధర్‌రావు, చాడ జైహింద్‌రెడ్డి, పత్తి లింగారెడ్డి, కె. సాయిలు, తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగ్‌రావు, వైస్ చైర్మన్ శ్రీనువాస్, కో- కన్వీనర్ కేతిరి సాయిరాజ్, అయోధ్యపురం మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, మాజీ ఎంపీటీసీ ఏసోబు, రాజయ్య, మలయ్య, ప్రదీప్ పాల్గొన్నారు.

## అదరహో 'చాకలి ఐలమ్మ'

(5వ పేజీ తరువాయి)

గండ్ర సత్యనారాయణరావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి తదితర అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాలతోపాటు నాటకంలో పాల్గొన్న కళాకారులను మంత్రులు ఘనంగా సత్కరించారు. వడ్డేపల్లి కృష్ణ అద్భుతంగా రాసిన చాకలి ఐలమ్మ నృత్య నాటకానికి వీబీఎస్ మురళి సంగీత స్వరాలను సమకూర్చారు. 45 నిమిషాల పాటు కొనసాగిన నాటకం ఆద్యంతం ప్రేక్షకులను కుర్చీల నుంచి కదలనీయలేదు. తెలంగాణ భూసంస్కరణ చరిత్రలో ఒక అధ్యాయంగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితాన్ని ఆధునిక రంగస్థలంపై నాట్య రూపంలో తీసుకొచ్చిన అలేఖ్య పుంజాల, ఇతర కళా బృందాన్ని ప్రేక్షకులు పలుమార్లు కరతాళ ధ్వనులతో అభినందించారు.

## 'విషాద'యాత్ర

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగం చేస్తూ ఇద్దరు కొడుకులను చదివిస్తున్నాడు. పెద్దకొడుకు మృతితో కుటుంబం విషాదం అలుముకుంది. అప్పటివరకు తమతో ఉన్న మహేశ్విన్ మృతి చెందడంతో స్నేహితులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని జలపాతం వద్ద నుంచి కొంగాల వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. వాజేడు ఎస్సై జక్కుల సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నీట మునిగిన మహేశ్విన్‌ను గాలింపు చర్యలను చేపట్టిన వారిలో ఫైర్ సిబ్బంది అనిల్, శ్రావణ్, రవికుమార్, రాజేందర్, ఎఫ్‌బీవో లక్ష్మణ్‌దాస్ ఉన్నారు.

## నేటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు

(5వ పేజీ తరువాయి)



అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. హరిద్రా అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకొని తన్మయత్వం పొందారు. నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో రామల సునిత తెలిపారు. భక్తుల కోసం క్యూలైన్లు, పందిళ్లు, తాగునీటి వసతి, ఉచిత ప్రసాదం, రాత్రి అన్నప్రసాదం అందిస్తామని తెలిపారు. కాగా, వరంగల్ జిల్లా వ్యాప్తంగా నవరాత్రి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఊరూరా ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం వరంగల్ ఎంజీఎం సెంటర్ నుంచి దుర్గా మాత విగ్రహాలను తరలించారు.

## హసన్‌పర్తి గురుకులంలో ప్రక్షాళన

● ఇద్దరు గెస్ట్ ఫ్యాకల్టీపై వేటుకు రంగం సిద్ధం..?
● అధ్యాపక సిబ్బందికి నైట్ డ్యూటీలు ● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హసన్‌పర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డు తెలంగాణ బాలికల గురుకుల కళాశాలలో సూసైడ్ నోట్ కలకలంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు దీర్ఘకాలంగా పనిచేస్తున్న ప్రిన్సిపాల్‌తో పాటు గెస్ట్ ఫ్యాకల్టీ పనితీరుపై ఆరా తీసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. దీర్ఘకాలంగా పనిచేస్తున్న గెస్ట్ సిబ్బందితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న గెస్ట్ ఫ్యాకల్టీని తక్షణమే తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. అంతేకాకుండా గురుకుల కళాశాలలో బాలికల రక్షణ కోసం తప్పకుండా నైట్ డ్యూటీలు వేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ఆదివారం ప్రిన్సిపాల్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపక సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పరీక్షల సమయంలో సబ్జెక్టుల వారీగా డ్యూటీలు చేయాలని సమావేశంలో డ్యూటీ చార్ట్‌ను నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నెల 27వ తేదీ నుంచి పండుగ సెలవులు కావడంతో సబ్జెక్టుల వారీగా డ్యూటీ చేయాల్సిందే నని ప్రిన్సిపాల్ ఆదేశాలు జారీ చేశారు. సెలవుల అనంతరం గురుకుల కళాశాల పనితీరు ఎలా ఉంటుంది..? నైట్ డ్యూటీల విషయంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకోనున్నాయో..? సీసీ కెమెరాల పునరుద్ధరణపై సొసైటీ ఉన్నతాధికారుల నిర్ణయం ఎలా ఉండనుందో వేచి చూడాల్సిందే.

## దారంతా పూల వనమే..

5వ పేజీ తరువాయి

జనగామ, ములుగు జిల్లాల కేంద్రాలలో కూడా బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతికే తలమానికంగా నిలిచే ఈ పర్వంలో వయస్సుతో సంబంధం లేకుండా మహిళలంతా ఆటలాడుతూ పాటలు పాడుతూ ఒక అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరింపజేశారు. తొమ్మిది రోజుల పాటు జరుపుకొని సద్దుల బతుకమ్మతో ఆసాంతమయ్యే బతుకమ్మ వేడుకలను యావత్ ఓరుగల్లు మహిళా లోకం శ్రీకారం చుట్టారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో మహిళలు ఆటలాడుతూ సందడి చేశారు.

వరంగల్‌లోని ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో నిర్మించనున్న మాడవీధుల ప్రాంగణం ఓరుగల్లు మహిళలకు తొలినాటి బతుకమ్మలకు వేదికగా నిలిచింది. వరంగల్ పోతన ఆడిటోరియం, కాశిబుగ్గలోని శివాలయం, ఉర్సు రంగలీల మైదానం, ఖిలా వరంగల్ చౌరస్తా, రామలింగేశ్వర ఆలయం, దుర్గేశ్వర, భోగేశ్వర, ఆకారపు వారి గుడి, శివనగర్‌లోని పలు దేవాలయాల వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఏకశిలా పార్కు సమీపంలో జిల్లా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన వేడుకల్లో 3వేల మంది మహిళలు బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తించారు. హనుమకొండ రాంనగర్ భువనేశ్వరి మాత ఆలయ ప్రాంగణంలో కూడా బతుకమ్మ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. వేదికల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను దారి మళ్లించారు. విద్యుత్ లైట్ల మధ్య బతుకమ్మలు బంగారు వర్ణాన్ని సంతరించుకున్నాయి. మహిళల ఆనందోత్సాహాలు మిన్నంటాయి. పలు స్వచ్ఛంద సంస్థలు బతుకమ్మ ప్రాంగణాల వద్ద తాగునీటి వసతి కల్పించాయి.

# అర్ధరాత్రి దొంగల హల్‌చల్

**10 గ్రాముల బంగారం, 55 తులాల వెండి, 1.69లక్షల నగదు అపహరణ**

**మూడు గ్రామాల్లో ప్రతిఘటించిన వారిపై ముప్పేట దాడి**

**ఘటన స్థలాలను పరిశీలించిన డీసీపీ అంకిత్‌కుమార్**

**ఫింగర్ ప్రింట్స్ సేకరణ, పోలీస్ జాగిలాలతో దొంగల కోసం గాలింపు**



నందనాయక్‌తండాలో పత్తిచేను వద్ద దొంగల ఆనవాళ్లను పరిశీలిస్తున్న డీసీపీ అంకిత్‌కుమార్

గీసుగొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురం, నందానయక్‌తండా, ధస్రూతండా శివారు సింగ్యాతండాలో శనివారం రాత్రి దొంగల ముఠా హల్‌చల్ చేసింది. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు పలు ఇండ్లలో దొంగలు వరుస చోరీలకు పాల్పడ్డారు. సీఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి జరిగిన వరుస చోరీల్లో 10 గ్రాములు బంగారం, 55 తులాల వెండి ఆభరణాలు రూ. 1.69 లక్షల నగదు అపహరించుకుపోయారు. దొంగలు ముఖానికి మాస్కులతో పాటు నల్లటి, పచ్చని దుస్తులు ధరించి ఉన్నట్లు తెలిపారు. సింగ్యాతండాలో దొంగలు ఇంటిలోకి చొరపడుతుండగా బాధితుడు స్వామి అడ్డుకోగా అతడిని దొంగలు రాయితో చాతిపై కొట్టినట్లు చెప్పారు. అదే తండాకు చెందిన బాదావత్ దేవ్‌సింగ్‌ను బెదిరించి రూ.30 వేల నగదు, విశ్వనాథపురంలో వాంకుడోతు రవీందర్ ఇంట్లో అర తులం బంగారం, 15 తులాల వెండి, రూ.15 వేల నగదు, అదే గ్రామానికి చెందిన భూక్యా భిక్షపతి ఇంట్లో 20 తులాల వెండి, రూ.8 వేల నగదు, అక్కినేపల్లి ప్రదీప్ ఇంట్లో అర తులం బంగారం, 16 తులాల వెండి, రూ.50 వేల నగదును దొంగిలించినట్లు చెప్పారు. దొంగలు మొదటగా విశ్వనాథపురంలో చోరీలకు పాల్పడి నందనాయక్ తండా మీదుగా సింగ్యాతండాలోకి ప్రవేశించినట్లు అనుమానిస్తున్నారు. నందనాయక్‌తండాలో కూడా చోరీకి ప్రయత్నించగా కుక్కలు అరవటంతో సింగ్యాతండా వైపు పారిపోయి అక్కడ చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు.

కాగా, సంఘటన స్థలాలను వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేశ్, సీఐ మహేందర్‌లు పరిశీలించారు. పోలీస్ జాగిలాలను రప్పించి దొంగల ఆచూకీ కోసం ఆరా తీశారు. ఫింగర్‌ప్రింట్స్‌ను సేకరించి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు చెప్పారు. పండుగలకు వెళ్లే సమయంలో బంగారు ఆభరణాలు, నగదును, ఇతర విలువైన వస్తువులను తగిన విదంగా జాగ్రత్త పరుచుకోవాలని సీఐ సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కాగా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బంజార నాయకులు రాఘవేంద్ర, రేవంత్ కోరారు.

# బతుకమ్మను వదిలి.. యూరియా కోసం వెళ్లి..

**మనుబోతుల గడ్డలో బారులు తీరిన మహిళలు**



మనుబోతులగడ్డలో యూరియా కోసం క్యూ కట్టిన మహిళలు

ఖానాపురం, సెప్టెంబరు 21 ( ఆంధ్రజ్యోతి): బతుకమ్మ అంటే ఆడపడుచుల ఆత్మగౌరవం.. ఈ పండుగ అంటే మహిళలకు ఎంతో ఆనందం.. కానీ బతుకునిచ్చే వరి పంటకు యూరియా వచ్చిందని తెలిసిన ఆ మహిళలు.. పండుగ మాట అటుంచితే.. పంట కోసం యూరియా కావాలని వచ్చి క్యూ లైన్‌లో నిలబడ్డారు.. పండుగ ఇయ్యాల కాకపోతే రేపు చేసుకోవచ్చు.. కానీ పంట పండకపోతే పస్తులుండాల్సిన పరిస్థితి ఉందని మద్యలోనే వచ్చిన సంఘటన ఖానాపురం మండలం మనుబోతుల గడ్డలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని మనుబోతులగడ్డ గ్రామానికి సోమవారం యూరియా వస్తుందని వ్యవసాయాధికారులు మహిళలు బతుకమ్మ ఆడుకునే సమయానికి వాట్సాప్ గ్రూపులో సమాచారాన్ని పోస్ట్ చేశారు. ఇంకేముందీ.. సమాచారం తెలుసుకున్న మహిళలు బతుకమ్మ వేడుకలను మధ్యలోనే వదిలేసి యూరియా కోసం సొసైటీ ఎరువుల గోదాము వద్ద క్యూ కట్టారు. బతుకమ్మ వేడుకల కోసం కట్టుకున్న చీరలతోనే సోమవారం ఉదయం వచ్చే యూరియా కోసం ఆదివారం రాత్రి నుంచే మహిళలు క్యూలైన్లలో నిలబడినారంటే యూరియా కష్టాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థమవుతున్నది. కాగా, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్యూ లైన్లలో నిలబడిన రైతులను ఇళ్లకు వెళ్లాలని సూచిస్తున్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం వార్షికోత్సవం



నినాదాలు చేస్తున్న నాయకులు

మడికొండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 49వ వార్షికోత్సవ సభ రాంపూర్ క్రాస్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మునగాల వెంకటయ్య, కార్యదర్శి మునగాల డానియల్, ప్రతినిధులు సారయ్య, సాంబయ్య, దేవయ్య, రాజయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


మహబూబాబాద్ జిల్లా కాంపెల్లి గ్రామంలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు


తొర్రూరులో పెద్ద బతుకమ్మతో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, బీరప్ప మైత్రి మహిళా సొసైటీ సభ్యులు


జనగామ జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



# ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

» ఎంగిలిపూలతో బతుకమ్మ సంబరాలు షురూ » ఆడిపాడిన మహిళలు

తెలంగాణలో పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ. పూలను ఒక పాత్రలో పేర్చి తీసుకెళ్లి సమీపంలో గుడి, చెరువు, వాగుల వద్ద ఆడిపాడతారు. పెత్తర (పెద్దల) అమావాస్య రోజు పెద్దలకు బియ్యం ఇస్తారు. అనంతరం బతుకమ్మను పేర్చే విధానాన్ని ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ఆదివారం మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మను ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.


జనగామ జిల్లా జఫర్‌గడ్ మండల కేంద్రంలోని రామాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో ..


వేయి స్తంభాల దేవాలయం వద్దకు బతుకమ్మలతో వస్తున్న మహిళలు


ములుగు జిల్లా కేంద్రంలోని శివాలయం వద్ద..


హనుమకొండలోని వేయిస్తంభాల గుడి ప్రాంగణంలో..


వేయి స్తంభాల ఆలయం వద్ద గగన వీక్షణంలో ఇలా..


వరంగల్‌లో బతుకమ్మలతో వస్తున్న చిన్నారులు, మహిళలు


గీసుగొండలో బతుకమ్మను పేరుస్తున్న ఓ కుటుంబం




వరంగల్ కాశీ విశ్వేశ్వరాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# పండగవేళ పరేషాన్.!

» తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్న దొంగలు
» సొంతూళ్లకు వెళ్తున్న వారికి చోరీ గుబులు
» ఆగమాగంగా బయలుదేరితే ఇల్లు గుల్లే..
» సొమ్ము రికవరీ అయిన దాఖలాలు తక్కువ





వరంగల్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పండగలప్పుడు తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇళ్లను లూటీ చేయడం ప్రతి పండగ సమయంలో జరుగుతున్నాయి. గ్రామాల నుంచి బతుకుదెరువు కోసం నగరాలకు వచ్చి నివాసం ఉంటున్న కుటుంబాలు పండగల సమయాల్లో సొంతూళ్లకు వెళ్తుంటారు. ఇళ్లకు తాళాలు వేసి కుటుంబమంతా సొంతూళ్లకు పయనమవుతారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు ఇళ్లను లూటీ చేస్తున్నారు. పండగ అనంతరం యథావిధిగా నగరాలకు వచ్చేసరికి ఇళ్లంతా ఊడ్చేసి ఉండడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఇళ్లలో మనుషులున్నా దుండగులు ఆయుధాలతో బెదిరించి దోపిడీ చేసిన ఘటనలూ ఉన్నాయి.

## రెచ్చిపోతున్న దొంగలు

రాత్రివేళ పోలీసులు అర్ధరాత్రి 2లోపు పెట్రోలింగ్ విధులు ముగించుకుని పోలీస్‌స్టేషన్లకు చేరడం.. లేదంటే ఏదో ఒక ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అదే అదనుగా తీసుకొని దొంగలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగలు అర్ధరాత్రి 2 నుంచి తెల్లవారుజామున 4లోపు తమ పని కానిస్తున్నారు. నగర ప్రాంతాల్లో రాత్రి 1గంట వరకు జనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తుంటారు. ఆ సమయంలో కాకుండా అర్ధరాత్రి 2 తర్వాత దొంగతనాలు చేస్తున్నారు. ఆ సమయంలో పోలీసులు దృష్టి సారిస్తే దొంగలకు చెక్ పెట్టొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. నగరంలో జరిగిన చోరీలు అర్ధరాత్రి 2 నుంచి 4 గంటలలోపు జరిగినవే ఎక్కువగా ఉన్నాయి.

## ఇటీవల జరిగిన చోరీ ఘటనలు

- జూలై 26న హనుమకొండ రెడ్డికాలనీ, కృష్ణ కాలనీలో తాళాలు వేసి ఉన్న నాలుగు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లారు.

- ఈ నెల 14న స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంటగది తాళాలను పగులగొట్టి వంట పాత్రలు ఎత్తుకెళ్లారు.

- ఈ నెల 15న నల్లబెల్లి పీఎస్ పరిధిలోని రుద్రగూడెంలో అడిదెల దేవమ్మ వ్యక్తిగత పనుల కోసం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. దొంగలు తాళం పగలగొట్టి 3 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి ఇంటికి తాళం వేసి వేరే దగ్గర ఉంటుండడంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు.


- తాజాగా గత శనివారం రాత్రి వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సంగెం, గీసుగొండ పీఎస్‌ల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు పలుచోట్ల దాడులు చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గీసుగొండ పీఎస్ పరిధిలోని సింగ్యాతండాలో చోరీకి ప్రయత్నించగా స్వామి అనే వ్యక్తి ప్రతిఘటించడంతో దుండగులు బండరాయితో కొట్టి గాయపరిచారు. అదే తండాకు చెందిన వృద్ధురాలు భద్రమ్మను గాయపరిచి 2 తులాల బంగారు చెయిన్, రూ.30 వేల నగదు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. విశ్వనాథపురంలోని వాంకుడోత్ రవీందర్ ఇంట్లో అర తులం బంగారు, 15 తులాల వెండి, భూక్య భిక్షపతి ఇంట్లో 20 తులాల వెండి, రూ.8వేల నగదు, అకినెపల్లి ప్రదీప్ ఇంట్లో తులంన్నర బంగారు బ్రాస్‌లెట్, రూ.8 వేల నగదును చోరీ చేసినట్లుగా స్థానికులు వెల్లడించారు. సంగెం పీఎస్ పరిధిలోని రేక్యానాయక్ తండాలోని రాజ్‌కుమార్ ఇంట్లో రూ.2 లక్షల నగదు, 3తులాల బంగారం, 32 తులాల వెండిని ఎత్తుకెళ్లారు.

### అప్రమత్తతే ఆయుధం

ఇల్లును వదిలి రెండు మూడు రోజులు ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు ఉంటే తమ వెంట తీసుకెళ్లాలి. లేక రక్షణ ఉన్న ప్రాంతాల్లో విలువైన సామాన్లను భద్రపరుచుకుంటే చోరీలకు గురికాకుండా కాపాడుకోవచ్చు. ఇంట్లో ఎవరూ లేరనే విషయాన్ని బయటి వ్యక్తులకు తెలియకుండా గోప్యత పాటించాలి. దీంతో చోరీ జరగడానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. బతుకమ్మ, దసరా పండగకు పిల్లలకు 15 రోజుల సెలవులు రావడంతో విలువైన వస్తువులను అజాగ్రత్తగా వదిలివేయకుండా రక్షణ ఉన్న ప్రదేశాల్లో భద్రపరుచుకుంటే దొంగల బెడద నుంచి తప్పించుకోవచ్చు.

### పోలీసుల సూచనలు పాటించాలి

**- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**



- గ్రామాలకు వెళ్లే ప్రజలు పోలీసుల సూచనలను పాటించాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసకుంటున్నాం. ఊళ్లకు వెళ్లేవారు ఈ కింది నిబంధనలు పాటించాలి.
- సెంట్రల్ లాక్ సిస్టమ్‌తో అలారం మోషన్ సెన్సార్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- ఊరికి వెళ్లే ముందు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో లేదా గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలి. లేదంటే వెంట తీసుకెళ్లాలి.
- ద్విచక్ర వాహనాలను చైన్స్‌తో లాక్ చేయాలి. నమ్మకమైన వ్య క్తులనే సర్వెంట్ లేదా సెక్యూరిటీ గార్డ్‌గా నియమించుకోవాలి.
- ట్రావెల్ ప్రాంతాల లొకేషన్స్‌ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్‌డేట్ చేయొద్దు.
- సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని మొబైల్‌లో ఎప్పటికప్పుడు లైవ్‌లో ఇంటి పరిసరాలను గమనించాలి. తాళం వేసిన తర్వాత కనపడకుండా కర్టెన్ వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.
- ఇంట్లో లేనప్పుడు ఎవరినైనా ఒకరిని ఇంటి ముందు వాకిలి ఊడ్చాలని, ఇంటి ముందు న్యూస్ పేపర్స్, పాల ప్యాకెట్లు జమ కాకుండా చూసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు డయల్ 100కు ఫోన్ చేయాలి.

# మహిళలు శక్తి సంపన్నులుగా ఎదగాలి

» అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి
» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

» నగరంలో కనులపండువగా బతుకమ్మ వేడుకలు
» అధికార గణంతో కళకళలాడిన వేయిస్తంభాల ఆలయం
» బతుకమ్మను ఎత్తుకున్న మంత్రులు


వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు


హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలంతా శక్తి సంపన్నులుగా ఎదగాలన్నదే తమ కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతమని, దీనికి ఈ నవరాత్రి ఉత్సవాల అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. తెలంగాణ సాంస్కృతిక పర్వంగా పేరున్న బతుకమ్మ తొలినాటి ఉత్సవాలను చారిత్రక వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హైదరాబాద్ తరువాత అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న ఓరుగల్లు అభివృద్ధిపై తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. తెలంగాణ పర్వమైన బతుకమ్మ వేడుకలను పెద్దఎత్తున నిర్వహించాలకున్న క్రమంలో తొలినాటి చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో నిర్వహింపజేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు.

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. కాకతీయులు నిర్మించిన చారిత్రక ఆలయంలో మన సంస్కృతిని చాటే బతుకమ్మ పర్వాన్ని జరుపుకోవడం ఒక అద్భుత సన్నివేశమని అభివర్ణించారు. మహిళల సమైక్యతా సంఘటిత శక్తికి ప్రతిరూపమే బతుకమ్మ పర్వమన్నారు. ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా బతుకమ్మ పాటలు పాడుతూ సంస్కృతిని చాటుతుండటం తెలంగాణకే చెల్లిందన్నారు. బతుకమ్మ పాటల్లో మానవుడి జనజీవన విధానం, సామాజిక స్పృహ ఉంటున్నాయన్నారు. రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, ఇందులో ప్రజల భక్తి శ్రద్ధలకు సాంస్కృతిక చైతన్యానికి నిదర్శనంగా ప్రభుత్వ సహకారంతో బతుకమ్మ, నవరాత్రి వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, అధికారికంగా నిర్వహించే బతుకమ్మ సంబరాలను తమ ఓరుగడ్డలోని వేయిస్తంభాల ఆలయం నుంచి ప్రారంభింపజేసుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ.. రాణి రుద్రమ పాలించిన కాకతీయుల గడ్డపై ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ ఆటలు ఆడుతూ, పాటలు పాడడటం అద్భుత దృశ్యమని పేర్కొన్నారు. మహిళలంతా తొమ్మిది రోజులు ఆటలాడుతూ నిత్య నైవేద్యంగా సమర్పించిన ప్రసాదాలు సమర్పించుకుంటున్న క్రమంలో కష్టసుఖాలు పంచుకునే పర్వమే బతుకమ్మ అని అన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. రెండో రాజధానిగా చారిత్రక ఓరుగల్లు నగరంలో బతుకమ్మ వేడుకలను ప్రారంభింపజేయాలని తలపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈసారి వేడుకలను తన నియోజకవర్గకేంద్రమైన హనుమకొండలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని సగం మంది కేబినెట్ మంత్రులు, పదిమందిదాక కార్పొరేషన్ చైర్మన్లు వేడుకల్లో పాల్గొని బతుకమ్మ కార్యక్రమాలకే వన్నె తెచ్చారని అన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ బతుకమ్మ పేరిట రాష్ట్ర సాంస్కృతిక శాఖ సారథి చైర్మన్ వెన్నెల ఆధ్వర్యంలో రూపొందించిన సీడీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇతర మంత్రులతో కలిసి ఆవిష్కరించారు.

కాగా, ఆలయానికి చేరుకున్న మంత్రులు, ఇతర అధికార గణానికి దేవాదాయశాఖ పక్షాన ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులు పూర్ణకుంభంతో స్వాగతించారు. రుద్రేశ్వరుడి సన్నిధిలో మంత్రుల పేరిట పూజలు నిర్వహించారు. రుద్రేశ్వరుడి సన్నిధి నుంచి మహిళా మంత్రులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మేయర్‌తో సహా బతుకమ్మలను నెత్తిన ఎత్తుకొని వేడు కలకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా అధికార దర్పంతో కిటకిటలాడింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయి, రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, గట్టు మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ పాట పాడుతున్న మంత్రులు సురేఖ, సీతక్క



## దేవీ శరన్నవరాత్రుల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

కాజీపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను కాజీపేట మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం శివశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ ఉత్సవాల విజయవంతానికి భక్తులు, స్థానికులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు, కార్యక్రమంలో ఉపాసకులు ఐనవోలు ప్రవీణ్ కుమార్‌శర్మ, మిట్టపల్లి రవీందర్, బెదరకోట రంజిత్‌కుమార్, అశోక్ రాజ్, హరి భరత్ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు


గోపాల్‌పూర్ బృందావన కాలనీలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు


అమెరికాలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ మహిళలు


మడికొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# ఒక్కేసి పువ్వేసి చందమామ..

- ఉయ్యాల పాటలతో మార్మోగిన ఆలయాలు, వీధులు
- అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు


హనుమకొండ 8వ డివిజన్ గుడిబండల్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వడ్డెపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని వివిధ డివిజన్లలో ఎంగిళిపూల బతుకమ్మ వేడుకలను ఆదివారం అంబరాన్నంటే విధంగా నిర్వహించుకున్నారు. డివిజన్లలోని ఆలయాలు, వీధులలోని కూడళ్లలో బతుకమ్మను భక్తి ప్రపత్తులతో కొలిచారు. ఉయ్యాల పాటలతో ఆలయాలు, వీధులు, కాలనీలు మార్మోగాయి. హనుమకొండ 55వ డివిజన్ బృందావన కాలనీలో కాలనీ అధ్యక్షుడు రచ్చ నాగేశ్వర్‌రావు, ప్రతినిధులు జక్కుల శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో మహిళలు రచ్చ పద్మ, బురుద రాజు వాణి, బొల్లేని పద్మ, ధమయంతి, నిర్మల లు బతుకమ్మలను కాలనీలోని కూడలికి తరలించారు. ఒకే చోట మహిళలంతా బతుకమ్మలను ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద చేర్చి ఆడిపాడారు. 56వ డివిజన్‌లోని గోపాల్‌పూర్ వొద్దిరాజు కాలనీలో నేను సైతం ఫౌండేషన్ చైర్మన్ రావుల వెంకటరమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంగిళిపూల బతుకమ్మను నిర్వహించారు. డివిజన్‌లోని జవహర్‌కాలనీలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, బీజేపీ జోనల్ అధ్యక్షుడు బండి హరీష్‌ముదిరాజ్ పర్యవేక్షణలో కాలనీ అధ్యక్షుడు బైరి సోమయ్య , చెరుకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటే విధంగా నిర్వహించుకున్నారు. హనుమకొండ 57వ డివిజన్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో, 58వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు మండల సంధ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను మహిళలు నిర్వహించుకున్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని శివాలయం వద్ద బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు.

**హనుమకొండ టౌన్:** హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో తెలంగాణనాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల దివ్యాంగులతో బతుకమ్మ ఆటలను ఆడారు. ఈ కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస సంస్థ నిర్వాహకురాలు బండా రామలీల, ప్రతినిధులు బండ సదానందం, కోడం కల్యాణ్‌తోపాటు మానసిక దివ్యాంగులు పాల్గొన్నారు. హనుమకొండ ఏకశిల పార్కులో ఏకశిల వాకర్స్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విజేతలకు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి వంగ రాజిరెడ్డి బహుమతులను ప్రదానం చేశారు.

**హనుమకొండ కలెక్టరేట్:** అమెరికాలోని న్యూయార్క్‌లో ఫ్లేషింగ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో కోలాటాలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ముఖ్య అతిథిగా అమెరికా తెలుగు సంఘం ప్రతినిధి రమ హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నాగకుమార్, లక్ష్మణ్, రమేష్, వెంకన్న, భిక్షపతి, కుమారస్వామి, శ్రీనివాస్, సతీష్, రాజేందర్ రెడ్డి, అనిల్, మహేష్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ :** హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని తన నివాసంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని స్వయంగా బతుకమ్మను పేర్చారు. ఈ సందర్భంగా ఎంపీతో పాటు కుటుంబ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు. గీతాలు పాడుతూ పండుగను ఘనంగా జరుపుకున్నారు.


బతుకమ్మను పేర్చుతున్న ఎంపీ కావ్య

● హనుమకొండ పరిమళకాలనీ సిగ్నేచర్‌ప్లేస్ అపార్టుమెంట్‌లోని మహిళలు ఆదివారం ఎంగిలి బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలంతా అపార్టమెంట్ సెల్లార్‌లో బతుకమ్మలను ఒక దగ్గర చేర్చి బతుకమ్మ పాటలను పాడారు. నృత్యాలు చేశారు. దాండియా ఆడారు. అనంతరం కాలనీలోని ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లి ఆవరణలో నిమజ్జనం చేశారు. హనుమకొండ పోచమ్మకుంటలోని సీతారామయశోధ నిలయం అపార్టుమెంట్‌లోని మహిళలు ఆదివారం ఎంగిలి బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలంతా అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో బతుకమ్మలను ఒక దగ్గర చేర్చి బతుకమ్మ పాటలను పాడారు. నృత్యాలు చేశారు. దాండియా ఆడారు. అనంతరం సమీపంలోని అంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లి ఆవరణలో నిమజ్జనం చేశారు.

**హనుమకొండ చౌరస్తా:** బతుకమ్మ వేడుకలు 8వ డివిజన్ గుడిబండల్‌లోని శ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా తొలి రోజు ఆదివారం గుడిబండల్‌లోని శ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి స్థానిక మహిళలు పూలతో పేర్చిన బతుకమ్మలతో పెద్ద ఎత్తునతరలి వచ్చి అంగరంగ వైభవంగా సంబరాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పులి విక్రం, ఫైడి, రావుల సారంగపాణి, బండి కుమారస్వామి, కొలిపాక విక్రంకుమార్, పొలమేన రమేష్‌బాబు, స్థానిక డివిజన్ మహిళలు, పాల్గొన్నారు.

**రాంనగర్:** బతుకమ్మను బతకనిద్దాం.. భ్రూణ హత్యలను నివారిద్దాం.. అనే చక్కటి సందేశాన్ని తెలిపేలా నయీంనగర్‌కు చెందిన 8వ తరగతి చదువుతున్న కూరపాటి లాస్య సాయిప్రకాశ్ అనే బాలిక ఆదివారం జరిగిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో ప్లకార్డు చేతిలో పట్టుకొని పలువురిని ఆలోచింపజేసింది. తన తండ్రి సైతం తెలంగాణ ఉద్యమం వేళ పండగుల రోజు ఏదో ఒక వినూత్న కార్యక్రమం చేసేదని, తండ్రి బాటలోనే కుమార్తె పయనిస్తోందని స్థానికులు ప్రశంసించారు.


మల్లికాంబ మనోవికాస కేంద్రంలో..

**కాజీపేట:** తొమ్మిది రోజులపాటు జరిగే బతుకమ్మ ఉత్సవం ఆదివారం మొదటిరోజు కాజీపేటలో వైభవంగా సాగింది. సాయంత్రం మహిళలు సంప్రదాయ బతుకమ్మలు పేర్చి రైల్వే కాలనీ దేవాలయం, డీజిల్ కాలనీ, సోమిడి కట్ట, వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ వద్ద పెద్దఎత్తున బతుకమ్మలు ఆడారు. బతుక్మలు ఆడే ప్రాంగణాల్లో గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు మహిళలు బతుకమ్మ పాటలతో ప్రాంగణాలు మార్మోగాయి. స్థానిక ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి భారీ పోలీస్ బందోబస్తు చేపట్టారు.


మడికొండలో బొడ్రాయి వద్ద ..


వడ్డెపల్లిలోని శ్యామల దుర్గాదాస్‌కాలనీలో..


రైల్వే కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు




వడ్డెపల్లి కట్ట వద్ద బతుకమ్మలతో మహిళలు


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతిని హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నేత హాస్టల్ భవన్‌లో జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ చందా మల్లయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమలో ప్రముఖ న్యాయవాది దాసరి ప్రేమ్‌సాగర్, ఈగ వెంకటేశ్వర్లు, గజ్జల రవీందర్, శ్యాంసుందర్, కుసుమ జానకిరాములు, సతీష్‌కుమార్, వనం సత్యనారాయణ, గుడిమల్ల కృష్ణారావు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు

## ముదిరాజ్‌ల వాణిని వినిపించాలి

**మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్**

వడ్డెపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు ఏ పార్టీలో ఉన్నా.. తమ వాణిని వినిపించి ముదిరాజ్ సామాజికవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హనుమకొండ పట్టణానికి చెందిన పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హనుమకొండలోని ఆయన నివాసంలో మెపా నేతలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర సలహాదారు పులి ప్రభాకర్, రాష్ట్ర, జిల్లా నాయకులు పొన్నం రాజు, నీరటి రాజు, పులి రాజేష్, గోనెల విజేందర్, గోనెల సాగర్, పులి మహేష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.


పల్లెబోయిన అశోక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మెపా నేతలు

## ఉత్తమ సేవలతో గుర్తింపు

హసన్‌పర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగంలో ఉత్తమ సేవలు మంచి గుర్తింపు తెచ్చిపెడుతుందని డీసీసీబీ రిటైర్డ్ మేనేజర్ వీసం విజేందర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి శివాజీ నగర్‌కు చెందిన వీసం విజేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం కాలనీలో జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు విజేందర్‌రెడ్డిని సన్మానించి అభినందించారు. హసన్‌పర్తి పీఏసీఎస్ సీఈవోగా 23 ఏళ్ల పని చేసిన అనంతరం హనుమకొండ డీసీసీబీ బ్యాంకు నక్కలగుట్ట మెయిన్ బ్రాంచ్‌లో 13 సంవత్సరాలుగా బ్యాంకు మేనేజర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పీఏసీఎస్ డైరెక్టర్ వీసం కరుణాకర్‌రెడ్డి, శివాజీనగర్ కాలనీ అధ్యక్షుడు వీసం రాజిరెడ్డి, కాలనీ వాసులు వీసం రవీందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, చందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, అనిల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ అసోసియేషన్
# నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన జేఎస్ఎస్ కమిటీ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ అసోసియేషన్ (జేఎస్ఎస్) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రౌతు రాజేష్‌కుమార్, అధ్యక్షుడిగా పెద్దమ్మల అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.ఐలేష్, ఉపాధ్యక్షుడిగా మంచాల రాజు, కోశాధికారిగా బొల్లం కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా ఏరుకొండ రవీందర్, ఈసీ మెంబర్లుగా వి.చేరాలు, సతీష్, లక్ష్మణ్‌కుమార్, పి.వెంకటేశ్వర్లు, లింగమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎర్ర శివకుమార్ తెలిపారు. ఈ కమిటీ రెండేళ్లు కొనసాగుతుందని శివకుమార్ ప్రకటించారు. సమావేశంలో సభ్యులు జయపాల్, దొమ్మడి రవీందర్, పులి శివకుమార్, గొల్లపెల్లి ఈశ్వరచారీ, రాజ్‌కుమార్, గంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వెలగని వీధి దీపాలు

- అంధకారంలో వడ్డెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి
- ఆందోళన చెందుతున్న సమీప ప్రాంతాల ప్రజలు


వీధిదీపాలు వెలగని వడ్డెపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి

వడ్డెపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి శివారులోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో పక్షం రోజుల నుంచి వాహనదారులు, వివిధ కాలనీల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై సుమారు 25 వరకు వీధి దీపాలను జీడబ్ల్యూఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఇదే బ్రిడ్జిపై నుంచి సుమారు 20 గ్రామాల ప్రజలతో పాటు 10 తండాలు, 10 కాలనీల ప్రజలు రాత్రివేళల్లో ప్రయాణిస్తుంటారు. వీధి దీపాలు వెలగకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని బాటసారులు, వాహనదారులు, వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఆనుకొని గాయత్రినగర్, నవభారత్ కాలనీ, గణేష్ నగర్, నిరూప్‌నగర్ తండా, మధుతండా, ఆహల్య తండా, పూరిగుట్ట, పరిమళ కాలనీ, ఆర్టీసీ కాలనీ, అన్సార్ కాలనీలతో పాటు వివిధ కాలనీలు ఉన్నాయి. ఇదే బ్రిడ్జిపై నుంచి ఉనికిచర్ల, సుబ్బయ్యపల్లి, రాపాకపల్లి, దేవునూరు, సోమిడి, దేవన్నపేట తదితర గ్రామాల ప్రజలు రేయింబవళ్లు వాహనాలపై ప్రయాణిస్తుంటారు. బ్రిడ్జిపై ఉన్న వీధి దీపాలు వెలగకపోవడం వలన ప్రమాదాలు జరుగుతాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జీడబ్ల్యూఎసీ అధికారులు స్పందించి అన్ని స్తంభాలకు వీధి దీపాలను అమర్చి వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**వీధి దీపాలను ఏర్పాటు చేయాలి**
**దాసరి ఉపేందర్, గాయత్రి నగర్**



వడ్డెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వీధి దీపాలు వెలగకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. నిత్యం వేలాది మంది వాహనదారులు ఈ బ్రిడ్జిపై నుంచే ప్రయాణిస్తుంటారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

## సీపీని కలిసిన అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్‌ను హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందించారు. అక్టోబరు 16నుంచి 18వరకు నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు హాజరు కావడంతో పాటు క్రీడలను విజయవంతం చేయడానికి సహకరించాలని కోరామని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, అసోసియేషన్ బాధ్యులు నిషాంత్, దిమ్మిక నాగరాజు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సీపీకి బొకేను ఇస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు

వేడుక

## నేడు అటుకుల బతుకమ్మ



ప్రకృతి స్వరూపిణిగా తెలంగాణ ప్రజలు ఆరాధించే బతుకమ్మ వేడుకల్లో రెండో రోజైన ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు (సోమవారం) శక్తి స్వరూపిణి అయిన గౌరమ్మను 'అటుకుల బతుకమ్మ'గా ఆరాధిస్తారు. ఈ రోజున ప్రధానంగా నివేదించేవి అటుకులు కాబట్టి 'అటుకుల బతుకమ్మ' అని పిలుస్తారు. వివిధ రకాల పూలతో రెండు ఎత్తులలో గౌరమ్మను పేరుస్తారు. ఆటపాటలతో వేడుక చేసుకుంటారు.

**ఈ రోజు నైవేద్యం:** సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు

## దుర్గా నవరాత్రులు

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సందర్భంగా... నేటి నుంచి శరన్నవ రాత్రులు ప్రారంభం అవుతున్నాయి. శక్తి స్వరూపిణి అయిన ఆ తల్లిని నవరాత్రుల సందర్భంగా వివిధ రూపాల్లో కొలుస్తారు. విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారి పూజ, ఆరాధన ఈ దసరా రోజుల్లో అత్యంత వైభవంగా సాగుతాయి. ఈ ఏడాది ఉత్సవాలు 11 రోజులపాటు జరుగుతాయి. ఈ సందర్భంగా దుర్గాదేవి అలంకార విశేషాలు, సమర్పించే నైవేద్యాల వివరాలు రోజూ 'నవ్య' పాఠకుల కోసం...

### నేటి అలంకారం
### శ్రీ బాలాత్రిపురసుందరీదేవి
**ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి, సోమవారం**



దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో మొదటి రోజున శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైంది. శ్రీబాలామంత్రాన్ని సమస్త దేవీమంత్రాల్లో అత్యున్నతమైనదిగా ప్రధానమైనదిగా భావిస్తారు. శ్రీవిద్యోపాసకులకు ఉపదేశించే మొదటి మంత్రం ఇదే. మహాత్రిపురసుందరీదేవి నిత్యం కొలువుండే పవిత్రమైన శ్రీచక్రంలోని తొలి ఆమ్నాయంలో ఉండే తొలి దేవత బాలాదేవి. అందుకే ముందుగా బాలాదేవి అనుగ్రహం పొందితేనే మహాత్రిపురసుందరీదేవి అనుగ్రహాన్ని పొందగలరని పెద్దలు చెబుతారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు పూర్ణ ఫలం అందించే అలంకారం బాలాత్రిపురసుందరీదేవి. ఈ అమ్మవారిని పూజిస్తే సర్వ సంపందలూ కలుగుతాయనీ, మనోవికారాలు తొలగిపోతాయనీ భక్తుల విశ్వాసం.

**నైవేద్యం:** పాయసం, పులగం
**అలంకరించే చీర రంగు :** లేత గులాబీ రంగు
**అర్చించే పూల రంగు :** అన్ని రకాలూ!
**పారాయణ:** లలితా త్రిశతి

## హెచ్-1బీ రుసుము ఒక్కసారే!

(మొదటి పేజీ తరువాయి)

విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక రుసుము కాదని ఆమె స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు మాత్రమేనని చెప్పారు. ప్రస్తుత వీసాదారులకు, రెన్యువల్‌కు లక్ష డాలర్ల రుసుము వర్తించదని పేర్కొన్నారు. రాబోయే హెచ్-1బీ వీసాల లాటరీకి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఇప్పటికే హెచ్-1బీ వీసా కలిగి ఉండి అమెరికా బయట ఉన్న వారు భయపడాల్సిన అవసరం లేదని, వారిపై ఎలాంటి రుసుమూ విధించబోమని తెలిపారు. వారంతా ఎప్పటిలాగే అమెరికా నుంచి బయటకు వెళ్లొచ్చని, తిరిగి అమెరికా రావచ్చని.. కొత్త నిబంధన వారికి వర్తించదని వివరించారు. ఈ వన్‌టైమ్ రుసుము ఇకపై కొత్తగా హెచ్-1బీ వీసాకు దరఖాస్తు చేసుకునే వారికే మాత్రమే అమలు చేస్తామన్నారు. అంటే ఎఫ్-1 స్టూడెంట్ వీసా సహా ఎలాంటి అమెరికా వీసాలు కలిగిన వారు కూడా ఈ లక్ష డాలర్ల రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నిబంధన సెప్టెంబరు 21 కంటే ముందే దాఖలు చేసిన హెచ్-1బీ వీసా పిటిషన్‌లకు వర్తించదని అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) కూడా వెల్లడించింది. ఇప్పటికే ఆమోదం లభించిన పిటిషన్లూ దీని పరిధిలోకి రావని తెలిపింది. ప్రస్తుతం హెచ్1బీ వీసా చెల్లుబాటులో ఉన్నవారు అమెరికాకు రాకపోకలు సాగించవచ్చని యూఎస్‌సీఐఎస్ డైరెక్టర్ జోసఫ్ వెల్లడించారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

### భారతీయులకు అత్యవసర హెల్ప్‌లైన్

అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా రుసుమును భారీగా పెంచడంతో నెలకొన్న గందరగోళ, ఇబ్బందికర పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. భారతీయ ఐటీ నిపుణుల కోసం వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయం ప్రత్యేకంగా అత్యవసర హెల్ప్‌లైన్ నంబరును ఏర్పాటు చేసింది. ఇందు కోసం "అత్యవసర సహాయం కోసం భారతీయులు సెల్ నంబరు 1-202-550-9931కు ఫోన్ లేదా వాట్సాప్ చేయాలి. ఈ నంబరు కేవలం భారతీయులకు, అదీ అత్యవసర సహాయం కోసమే. సాధారణ కాన్సులర్ వివరాల కోసం కాదు" అని భారత దౌత్య కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. హెచ్-1బీ వీసాల్లో అత్యధికంగా 72 శాతం వరకు భారతీయులకే కేటాయిస్తున్నారు.

## ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై నేడు భారత్-అమెరికా చర్చలు

» వాషింగ్టన్‌కు వాణిజ్య మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సోమవారం వాషింగ్టన్‌లో చర్చలు జరుగుతున్నాయి. భారత్ తరఫున వాణిజ్య మంత్రి గోయల్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ప్రాతినిధ్యం వహించనుంది. భారత్-అమెరికాల మధ్య ఇప్పటికే ఉన్న పలు సమస్యలతో పాటు తాజాగా హెచ్-1బీ వీసాలపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ చర్చలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇరుదేశాల మధ్య చర్చలు సజావుగా సాగుతున్నాయని గోయల్ అభిప్రాయపడ్డారు. సానుకూల ఫలితాలు రావాలని ఇరు దేశాలు ఆకాంక్షిస్తున్నాయని చెప్పారు. "సంప్రదింపులు కొనసాగుతున్నాయి. దీనిని ఓ సందర్భంగా భావిస్తున్నామే తప్ప, ఘర్షణగా పరిగణించడం లేదు" అని తెలిపారు. ఈ నెల 16న అమెరికా వాణిజ్య ప్రతినిధులు ఢిల్లీ వచ్చి చర్చలు జరిపారు. మరింత లోతుగా చర్చలు జరిపి విభేదాలు పరిష్కరించుకోవాలని ఆ సందర్భంగా నిర్ణయించడంతో తాజాగా భారత ప్రతినిధి బృందం అమెరికాలో చర్చలు జరపనుంది. గతంలో అమెరికా నుంచి వ్యవసాయ, పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోబోమంటూ భారత్ కఠిన వైఖరి ప్రదర్శించగా ప్రస్తుతం కాస్త మెత్తపడే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది.

**జాంధానీ చీరల తయారీలో చేయితిరిగిన ఉప్పాడ నేతన్నలు కొత్త పద్ధతులను తెరపైకి తెస్తున్నారు. కాలానుగుణంగా వస్తోన్న మార్పులకు తగ్గట్టుగా మగ్గాలపై మెరుపులు మెరిపిస్తున్నారు. మహారాష్ట్రలో పేరుపొందిన పైథానీ పట్టు, ఖాదీ వస్త్రం కలగలిపిన కొత్త రకం చీరల్ని సృష్టిస్తున్నారు. ప్రసిద్ధ సంస్థల షోరూంలను సైతం అలంకరిస్తున్న ఈ చీరల విశిష్టత ఏమిటంటే...**



# 'శారీ'గమే... పైథానీ సే...



అతివల అందాన్ని మరింత పెంచేవి చీరలు. వాటిలో ఉప్పాడ జాంధానీ చీరలకు ఉన్న ప్రత్యేకతే వేరు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ములాంటి ఎందరో ప్రముఖుల మనసుల్ని దోచుకున్న ఈ చీరలకు ఎంతో ఆదరణ ఉంది. టాటా గ్రూప్, రిలయన్స్, ఆదిత్య బిర్లా లాంటి బడా వ్యాపార సంస్థలు ఇక్కడ తయారు చేసే చేనేత వస్త్రాలపై ఆసక్తి చూపడానికి కారణం ఈ చీరలే. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ గ్రామం జాంధానీ చీరలకు ప్రసిద్ధి. ఉప్పాడలో కొన్ని వేల కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా చేనేత రంగం పైనే ఆధారపడి జీవిస్తున్నాయి. గంటల తరబడి మగ్గాల మీద పని చేసే ఉప్పాడ చేనేత కళాకారులు... మగువలను మైమరపించే జాంధానీ చీరలను రూపొందించడంలో సిద్ధహస్తులు. టాటా గ్రూప్, ఆదిత్య బిర్లా, రిలయన్స్ లాంటి పెద్ద పెద్ద సంస్థలు ఉప్పాడ జాంధానీ నేతపై దృష్టిసారించాయి. ఉప్పాడలో చీరలు నేయిస్తున్నాయి. తమ షోరూమ్‌లలో వాటిని విక్రయిస్తున్నాయి. టాటా ప్రతినిధుల బృందం నేరుగా ఉప్పాడ వచ్చి, తమకు నచ్చిన డిజైన్లు ఇచ్చి, చీరలు నేయిస్తున్నారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ఇక్కడి నేతన్నలకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వారే తమ షోరూమ్‌కు వస్త్రాలు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుంది. రిలయన్స్‌తో పాటు, తమిళనాడులోని పోతీస్ వస్త్ర దుకాణాలకు కూడా ఉప్పాడ చీరలు సరఫరా అవుతున్నాయి.

### ఎటు చూసినా ఒకేలా...

ఉప్పాడ చేనేత కళాకారులు కాలానుగుణంగా పద్ధతులవైపు వారు మళ్లుతున్నారు. ఆధునిక మహిళల అభిరుచులకు తగినట్టు మార్పులు తీసుకొస్తున్నారు. ఇప్పుడు వారు పైథానీ పట్టు, ఖాదీ వస్త్రాలతో కొత్త రకం చీరల తయారీ చేపట్టారు. ఇప్పటివరకు ఇలాంటి చీరలు ఈ ప్రాంతంలో ఎక్కడా తయారు చేయడం లేదు. మహారాష్ట్రలోని ఔరంగబాద్ నగరం ఈ చీరలకు ప్రసిద్ధి. షిరిడీ సమీపంలోని ఎవ్లా ప్రాంతం పైథానీ చీరల తయారీకి పేరుపొందింది. ఆ విధానాన్ని తాజాగా ఉప్పాడ తీసుకొచ్చారు. ఎటు చూసినా ఒకే తరహాలో కనిపించడం ఈ చీరల ప్రత్యేకత. ఈ విధానం ద్వారా ఖరీదైన పట్టు చీరలను తయారు చేస్తున్నట్టు ఉప్పాడ చేనేత కళాకారులు చెబుతున్నారు. ఒక చీరలో పల్లు వరకు పైథానీ, తర్వాత ఖాదీతో పేపర్ వర్క్ ఉంటుంది. ఒక చీర తయారీకి ఇద్దరు కార్మికులు పనిచేస్తారు. పూర్తి చేయడానికి సుమారు మూడు నెలల నుంచి ఏడాది వరకూ సమయం పడుతుంది. పట్టును బెంగళూరు నుంచి, జరీని సూరత్ నుంచి తీసుకువస్తారు. మార్కెట్లో ఈ చీర ధర రూ.50 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ఉంటుంది. రాజస్థాన్, బెంగళూరు నుంచి ఎక్కువ ఆర్డర్లు వస్తున్నాయని, ఇప్పటి వరకు 30 నుంచి 40 వరకు చీరలు విక్రయించామని తయారీదారుడు శిలామంతుల నరేష్ చెప్పారు. ఇక్కడ ఈ తరహా చీరల తయారీదారులు 12 మంది మాత్రమే ఉన్నారని, దీంతో ఆర్డర్లు వస్తున్నా... తయారీకి నాలుగు నెలల సమయం పడుతోందని ఆయన వివరించారు.

● పీవీవీ వరప్రసాద్, కాకినాడ
● ఎం. సూర్యనారాయణమూర్తి, ఉప్పాడ

# భారత్ చుట్టూ.. అమెరికా ఉచ్చు?

## మన దేశాన్ని కావాలని టార్గెట్ చేసినట్టుగా వరుస పరిణామాలు

(సెంట్రల్ డెస్క్)

భారత్‌ను అమెరికా కావాలనే టార్గెట్ చేస్తోందా? ఆర్థికంగా, రాజకీయపరంగా, ప్రాంతీయంగా ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నిస్తోందా? ఆ దిశగానే దాయాది దేశం పాకిస్థాన్‌కు తోడుగా బంగ్లాదేశ్, నేపాల్‌లనూ మన పక్కలో బల్లెంలా మారుస్తోందా? తన మిత్రదేశం సౌదీ అరేబియాను పాక్‌కు రక్షణగా రంగంలోకి దింపిందా? మనకు మిత్రదేశంగా మారుతున్న అఫ్ఘానిస్థాన్‌ను తిరిగి నియంత్రణలోకి తీసుకోవాలని చూస్తోందా? వీటికితోడు అడ్డగోలు సుంకాలు, హెచ్1బీ వీసాల ఫీజులు భారీగా పెంపు, విద్యార్థి వీసాలపై ఉండే గడువు కుదింపు.. వంటివన్నీ భారత్ చుట్టూ పన్నుతున్న ఉచ్చులో భాగమేనా? ఇటీవల అమెరికా, దాని అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే భారత్‌ను కావాలనే టార్గెట్ చేసినట్టుగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### సుంకాలు, ఆంక్షలతో ఆర్థికంగా..

తాము వద్దన్నా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, తమతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి కొర్రీలు పెడుతోందని పేర్కొంటూ.. ఏ దేశంపై లేనంతగా భారత్‌పై అమెరికా 50% సుంకాలను విధించింది. కానీ, చైనా మనకన్నా ఎక్కువగా రష్యా చమురు కొంటోంది. తమ దేశంలో తయారయ్యే అరుదైన అయస్కాంతాలు, ఖనిజాలు అమెరికాకు ఎగుమతి చేయకుండా వాణిజ్య నియంత్రణలు పెట్టింది. అయినా చైనాపై అమెరికా చర్యలు లేవు.

### చబహార్ పోర్టు.. పెద్ద ఎదురుదెబ్బ!

ఇరాన్‌లోని చబహార్ పోర్టును భారత్ అభివృద్ధి చేసి, నిర్వహిస్తోంది. భారత్‌కు ఇది వ్యూహాత్మకంగా కీలకం. పాకిస్థాన్ మీదుగా కాకుండా నేరుగా అఫ్ఘానిస్థాన్, ఇతర మధ్య ఆసియా దేశాలతో అనుసంధానం, ఎగుమతులు, దిగుమతులతోపాటు రక్షణపరంగా కూడా దీనికి ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే భారత పశ్చిమ తీరానికి సమీపంలో పాకిస్థాన్‌లోని గ్వాదర్ పోర్టు చైనా ఆధీనంలో ఉంది. అయితే అణ్వాస్త్రాల తయారీకి ప్రయత్నిస్తోందనే ఆరోపణలతో గతంలో ఇరాన్‌పై తీవ్రస్థాయిలో ఆంక్షలు విధించిన అమెరికా.. అక్కడ భారత్ నిర్వహిస్తున్న చబహార్ పోర్టుకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. కానీ ఇన్నేళ్ల తర్వాత ఉన్నట్టుండి ఆ మినహాయింపులను ఎత్తివేసింది. పేరుకు ఇరాన్‌పై కఠిన చర్యలు అని అమెరికా చెబుతున్నా.. దానితో భారత్‌కు వ్యూహాత్మకంగా, ఆర్థికంగా దెబ్బపడింది.



### అఫ్ఘానిస్థాన్‌లో మళ్లీ పాగా వేసి..

రెండు దశాబ్దాల క్రితం తాలిబన్లను తరిమికొట్టి అఫ్ఘానిస్థాన్‌ను తమ చేతిలో పెట్టుకున్న అమెరికా.. అక్కడ సైన్యం, ఇతర వ్యయాల భారం పెరగడం, తాలిబన్ల దాడుల్లో తమ సైనికులు మరణిస్తుండటంతో అఫ్ఘానిస్థాన్‌ను వదిలేసింది. తిరిగి అధికారం చేపట్టిన తాలిబన్లు.. భారత్‌కు దగ్గరవడం, తన మిత్రదేశం పాకిస్థాన్‌కు పక్కలో బల్లెంలా మారడం అమెరికాకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో అఫ్ఘానిస్థాన్‌లో తిరిగి పాగా వేసేందుకు అమెరికా రంగంలోకి దిగుతోంది. అఫ్ఘానిస్థాన్‌లోని బగ్రాం సైనిక స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని తాజాగా ట్రంప్ ప్రకటించడం గమనార్హం.

### హెచ్1బీ వీసా ఫీజుల పెంపుతో..

అమెరికాలోని ఐటీ కంపెనీలు, ఇతర నైపుణ్య ఉద్యోగాల కోసం ఇచ్చే హెచ్1బీ వీసాల్లో 70శాతానికి పైగా భారతీయ ఉద్యోగులే ఉంటారు. ఇప్పుడీ వీసా ఫీజులను ఏకంగా లక్ష డాలర్ల (రూ.88 లక్షల)కు పెంచుతూ ట్రంప్ సర్కారు నిర్ణయించింది. ఇది భారతీయ ఉద్యోగులకు అశనిపాతమే. ఇటీవలికాలంలో బంగ్లాదేశ్, నేపాల్‌లతో అమెరికా సంబంధాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో భారత అనుకూల ప్రభుత్వం కూలిపోయి.. భారత వ్యతిరేక, పాక్ అనుకూల ప్రభుత్వం గద్దెనెక్కాక పరిస్థితులు మారాయి. బంగ్లాదేశ్‌కు అమెరికా రక్షణ సహకారం పెరిగింది. బంగాళాఖాతంలో అమెరికా నౌకాదళం చురుకుగా మారింది. నేపాల్‌లోనూ కొంతకాలం నుంచి భారత వ్యతిరేకత పెరిగింది. ఇక్కడ జెన్-జడ్ ఆందోళనల వెనుక అమెరికా హస్తం ఉండవచ్చని సండే గార్డియన్ పత్రిక ఇటీవల కథనం ప్రచురించింది.

### పాకిస్థాన్‌కు 'సౌదీ'తో రక్షణ!

తాజాగా సౌదీ అరేబియా-పాకిస్థాన్ మధ్య నాటో తరహాలో రక్షణ ఒప్పందం కుదిరింది. సౌదీ, పాక్‌లలో ఒకరిపై బయటి దేశం దాడి చేస్తే.. రెండో దేశం కూడా మద్దతుగా యుద్ధానికి దిగుతుంది. అంటే ఇటీవలి ఆపరేషన్ సిందూర్ తరహాలో భారత్‌గానీ పాక్‌పై దాడులు చేస్తే, పాక్‌కు మద్దతుగా సౌదీ రంగంలోకి దిగుతుంది. ఇది భారత్‌కు వ్యూహాత్మకంగా, రక్షణపరంగా ఇబ్బందికరమే. అమెరికా, సౌదీ మొదటి నుంచీ మిత్రదేశాలు. తాజాగా పాక్‌తో సౌదీ ఒప్పందం కుదుర్చుకోవడం వెనుక అమెరికా ఒత్తిడి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ.. అమెరికా పాక్‌కు అనుకూలంగానే వ్యవహరించింది. దాడులు ఆపాలని భారత్‌పై ఒత్తిడి తెచ్చింది.

## అమెరికా టిక్కెట్ల ధర పెరుగుదల వెనుక భారీ కుట్ర!

### భారతీయులను అడ్డుకునేందుకు మాగా, 4చాన్ కలిసి పన్నాగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: హెచ్-1బీ వీసా ఫీజు పెంపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన వెలువడిన కాసేపటికే భారత్ నుంచి అమెరికా వెళ్లే విమానాల్లో టిక్కెట్ ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. సాధారణ రోజుల్లో న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు రూ.37వేలు వరకు ఉండే ఎకనమీ క్లాస్ టిక్కెట్ ధర శనివారం రూ.80వేలకు చేరింది. ఈ ధరలు ఇలా పెరగడం వెనుక ఆన్‌లైన్‌లో భారీ కుట్ర జరిగిందంటూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హెచ్-1బీ వీసా కలిగిన భారతీయులు అమెరికాకు రాకుండా అడ్డుకునేందుకు డొనాల్డ్ ట్రంప్ మద్దతు బృందం మాగా(మేక్ అమెరికా గ్రేట్ అగైన్), 4చాన్ అనే ఆన్‌లైన్ ఫోరమ్ కలిసి ఓ భారీ ఆపరేషన్ చేపట్టాయి. హెచ్-1బీ నూతన నిబంధనలపై గందరగోళం నెలకొన్న వేళ 'క్లాగ్ ద టాయ్‌లెట్' పేరిట ఓ వ్యూహాన్ని అమలు చేసి కృత్రిమ డిమాండ్ సృష్టించిన ఆ గ్రూపులు టిక్కెట్ ధరలు భారీగా పెరిగిపోయేలా చేశాయి. "హెచ్-1బీ సంగతి భారతీయులకు ఇప్పుడే తెలిసింది. వాళ్లందరినీ భారత్‌లోనే ఉంచాలని అనుకుంటున్నారా ? ఫ్లైట్ రిజర్వేషన్ సిస్టమ్‌ను అడ్డుకోండి. టిక్కెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌ల్లో భారత్- అమెరికా మధ్య ప్రధానమైన రూట్లను తెలుసుకోండి. ఆ మార్గాల్లోని విమానాల్లో టిక్కెట్ కొనుగోలు ప్రక్రియను మొదలుపెట్టి సీట్లు ఎంపిక చేసుకోండి. కానీ టిక్కెట్లు కొనుగోలు చేయకండి. 15 నిమిషాల పాటు సీట్లను హోల్డ్‌లో పెట్టండి. ఇదే పనిని మళ్లీమళ్లీ చెయ్యండి" అని 4చాన్‌లో ఓ యూజర్ పిలుపునిచ్చాడు. ఈ మేరకు ఒకేసారి చాలామంది 4చాన్ యూజర్లు.. విమానాల్లో సీట్లను హోల్డ్‌లో పెట్టి కృత్రిమ డిమాండ్ సృష్టించి టిక్కెట్ల ధరలు పెరిగేలా చేశారు. వీరు సీట్లను హోల్డ్‌లో పెట్టడం వల్ల టిక్కెట్ బుకింగ్ సమయంలోనూ చాలామంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. "నేను 100 సీట్లు బ్లాక్ చేశా" అని 4చాన్‌లో ఓ యూజర్ పోస్టు పెట్టాడంటే ఈ కుట్ర ఏస్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

# బంగారు బాతు.. ట్రంప్ ఆశపోతు



బంగారు గుడ్లు పెట్టే బాతును కోసి చంపిన ఆశపోతు రైతు కథ గుర్తుందా? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అచ్చం ఆ ఆశపోతు రైతులాగానే ఆలోచిస్తున్నారని.. టెక్నాలజీపరంగా అమెరికా ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండడానికి కారణమైన బంగారు బాతుల్లాంటి విదేశీ టెకీలపై లక్ష డాలర్ల ఫీజు బాదుడే ఇందుకు నిదర్శనమని పలువురు టెక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, లక్ష డాలర్ల హెచ్-1బీ వీసా ఫీజు కొత్తగా వచ్చేవారికే వర్తిస్తుందని, పైగా ఇది ఒక్కసారి చెల్లిస్తే సరిపోతుందని అమెరికా వివరణ ఇచ్చిన నేపథ్యంలో.. భారత ఐటీ కంపెనీలపై దాని ప్రభావం పెద్దగా పడదని కూడా వారు విశ్లేషిస్తున్నారు. ఉదాహరణకు.. దేశంలోని టాప్-5 టెక్ దిగ్గజ సంస్థల వార్షిక ఆదాయం 80 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.7 లక్షల కోట్లు). ఆ ఐదు కంపెనీలూ కలిసి 10 వేల కొత్త హెచ్-1బీ వీసాల కోసం దరఖాస్తు చేశాయనకుంటే వార్షికాదాయంపై రూ.8 వేల కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని అంచనా. ఇది ఆయా సంస్థల మార్జిన్‌లో దాదాపు 7 శాతానికి సమానమని సొవిలో ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్‌కు చెందిన సందీప్ అగర్వాల్ పేర్కొన్నారు. కానీ.. వీసా ఫీజు ఏటా ఉండదని అమెరికా తేల్చిచెప్పడంతో మార్జిన్లు 1-2 శాతం మేర మాత్రమే తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. మన సంగతి అలా ఉంచితే.. హెచ్-1బీ వీసా ఫీజు బాదుడు వల్ల అమెరికా కంపెనీలపైనే ఎక్కువ ప్రభావం పడుతుందని టెక్ నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు.. అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా తదితర దిగ్గజ సంస్థలు హెచ్-1బీ వీసాలపై భారీగా ఆధారపడుతున్నాయి. 2025లోనే అమెజాన్ సంస్థ 12 వేలకు పైగా హెచ్-1బీ వీసా అనుమతులు పొందింది. ఒక్కో వీసాకు లక్ష డాలర్ల చొప్పున.. వచ్చే మూడేళ్లలో అమెజాన్ సంస్థే ఏకంగా 3.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.31 వేల కోట్లు) అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇక.. మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, ఒరాకిల్ తదితర దిగ్గజ సంస్థల సంగతి సరేసరి. ఈ విషయం తెలుసుగనకనే.. ఒకప్పుడు హెచ్-1బీ వీసాపై అమెరికాకు వచ్చి అతిపెద్ద వ్యాపారవేత్తగా ఎదిగిన మస్క్ వంటివారు ఈ విషయంలో ట్రంప్ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నారు.

### మనోళ్ల దీర్ఘదృష్టి..

ఇలాంటి ప్రమాదాన్ని ముందుగా ఊహించే.. భారతీయ టెక్ సంస్థలు గత మూడేళ్లుగా హెచ్-1బీ వీసా కేటాయింపులను తగ్గించుకుంటూ వస్తున్నాయి. గణాంకాల ప్రకారం.. 2022 నుంచి 2025 దాకా విప్రో సంస్థ హెచ్-1బీ వీసా కేటాయింపులను 33% మేర తగ్గిస్తే.. టీసీఎస్ సంస్థ 45% మేర, ఇన్ఫోసిస్ ఏకంగా 71 శాతం మేర తగ్గించాయి. ప్రస్తుతం తాము 20 నుంచి 50 శాతంలోపు మాత్రమే హెచ్-1బీ వీసాలపై ఆధారపడుతున్నట్టు ఆయా కంపెనీలు చెబుతున్నాయి. అంటే.. ఒక ప్రాజెక్టుకు 100 మంది టెకీలు అవసరం అనుకుంటే.. వారిలో 20 నుంచి 50 మంది మాత్రమే హెచ్-1బీ వీసాలపై అమెరికాకు వెళ్లి పనిచేయాల్సి వస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో కంపెనీలు హెచ్-1బీ డిపెండెన్సీని మరింత తగ్గించుకుని.. ఇక్కడి నుంచే తమ ఉద్యోగులతో పని చేయించుకునే ప్రయత్నం చేస్తాయి. లేదా మనవాళ్లు అక్కడిదాకా వెళ్లడం తప్పనిసరి అనుకుంటే.. 'నియర్‌షోర్/ఆఫ్‌షోర్' బృందాలను నియమించుకుంటాయి. అంటే.. అమెరికాకు సమీపంలోని దేశాల్లో చిన్నచిన్న టీములను నియమించడం. కెనడా, మెక్సికో, పశ్చిమయూరప్ దేశాల నుంచి ఆ టీములు పనిచేస్తుంటాయి. అదే సమయంలో.. తగినంత మంది విదేశీ నిపుణులు అందుబాటులో లేక అమెరికా కంపెనీలు అధిక వేతనాలు ఇచ్చి స్థానికులను నియమించుకోవాల్సి వస్తుంది. ఈ పరిణామాలన్నీ అమెరికా కంపెనీల లాభాలను తగ్గించేవే!

### భయంతో బతకొద్దు.. భారత్‌కు వచ్చేయండి

దేశ విభజన జరిగినప్పుడు పాక్ నుంచి వలస వచ్చిన ఎంతో మంది సింధీ స్నేహితుల కథలను నేను విన్నాను. వారంతా తమ జీవితాలను పునర్నిర్మించుకుని ఇప్పుడు భారత్‌లో చక్కగా ఉన్నారు. అలాగే.. హెచ్-1బీ వీసాపై ప్రస్తుతం అమెరికాలో ఉన్నవారంతా తిరిగి భారత్‌కు వచ్చేయండి. మీ జీవితాలను పునర్నిర్మించుకోవడానికి మహా అయితే ఐదేళ్లు పడుతుంది. కానీ, ఈ పరిణామాలు మిమ్మల్ని మరింత శక్తిమంతులను చేస్తాయి. భయంలో బతకొద్దు. ధైర్యంతో ముందడుగు వేయండి. అంతా మంచే జరుగుతుంది.

– శ్రీధర్ వేంబు, జోహో వ్యవస్థాపకుడు

### అందిపుచ్చుకుంటే అవకాశం..

అమెరికా జారీ చేస్తున్న హెచ్-1బీ వీసాల్లో 71 శాతం మనోళ్లకే వస్తుండడంతో.. పైకి చూడ్డానికి ఇది సంక్షోభంలా కనిపిస్తోందిగానీ, అందిపుచ్చుకుంటే ఇదో గొప్ప అవకాశం అని.. ట్రంప్ నిర్ణయాలతో మనకు కొత్త ద్వారాలు తెరుచుకుంటాయని క్వెస్ గ్రూప్ సీఈవో గురుప్రసాద్ శ్రీనివాసన్ వంటివారు అభిప్రాయపడుతున్నారు. "హెచ్-1బీ వీసాల్లో ఎక్కువ శాతం భారతీయులకే వస్తున్నాయి. అమెరికా మన ప్రతిభ మీద ఎంతగా ఆధారపడిందో చెప్పడానికి ఇదే నిదర్శనం. అయితే, అమెరికాలో ఆన్‌సైట్ ఉద్యోగాలు ట్రంప్ నిర్ణయంతో ఖరీదుగా మారుతాయి కాబట్టి.. చాలా కంపెనీలు ఆ పనిని భారత్‌కు తరలించడానికి ప్రయత్నిస్తాయి. ఆయా కంపెనీలకు అవసరమైన ఏర్పాట్లు ప్రభుత్వం చేయగలిగితే.. దశాబ్దాలుగా ఇక్కడి నుంచి అక్కడికి కొనసాగుతున్న వలసలు రివర్స్ అవుతాయి. అక్కణ్నుంచీ ప్రతిభావంతులైన మనోళ్లంతా ఇక్కడికి తిరిగివస్తారు" అని ఆయన వివరించారు. ప్రభుత్వం గనక వారికి సరైన ప్రోత్సాహకాలు అందించగలిగితే వారంతా అద్భుతాలు సృష్టిస్తారని చెబుతున్నారు. ఇప్పుడు నవకల్పనలు (ఇన్నోవేషన్) సిలికాన్ వ్యాలీకి మాత్రమే పరిమితం కాదు. మనదేశంలోనూ సిలికాన్‌వ్యాలీలో పనిచేసేవారితో పోటీపడగలిగే యువ ప్రతిభావంతులు లెక్కకు మిక్కిలిగా తయారవుతున్నారు. వారికి మరింత మెరుగైన అవకాశాలు కల్పిస్తే మనదేశంలోనూ యూనికార్న్(100 కోట్ల డాలర్లు అంతకంటే ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన స్టార్టప్‌లు)ల సంఖ్య భారీగా పెరుగుతుంది. -సెంట్రల్ డెస్క్

# దిక్సూచి

## టీజీ ఆర్టీసీలో 1743 ఉద్యోగాలు

తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జోన్‌ల్లో ఖాళీగా ఉన్న 1743 డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

**డ్రైవర్లు: 1000, శ్రామిక్: 743, మొత్తం: 1743**

**అర్హత:** పోస్టులను అనుసరించి ఐటీఐ, పదో తరగతితోపాటు, డ్రైవింగ్ లైసెన్స్, పని అనుభవం ఉండాలి.

**వయస్సు:** 2025 జూలై 1 నాటికి డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35 సంవత్సరాలు, శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

**ఎంపిక:** ఫిజికల్ మెజర్‌మెంట్, మెడికల్, డ్రైవింగ్ టెస్ట్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**చివరి తేదీ:** 2025 అక్టోబర్ 28 **వెబ్‌సైట్:** www.tgprb.in

## పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో 190 మేనేజర్లు

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో రెగ్యులర్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న క్రెడిట్ మేనేజర్, అగ్రికల్చర్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్లయి చేసుకోవచ్చు.

**క్రెడిట్ మేనేజర్: 130, అగ్రికల్చర్ మేనేజర్: 60**
**మొత్తం ఖాళీలు : 190**

**వయస్సు:** 23 నుంచి 35 ఏళ్ల మధ్యలో ఉండాలి. అంటే అభ్యర్థులు 1990 సెప్టెంబర్ 2 నుంచి 2002 సెప్టెంబర్ 1 మధ్యలో జన్మించి ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

**చివరి తేదీ:** 2025 అక్టోబర్ 10
**వెబ్‌సైట్:** punjabandsind.bank.in/

## ఈసీఐఎల్‌లో 160 టెక్నికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో (ఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన 160 టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్ పాసై ఉండాలి. కనీసం ఏడాది అనుభవం అవసరం.

**వయస్సు:** 30 సంవత్సరాలకు మించి ఉండరాదు.
**చివరి తేదీ:** 22 సెప్టెంబర్ 2025
**వెబ్‌సైట్:** www.ecil.co.in

## ఆర్‌ఆర్‌బీలో 368 సెక్షన్ కంట్రోలర్ పోస్టులు

దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే జోన్లలో కలిపి మొత్తం 368 సెక్షన్ కంట్రోలర్ ఉద్యోగాల కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సింగిల్ స్టేజ్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఉద్యోగాల ఎంపిక ఉంటుంది. మొత్తం పోస్టుల్లో సికింద్రాబాద్ డివిజన్ కింద 25 పోస్టులు ఉన్నాయి.

**వయస్సు:** 20 నుంచి 30 సంవత్సరాల లోపు ఉండాలి.
**చివరి తేదీ:** 2025 అక్టోబర్ 14
**వెబ్‌సైట్:** www.rrbapply.gov.in/



## ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 7267 ఖాళీలు

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్(ఈఎంఆర్ఎస్)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 7267 టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు. భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద స్వయం ప్రతిపత్తితో నడుస్తున్న 'నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్' ఈ ఏకలవ్య మోడల్ స్కూల్స్‌ను నిర్వహిస్తోంది. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ పోస్టుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక వేళ అర్హత ఉన్నట్లయితే అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అలాంటి అభ్యర్థులు ఆయా పోస్టులకు సంబంధించిన ఫీజులను అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

| పోస్టు పేరు | ఖాళీలు |
|---|---|
| ● ప్రిన్సిపాల్ | 225 |
| ● పీజీటీ | 1460 |
| ● హాస్టల్ వార్డెన్(పురుషులు) | 346 |
| ● జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్(క్లార్క్) | 228 |
| ● అకౌంటెంట్ | 61 |
| ● స్టాఫ్ నర్స్(ఫీమేల్) | 550 |
| ● టీజీటీ | 3962 |
| ● హాస్టల్ వార్డెన్ (మహిళలు) | 289 |
| ● ల్యాబ్ అటెండెంట్ | 146 |
| ● మొత్తం ఖాళీలు | 7267 |



**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, బీఈడీ, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, ఇంటర్, టెన్త్, డిప్లొమా పాసై ఉండాలి.

**వయస్సు:** ప్రిన్సిపాల్ పోస్టులకు 50 ఏళ్లు, హాస్టల్ వార్డెన్, మహిళా స్టాఫ్ నర్సు పోస్టుకు 35 ఏళ్లు, జూనియర్ సెక్రటేరియల్ అటెండెంట్‌కు 30 ఏళ్ల లోపు ఉండాలి.

**ఫీజు:** జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రిన్సిపల్ పోస్టుకు రూ. 2500/-, టీజీటీ, పీజీటీ పోస్టులకు రూ.2000/-, నాన్ టీచింగ్ పోస్టులకు రూ.1500/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, మహిళా అభ్యర్థులకు రూ.500/-

**ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. మల్టిపుల్ ఆన్సర్ తరహాలో పెన్, పేపర్ పద్ధతిలో వంద ప్రశ్నలతో వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రిన్సిపాల్ పోస్టులకు రీజనింగ్, న్యూమరిక్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, అకడమిక్-రెసిడెన్షియల్ యాస్పెక్ట్స్, అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్, జనరల్ ఇంగ్లిష్, హిందీ లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్ ఉంటుంది. పీజీటీ పోస్టులకు జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ ఎబిలిటీ, కంప్యూటర్ నాలెడ్జ్, టీచింగ్ ఆప్టిట్యూడ్, డొమైన్ నాలెడ్జ్ ఉంటుంది. టీజీటీ, ఇతర పోస్టులకు సిలబస్ కూడా దాదాపుగా అంతే ఉంటుంది. ఎన్ఈఎస్‌టీఎస్ వెబ్‌సైట్‌లో పూర్తి సిలబస్ అందుబాటులో ఉంది.

**పరీక్ష కేంద్రాలు:** ప్రిన్సిపాల్ పోస్టులకు మాత్రం పరీక్ష ఢిల్లీ లోనే నిర్వహిస్తారు. మిగిలిన పోస్టులకు సంబంధించి మాత్రం వచ్చిన దరఖాస్తులను అనుసరించి సెంటర్ల అలాట్‌మెంట్ ఉంటుంది.

**చివరి తేదీ:** 2025 అక్టోబర్ 23 **వెబ్‌సైట్:** nests.tribal.gov.in/

## ఎస్‌బీఐ ప్లాటినమ్ జూబ్లీ

చదువులో ప్రతిభ కనపరిచే విద్యార్థుల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 'ప్లాటినమ్ జూబ్లీ ఆశా స్కాలర్‌షిప్ 2025'ని ప్రకటించింది. ఈ సంవత్సరం ఎస్‌బీఐ ప్లాటినమ్ జూబ్లీని జరుపుకుంటున్నందుకు గుర్తుగా దీనిని ప్రారంభించారు. 90 కోట్లతో దేశవ్యాప్తంగా 23,200 మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదువుకునే పేద విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. దీని కింద కోర్సులను బట్టి 15 వేల నుంచి 20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తారు.

● పాఠశాల విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, వైద్య విద్యార్థులు, ఐఐటీ, ఐఐఎం విద్యార్థులతోపాటు ఓవర్సీస్ విద్యార్థులు కూడా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు

**అర్హత:** ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించాలంటే విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో 75 శాతం మార్కులు లేదా 7 సీజీపీఏ సాధించి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం పాఠశాల కేటగిరీకి అయితే మూడు లక్షలు, ఇతర కేటగిరీలకైతే ఆరు లక్షలు. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు పది శాతం సడలింపు ఉంటుంది. మార్కుల్లో అయితే 67.5 శాతం/ 6.30 సీజీపీఏ సాధించాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. **చివరి తేదీ:** 2025 నవంబర్ 15

**వెబ్‌సైట్:** https://www.sbiashascholarship.co.in/

SCHOLARSHIP ALERT

## అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్

ఆర్థికంగా వెనకబడి, ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థినుల కోసం ఇచ్చే 'అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్' కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఈ పథకానికి ఎంపికైన విద్యార్థినులకు సంవత్సరానికి 30 వేల రూపాయలు(పదిహేను వేల రూపాయల చొప్పున రెండు విడతలు) అందజేస్తారు. వీరు రెగ్యులర్ పద్ధతిలో గ్రాడ్యుయేషన్ లేదా డిప్లొమా చదువుతూ ఉండాలి. తెలంగాణ సహా భారత దేశంలోని 19 రాష్ట్రాల బాలికలు ఈ ఉపకార వేతనానికి అర్హులు.

**అర్హత:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో రెగ్యులర్ పద్ధతిలో పది, ఇంటర్ పూర్తి చేసి ఉండాలి.

● ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేషన్ లేదా డిప్లొమా కోర్సు(2 నుంచి 5 సంవత్సరాల కాల వ్యవధి)లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది ఉండాలి.

**జత పరచాల్సినవి:**

- ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ ఫోటో
- తెల్లకాగితంపై చేసిన సంతకం
- కలర్డ్ ఆధార్ కాపీ(పేరు, పుట్టిన తేదీ, ఫోటో తదితర వివరాలన్నీ స్పష్టంగా కనిపించేలా ఉండాలి).
- బ్యాంక్ పాస్‌బుక్‌లోని మొదటి పేజీ(పేరు, అకౌంట్ నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, చిరునామా తదితరాలన్నీ స్పష్టంగా కనిపించాలి),
- పది, ఇంటర్ మార్కుల మెమోలు.
- కాలేజీ అడ్మిషన్ రుజువులు(బోనోఫైడ్ సర్టిఫికెట్ అయినా ఫర్వాలేదు)
- పూర్తి వివరాల కోసం (https://azimpremjifoundation.org/) వెబ్‌సైట్ చూడవచ్చు.

# చిత్రజ్యోతి

SINCE 1965



## నాన్నగారికి నివాళిగా శివ రీ రిలీజ్

నాగార్జున

అక్కినేని నాగార్జున హీరోగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన 'శివ' అప్పట్లో సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని 4కే డాల్బీ అట్మాస్‌లో నవంబరు 14న రీ రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు నాగార్జున. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రీ రిలీజ్ కోసం 'శివ' సినిమాను సాంకేతికంగా అప్‌గ్రేడ్ చేశాం. ఇది మీకు సరికొత్త అనుభూతిని అందించబోతోంది. సినిమాకు తరాలకు మించి జీవించే శక్తి ఉంది అని నాన్నగారు నమ్మేవారు. 'శివ' అలాంటిదే. ఈ చిత్రాన్ని మళ్లీ మీ ముందుకు తీసుకురావడం కథలను సజీవంగా ఉంచాలనే నాన్నగారికి ఘనమైన నివాళి' అని అన్నారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ 'శివ' రీరిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. 1989లో విడుదలైన ఈ సినిమాను అక్కినేని వెంకట్, సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు.



## నాకు ఏదీ ఊరకే రాలేదు

పవన్ కల్యాణ్

'సంజయ్ సాహూకు ఏదీ ఊరక రాలేదు' అని 'జల్సా' చిత్రంలో ఒక డైలాగ్ ఉంది. అలాగే పవన్ కల్యాణ్‌కు కూడా ఏదీ ఊరకే రాలేదు. నేను సినిమాలు వదలి రాజకీయాల్లోకి వెళ్లినా మీరు (అభిమానులు) మాత్రం నన్ను వదల్లేదు. మీరు కదా నాకు భవిష్యత్ ఇచ్చింది. ఈ రోజు రాజకీయాల్లో ప్రజల కోసం కొట్లాడుతున్నానంటే మీరిచ్చిన బలంతోనే' అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి స్టేడియంలో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "వర్షం మనల్ని ఆపుతుందా? మనల్ని ఏది ఆపింది గనుక ఇప్పటిదాకా, ఒక ఓటమి ఆపిందా?, పరాజయాలు ఆపాయా?. ఈ రోజున నేనొక డిప్యూటీ సీఎం అని మర్చిపోయాను. ఈ స్థాయి వ్యక్తి ఎవరైనా ఇలా కత్తి పట్టుకొని వేదికపైకి రావడం ఊహించగలమా? నేను సినిమా ప్రేమికుణ్ణి. నాకు సినిమా చేసేటప్పుడు సినిమా తప్ప మరో ఆలోచన ఉండదు. నా లైఫ్‌లో ఆడియో ఫంక్షన్లకు ఇలా ఎప్పుడూ రాలేదు. దర్శకుడు సుజీత్ వల్లే 'ఓజీ' సినిమాలోని కాస్ట్యూమ్స్‌తో రావాల్సి వచ్చింది. నా అభిమానులైన మీ కోసమే ఇదంతా. 'ఖుషీ' సినిమా అప్పుడు మీలో ఉన్న జోష్‌ను మళ్లీ ఈ రోజు చూస్తున్నాను" అని అన్నారు. వాషి యో వాషి అనేది ఒక జపనీస్ హైకూ. సుజీత్ తన స్క్రిప్ట్‌లో విలన్ పాత్రను ఉద్దేశించి 'నువ్వు ఆకాశంలో విహరిస్తున్నావు, నిన్ను కిందకు తీసుకొచ్చి నేలమీద కూర్చుబెడతాను' అని రాశారు. ఇది నేను పాడాలనుకోలేదు. తమన్ కోరిక మేరకు పాడాను. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ గారితో కలసి పనిచేయడం సంతోషం కలిగించింది. ఆయనో అద్భుతమైన నటుడు. సుజీత్‌ను త్రివిక్రమ్ పరిచయం చేశారు. అతను చెప్పేది తక్కువ కానీ తీసేటప్పుడు అతని సత్తా తెలుస్తుంది. ఈ సినిమాకు నేను కాదు సుజీత్, తమన్ స్టార్స్. ప్రియాంక అరుల్ మోహన్ గారి పాత్ర హృద్యంగా ఉంటుంది. మంచి ప్రేమకథ మా మధ్యన ఉంటుంది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటన్నింటినీ అధిగమించి ఈ నెల 25న 'ఓజీ'తో మీ ముందుకు వస్తున్నాం' అని చెప్పారు. నిర్మాత అల్లు అరవింద్, దిల్ రాజు, వై రవిశంకర్, నటులు ఇమ్రాన్‌హష్మీ, అర్జున్‌దాస్, శ్రియారెడ్డి, ప్రియాంక అరుల్ మోహన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### అభిమానుల్లో ఒకడిగా ఓజీ

తెరపైన తనదైన శైలి నటనతో విజృంభించి అభిమానులను అలరించిన పవన్ కల్యాణ్ ఓజీ వేడుకలో తన ఫ్యాన్స్‌ను ఆశ్చర్యంలో ముంచెత్తారు. పబ్లిక్ ఫంక్షన్లలో ప్రసంగానికి మాత్రమే పరిమితమయ్యే ఆయన తన సహజ శైలికి భిన్నంగా అభిమానుల్లో ఒకరైపోయారు. డిప్యూటీ సీఎం హోదాను పక్కనపెట్టి వారితో కలసిపోయారు. తన అభిమానులను ఫుల్ ఖుషీ చేశారు. 'ఓజీ' చిత్రంలోని ఓజాస్ గంభీర పాత్రను అభిమానుల ముందు అభినయించి ఆకట్టుకున్నారు. అంతేకాకుండా తను స్వయంగా అభిమానులతో గొంతు కలిపి ఓజీ సినిమాలోని డైలాగ్స్ చెబుతూ వారిని ఉత్సాహపరిచారు. సినిమాలోని గెటప్పుతో హాజరవడమే కాదు 'వాషి యో వాషి' అనే పాటను లైవ్ లో పాడి అలరించారు. పవన్ కల్యాణ్ నుంచి అలాంటి స్పందన ఊహించని అభిమానులు ఓ వైపు జోరు వర్షం కురుస్తున్నా కదలకుండా ఉండిపోయారు. వారి నినాదాలు, తమన్ సంగీత ప్రదర్శనతో స్టేడియం మార్మోగింది.

## మీ ప్రతిభకు తగ్గ గుర్తింపు



చిరంజీవి

మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్‌ను కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపిక చేయడం పట్ల చిత్రపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి మోహన్‌లాల్‌ను సోషల్ మీడియా ద్వారా అభినందించారు. 'డియర్ లాలెట్టన్. ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించినందుకు హృదయపూర్వక అభినందనలు. మీ అద్భుతమైన ప్రయాణం, ఐకానిక్ పెర్ఫార్మెన్స్ భారతీయ సినిమాను సుసంపన్నం చేశాయి. నిజంగా ఇది మీ ప్రతిభకు తగిన గుర్తింపు' అని చిరంజీవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్‌తో దిగిన ఫొటోని షేర్ చేశారు.

## నటి రాధికకు మాతృవియోగం



దివంగత సీనియర్ నటుడు ఎం.ఆర్.రాధా సతీమణి, సీనియర్ సినీ నటీమణులు రాధిక, నిరోషల తల్లి గీతా రాధ (86) అనారోగ్యం కారణంగా ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. తన తల్లి వృద్ధాప్యం కారణంగా కన్నుమూసినట్లు రాధిక ఒక ప్రకటనలో వెల్లడించారు. గీతా రాధ భౌతికకాయాన్ని సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఆళ్వార్‌పేటలోని బీసీ రోడ్డు, పోయెస్ గార్డెన్, మానసర్ అపార్టుమెంట్‌లో ఉంచారు. అంత్యక్రియలను సోమవారం సాయంత్రం బీసెంట్ నగర్‌లోని విద్యుత్ దహనవాటికలో జరుగుతాయని రాధిక వెల్లడించారు. కాగా, గీతా రాధకు ఇద్దరు కుమార్తెలతో పాటు రాజు, మోహన్ అనే ఇద్దరు కుమారులు న్నారు. గీతా రాధ మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

## ఆకట్టుకునే 'ఇడ్లీ కొట్టు'



'కుబేర'తో ఘన విజయం అందుకున్న ధనుశ్ తాను కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఇడ్లీ కొట్టు'. నిత్యా మీనన్ కథానాయిక. డాన్ పిక్చర్స్, వండర్ బార్ ఫిల్మ్స్ బేనర్లపై ఆకాశ్ భాస్కరన్ నిర్మించారు. అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తెలుగులో ఈ చిత్రాన్ని శ్రీ వేదాక్షర మూవీస్ బేనర్‌పై రామారావు చింతపల్లి రిలీజ్ చేస్తున్నారు. తాజాగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఇడ్లీ గ్రైండర్ కొంటే పని తేలిక అవుతుంది. సమయం కూడా ఆదా అవుతుంది...' అంటూ కథానాయకుడు తన తండ్రిని ఒప్పించే సన్నివేశంతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. మురళి పాత్రలో ధనుశ్ అద్భుతంగా నటించారు. ఈ చిత్రంలో అరుణ్ విజయ్, శాలినీ పాండే, సత్యరాజ్ కీలక పాత్రలు పోషించారు.

## గ్రామీణ నేపథ్యంలో



అభినవ శౌర్య, నరసింహా, అనుశ్రీ ప్రధాన పాత్రధారులుగా బెల్లం రామకృష్ణారెడ్డి దర్శకత్వం వహిస్తూ నిర్మిస్తోన్న చిత్రం 'దేవగుడి'. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ 'మా ఊరు పేరుతో ఈ చిత్రాన్ని తీసుకురావడం ఆనందంగా ఉంది' అని అన్నారు. బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'మా నాయకుల నిబద్ధతను ప్రేరణగా తీసుకొని ఎంతో జాగ్రత్తగా ఈ చిత్రాన్ని రూపొందించాను. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించాలని కోరుతున్నా' అని అన్నారు.



## నటీనటులను కించపరిస్తే కఠిన చర్యలు

● నడిగర్ సంఘం తీర్మానం

నటీనటులను కించపరిచేలా సోషల్ మీడియాలో ట్రోల్స్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివారం జరిగిన నడిగర్ సంఘం (దక్షిణ భారత నటీనటులు సంఘం) సర్వసభ్య మండలి 69వ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తి, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. 'దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు'కు ఎంపికైన మలయాళ నటుడు మోహన్‌లాల్‌కు అభినందనలు తెలుపుతూ మరొక తీర్మానం చేశారు. నటీనటులను కించపరిస్తే ఇకపై క్షమించరాదనీ, పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

## యువతరం మెచ్చేలా...



త్రినాథ్ కఠారి కథానాయకుడిగా నటిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు మీ వెధవ'. 'వెయ్యేళ్లు ధర్మంగా వర్ధిల్లు' అనేది ఉపశీర్షిక. సాహితీ అవాంచ హీరోయిన్. బళ్లారి శంకర్ ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌ను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ గ్లింప్స్ ఆసక్తికరంగా ఉంది. యువతరరం మెచ్చేలా ఉన్న ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.

## బ్లాక్‌బస్టర్ 'బ్యూటీ'



'ఈ 'బ్యూటీ' సినిమాలోని సోల్ మా అందరినీ ప్రమోషన్స్‌లో ఎక్కువ మాట్లాడించేసింది. ఇప్పుడు ఆ సోల్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతోంది' అని సీనియర్ నటుడు వీకే నరేశ్ అన్నారు. అంకిత్ కొయ్య, నీలఖి, వీకే నరేశ్, వాసుకి ప్రధాన పాత్రధారులుగా జేఎస్ఎస్ వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'బ్యూటీ' ఇటీవలె విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విజయోత్సవ సభ నిర్వహించింది. అంకిత్ కొయ్య మాట్లాడుతూ 'ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుందని నాకు ముందే తెలుసు. అందరి మనసులకు హత్తుకునే సినిమా తీసిన వర్ధన్‌ను చూస్తుంటే గర్వంగా ఉంది' అని చెప్పారు.

## జీఎస్టీ సంస్కరణలతో పేదలకు న్యాయం

» మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ: సంజయ్



కరీంనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పేదలకు న్యాయం జరుగుతుందని కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు జరిగిన నష్టమేంటో చెప్పకుండా ఇడ్లీ, దోశ, వడ అంటూ పనికిమాలిన మాటలు మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం సొంత ఇంటినే త్యాగం చేసిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. 96 ఏళ్ల వయస్సులో తెలంగాణ కోసం జంతర్‌మంతర్ వద్ద ఎముకలు కొరికే చలిలో దీక్ష చేసిన నాయకుడని కొనియాడారు.

## ఆర్‌ఆర్‌ఆర్ మార్గాన్ని పునః సమీక్షించాలి

» రైతుల భూములను కాపాడాలి: రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ రింగ్(ఆర్‌ఆర్‌ఆర్) రోడ్డు దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. రైతుల భూములు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పుట్టపాక రైతులు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి రాంచందర్‌రావును కలిశారు. ప్రస్తుత అలైన్‌మెంట్‌ను మార్చి మళ్లీ సర్వే నిర్వహించకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని చెప్పారు. ఈసందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. రైతుల జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని తెలిపారు. ప్రస్తుత అలైన్‌మెంట్‌తో సన్న, చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. కాగా, హెచ్‌సీయూ ఎన్నికల్లో విజయం సాధించిన ఏబీవీపీని రాంచందర్‌రావు అభినందించారు.

## ఎస్‌ఆర్‌డీఎస్ మెంటర్ సెక్రటరీగా ఎం శ్రీనివాస్



సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్(ఎస్‌ఆర్‌డీఎస్)కు మెంబర్ సెక్రటరీగా ఎం.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్ ఇంతకు ముందు పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

## వాటర్ ట్యాంకులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రం శివారులోని ఓ సిమెంట్ పైపుల ఫ్యాక్టరీ క్యూరింగ్ వాటర్ ట్యాంక్‌లో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. స్థానిక బొమ్మకల్ రోడ్‌లో ఉన్న సత్యం సిమెంట్ పైపుల ఫ్యాక్టరీలో బిహార్‌కు చెందిన బిట్టు కుమార్ అయిదేళ్లుగా కూలీగా పనిచేస్తూ ఫ్యాక్టరీ ఆవరణలోని షెడ్డులో భార్య సుధాదేవి, ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం బయట ఆడుకుంటున్న వారి ఇద్దరు కుమారులు సత్యం కుమార్ (4), ఆర్యన్ కుమార్ (2) కనిపించకుండాపోయారు. ఫ్యాక్టరీ ఆవరణలో వెతికిన తల్లి సుధాదేవి వాటర్ ట్యాంక్‌లో ఆర్యన్ మృతదేహం నీటిపై తేలుతూ కనిపించడం చూసి నిర్ఘాంతపోయింది. ఫ్యాక్టరీలోని కూలీలకు సమాచారం అందించగా వారు ఆర్యన్ మృతదేహాన్ని బయటకు తీశారు. నీటి లోపల వెతకగా సత్యం మృతదేహం కూడా అందులోనే ఉంది. చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అలరించిన 'చాకలి ఐలమ్మ' నృత్యనాటకం

» ఆకట్టుకున్న అలేఖ్య పుంజాల నటనా కౌశలం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంగీత, నాటక అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన చాకలి ఐలమ్మ నృత్య నాటిక ఆకట్టుకుంది. నాటికను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ నేటి తరం యువతకు ఐలమ్మ వంటి యోధురాలి గురించి తెలియజేసేలా ఉన్న ప్రదర్శన అద్భుతమన్నారు. ఐలమ్మగా నటన కౌశలాన్ని ప్రదర్శించిన సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాలను ఆయన అభినందించారు. వడ్డేపల్లి కృష్ణ రాసిన ఈ నృత్య నాటకానికి వీబీఎస్ మురళి సంగీత స్వరాలను సమకూర్చారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

## టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వండి

» కిషన్ రెడ్డిని కోరిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి కాకుండా విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఆదివారం పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పుల్గం దామోదర్ రెడ్డి, సుంకరి భిక్షం గౌడ్‌తో కలిసి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి సమస్యను వివరించి, పరిష్కారానికి కృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే దీర్ఘకాలికంగా ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర హోంశాఖ నుంచి ఉత్తర్వులు ఇప్పిస్తానని అన్నారు. రాష్ట్రంలో పాఠశాలల అభివృద్ధికి కేంద్రం అదనపు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కోరగా.. విషయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళతానని కిషన్‌రెడ్డి తెలిపారు.

# శివునీ ముద్దుల గుమ్మ..!

(మొదటిపేజీ తరువాయి)

సంతరించుకోగా.. ఎక్కడికక్కడ బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్ వేయి స్తంభాల గుడి ఆవరణలో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ధనసరి అనసూయ(సీతక్క), కొండా సురేఖ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల, సంగీత నాటక అకాడమి చైర్‌పర్సన్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు. వేయి స్తంభాల గుడి వద్దకు బతుకమ్మలతో వచ్చిన మంత్రులు సీతక్క, సురేఖ.. ఆ తర్వాత మహిళలతో కలిసి కాసేపు బతుకమ్మ ఆడారు. వేయి స్తంభాలు గుడి పరిసరాలు జనసంద్రాన్ని తలపించాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఇక, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతీలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో బహుజన బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. బహుజన బతుకమ్మ వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క ఈ వేడుకలో పాల్గొన్నారు. గ్రామంలో అమరులైన సంజీవ్, జాన్సన్, అక్తర్, కనకయ్యను వేడుకలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో గుర్తు చేసుకుని ఆమె కంటతడి పెట్టుకున్నారు. ఇక, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

### బతుకమ్మను కాదని యూరియా కోసం క్యూకట్టి

ఖానాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రాష్ట్రంలో రైతులు పడుతున్న కష్టాలకు నిదర్శనంగా నిలిచే ఘటన ఇది. బతుకమ్మ అంటేనే ఆడవారి పండుగ. అలాంటిది వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన మహిళలు మాత్రం బతుకమ్మ పండుగను పక్కనపెట్టి మరీ యూరియా కోసం క్యూలు కట్టారు. గ్రామానికి సోమవారం ఉదయం యూరియా వస్తుందని, టోకెన్లు ఇస్తామని వ్యవసాయాధికారులు గ్రామ వాట్సాప్ గ్రూపులో ఆదివారం రాత్రి ఓ మెసేజ్ పెట్టారు. అంతే, అప్పటిదాకా బతుకమ్మ ఆడుతూ సందడిగా గడిపిన మహిళలంతా ఆటపాటలను ఎక్కడికక్కడ ఆపేసి యూరియా టోకెన్ల కోసం గ్రామంలోని ఎరువుల గోదాము వద్ద రాత్రి తొమ్మిది గంటలప్పుడు క్యూకట్టారు.



హుస్నాబాద్‌లో మహిళలతో బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొన్నం



వేయి స్తంభాల గుడిలో బతుకమ్మ ఆడుతున్న మంత్రులు సురేఖ, సీతక్క

## కేఏ పాల్‌పై లైంగిక వేధింపుల కేసు

(మొదటిపేజీ తరువాయి)

చేరింది. తాను నైట్ షిఫ్ట్‌లో ఉండగా కేఏ పాల్ తనను తాకుతూ అసభ్యంగా ప్రవర్తించారని, వాట్సాప్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపి వేధించారంటూ ఆమె షీటీమ్స్‌ను ఆశ్రయించింది. కేఏ పాల్ వద్ద ఉద్యోగం మానేసిన ఆమె తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను కూడా షీటీమ్స్‌కు సమర్పించింది. షీటీమ్స్ అధికారుల సూచనల మేరకు ఆ యువతి శనివారం రాత్రి పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేఏ పాల్‌పై ఫిర్యాదు చేసింది. తన వద్ద ఉన్న ఆధారాలను పోలీసులకు అందజేసింది. ఆ ఫిర్యాదు మేరకు కేఏ పాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు కేఏ పాల్ కార్యాలయానికి వెళ్లగా తాళం వేసి ఉంది. కేఏ పాల్ ఆచూకీ కోసం అక్కడున్న ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని పోలీసులు ప్రశ్నించగా.. ఆయన అప్పుడప్పుడు కార్యాలయానికి వచ్చి వెళుతుంటారని చెప్పినట్టు సమాచారం. కేఏ పాల్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించామని, ఆయన అందుబాటులో లేరని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఆరోగ్యం క్షీణించింది.. మృత్యువుకు చేరువవుతున్నా

» మరణ వాంగ్మూలం పేరిట విశ్రాంత డీఎస్పీ నళిని లేఖ

భువనగిరి టౌన్/హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజకీయవేత్తగా, ఆయుర్వేద ఆరోగ్య సేవికగా, ఆధ్యాత్మికవేత్తగా సాగిన తన జీవితం ముగియబోతోందని, ఆరోగ్యం క్షీణించిందని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత డీఎస్పీ నళిని ఆవేదన వ్యక్తంచేశారు. వీలునామా/మరణ వాంగ్మూలం పేరిట సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన బహిరంగ లేఖ సంచలనంగా మారింది. "ఎనిమిదేళ్ల క్రితం రుమటాయిడ్ ఆర్థరైటిస్(బ్లడ్, బోన్ క్యాన్సర్) సోకగా.. హరిద్వార్‌లోని రాందేవ్ బాబా పంచకర్మ కేంద్రానికి (నిరామయం) వెళ్లి బాగుచేసుకున్నాను. ఇప్పుడు నిరామయంలో చేరేంత డబ్బు లేదు. తెలంగాణ ఉద్యమ పోరాటంలో నిలువెల్లా గాయాలుకాగా, రాజీనామా ద్వారా నాటి ప్రభుత్వం పన్నిన పద్మవ్యూహంలోంచి బయటపడ్డాను. డిపార్ట్‌మెంట్ నా వెన్నులో సస్పెన్షన్ అనే బల్లాన్ని కసి తీరా దింపింది. మహర్షి దయానందుని దయతో యజ్ఞ బ్రహ్మగా వీవైపీఎస్ (వేద యజ్ఞ పరిరక్షణ సమితి)సంస్థాపకురాలుగా ఎదిగా. సీఎం రేవంత్‌రెడ్డి నాకు సహాయం చేస్తానని ప్రకటించారు. ఆ తర్వాత నా వినతిపత్రం చెత్త బుట్ట పాలైందని తెలిసింది. బతికుండగా నన్ను ఏ నాయకుడూ సన్మానించలేదు. నా దయనీయ స్థితి కేంద్రప్రభుత్వం దృష్టికి చేరితే సరైన, ఖరీదైన వైద్యం అందితే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడతానని ఆశాభావంతో ఉన్నా. నా పేరిట ఉన్న ఇంటి స్థలం వీవైపీఎస్‌కు చెందుతుంది" అని నళిని పేర్కొన్నారు.

## రిటైర్డు ఆర్మీ చేతికి సర్కారీ దవాఖానల భద్రత

» 40:60 నిష్పత్తిలో నియామకాలు చేపట్టనున్న సర్కారు

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత మరింత పటిష్ఠం చేయాలని నిర్ణయించిన సర్కారు.. అందుకు రిటైర్డ్ ఆర్మీ జవాన్లను నియమించుకోనున్నది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు జరుగుతాయి. ఇటీవల ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందిపై పెరుగుతున్న దాడులకు చెక్ పెట్టేందుకు సర్కారు ఈ మేరకు సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్నది. రెండు రోజుల క్రితం ప్రభుత్వాస్పత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ విభాగాలపై సమీక్షించిన వైద్యారోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ.. భద్రతా గార్డులుగా రిటైర్డు ఆర్మీ జవాన్లను నియమించాలని నిర్ణయించారు. ప్రస్తుతం 40% రిటైర్డు ఆర్మీ, 60% నాన్ ఆర్మీ భద్రతా గార్డులను నియమించాలని నిర్ణయించినా.. భవిష్యత్తులో పూర్తిస్థాయిలో రిటైర్డు ఆర్మీ జవాన్లతో ఆస్పత్రి భద్రతను పటిష్ఠపరిచే యోచనలో సర్కారు ఉంది. ఈ విషయమై ఏర్పాటైన వైద్యాధికారుల అధ్యయన కమిటీ.. ఇతర రాష్ట్రాల్లో ఆస్పత్రుల భద్రతను పరిశీలించింది. ఇప్పటికే రిటైర్డు ఆర్మీ జవాన్లతో కూడిన ఓయూ భద్రతా వ్యవస్థనూ పరిశీలించిన కమిటీ.. ఆ విధానంపై సంతృప్తికరమైన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

## నాలుగు రోజులు బిజీబిజీగా సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 4 రోజుల పాటు బిజీబిజీగా గడపనున్నారు. సోమవారం ఉదయం కేంద్ర రహదారుల ప్రాజెక్టులు, భూ సేకరణ అంశాలకు సంబంధించి ఢిల్లీ నుంచి వచ్చే అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం పురపాలక శాఖపై సమీక్ష చేస్తారు. కాగా మంగళవారం మేడారం పర్యటనకు వెళ్లనున్నారు. సమ్మక్క-సారలమ్మల ప్రాంగణం అభివృద్ధికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌పై అక్కడే చర్చిస్తారు. 24న పాట్నా వెళ్తారు. అక్కడ జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల్లో పాల్గొంటారు. 25వరకు అక్కడే ఉంటారని సమాచారం.

## వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కుంటాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తే తనను వరకట్నం తేవాలని తరచూ వేధించడంతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన నిర్మల్ జిల్లా కుంటాల పట్టణంలో జరిగింది. మామడ మండలం పొన్నాల్ గ్రామానికి చెందిన షికారి స్రవంతి (18), కుంటాలకు చెందిన పోశెట్టి గతేడాది ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ప్రస్తుతం 3 నెలల పాప ఉంది. వివాహం జరిగినప్పటి నుంచి స్రవంతిని వరకట్నం తీసుకురావాలని పోశెట్టి తరచూ వేధించేవాడు. ఇటీవల ఆ వేధింపులు అధికమవ్వడంతో శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోయిన తర్వాత స్రవంతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం లేచి చూసిన ఆమె భర్త, కుటుంబసభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని భైంసా అడిషనల్ ఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ నైలు పరిశీలించారు. తల్లిని కోల్పోయిన మూడు నెలల చిన్నారిని చూసి స్థానికులు కంటతడి పెట్టారు. స్రవంతి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## అమెరికా చదువా.. ఇప్పుడొద్దులే!

» అగ్రరాజ్యంపై భారతీయ విద్యార్థుల అనాసక్తి

» గతేడాది కంటే 46 శాతం తగ్గిన విచారణలు

» కెనడా విచారణల్లోనూ 75 శాతం తగ్గుదల

» వెల్లడించిన ఐడీపీ ఎడ్యుకేషన్ గణాంకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: ఉన్నత విద్య కోసం అమెరికా, కెనడా వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఐడీపీ ఎడ్యుకేషన్ గణాంకాల ప్రకారం.. గతేడాదితో పోలిస్తే అమెరికాలో చదువుకోవడానికి విద్యార్థుల నుంచి వచ్చే విచారణలు 46 శాతానికి పైగా పడిపోయాయి. అదేవిధంగా గత రెండేళ్లలో కెనడాకు సంబంధించిన విచారణల్లో ఏకంగా 75 శాతం తగ్గుదల నమోదైంది. ట్రంప్ సర్కారు పాటిస్తున్న కఠిన వలస విధానాలు, వీసా ఆమోదంలో జాప్యం వంటి కారణాలు విద్యార్థుల ప్రణాళికలను ప్రభావితం చేస్తున్నాయని ఐడీపీ ఎడ్యుకేషన్ దక్షిణాసియా, కెనడా, లాటిన్ అమెరికా ప్రాంతీయ డైరెక్టర్ పీయూష్ కుమార్ తెలిపారు. కెనడా మాజీ ప్రధాని జస్టిస్ ట్రూడో, భారత ప్రభుత్వం మధ్య నెలకొన్న వివాదంతో విద్యార్థుల్లో ఆసక్తి తగ్గడం మొదలైందన్నారు. పోస్టు-స్టడీ వర్క్ పర్మిట్లను కెనడా ఆరు స్ట్రీమ్‌లకే పరిమితం చేయడంతో ఇతర కోర్సులు ఎంచుకుంటే ఉద్యోగాలు దొరక్క వెనక్కి వెళ్లాల్సి వస్తుందని విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని కుమార్ వివరించారు. కెనడా వెళ్లడానికి ఇది సరైన సమయం కాదని వారు భావిస్తున్నారని చెప్పారు. అయితే 2027 వరకూ ప్రస్తుత చర్యలు అమల్లో ఉంటాయని, ఆ తర్వాత ఈ విధానాన్ని పునఃపరిశీలిస్తామని కెనడా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ తర్వాత పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో బ్రిటన్, ఆస్ట్రేలియా వెళ్తున్న విద్యార్థుల సంఖ్యలో మాత్రం ఎలాంటి మార్పు లేదని కుమార్ పేర్కొన్నారు.

# దంచికొట్టిన వాన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో 11.2 సెం.మీ., మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో 10.8 సెం.మీ, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో 10 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇద్దరు మహిళలు పిడుగుపాట్లకు మృతిచెందారు. సోమవారం కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులు, పలు కాలనీలు జలమయం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. నాచారం, హయత్ నగర్, కాప్రా, మల్లాపూర్, గాంధీనగర్, గౌతమ్ నగర్, మీర్జాల్‌గూడ, వెంకటగిరి ప్రాంతాల్లో రోడ్లపై మోకాలి లోతు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హయత్‌నగర్ డిఫెన్స్ కాలనీలో 8.7 సెంమీ, కాప్రాలో 7, చర్లపల్లిలో 6.1, ఉప్పల్‌లో 5.9, మల్కాజిగిరిలో 5.5 సెం.మీ. వర్షం కురిసింది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. గార్ల వద్ద పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోలెవల్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నడివాడలో గాలివాన బీభత్సం సృష్టించడంతో వంద ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలింది. మరో 50 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. వరి చేలు నీట మునిగాయి. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోదాడ-మిర్యాలగూడ రహదారిపై నీరు నిలిచింది. నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులోని శ్రీశైలం ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఆదివారం 2.76 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా ప్రాజెక్టు పది గేట్లను తెరిచి 2,75,700 క్యూసెక్కులను కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,626 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం ఉదయం 26 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల చేస్తున్నారు.



మహబూబాబాద్ జిల్లా కొత్తపల్లి శివారులో మునిగిన వరి

### 25న అల్పపీడనం

ఈ నెల 25 నాటికి తూర్పు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, 26 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ ఒడిసా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో 27 నాటికి తీరం దాటుతుందని పేర్కొంది. మరోవైపు, సోమవారం రాష్ట్రంలోని నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

### పిడుగుపాట్లకు ఇద్దరు మహిళల మృతి

ఆదిలాబాద్ జిల్లా బోరజ్ మండలం పెండల్‌వాడ గ్రామానికి చెందిన నిర్మల (33), సంతోష్ దంపతులు ఆదివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. నిర్మల సెల్‌ఫోన్ మరిచిపోవడంతో పొలం వద్దకు వెళ్లింది. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో ఆమె సెల్‌ఫోన్ తీసుకుని చెట్టు కింద నిలబడింది. ఆ సమయంలో పిడుగుపడి ఆమె అక్కడికక్కడే మరణించింది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గోలపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురవడంతో వరి చేలో కలుపు తీస్తున్న శంకరమ్మ(30), నాగమ్మ(32) సమీపంలోని చెట్టు కిందికి వెళ్లి నిలబడ్డారు. పిడుగుపడటంతో శంకరమ్మ అక్కడికక్కడే మృతిచెందింది.

## నన్ను కుటుంబానికి దూరం చేసినోళ్ల భరతం పడతా

» సిద్దిపేట, చింతమడక ఎవరి సొత్తు కాదు: కల్వకుంట్ల కవిత



సిద్దిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు క్షేమంగా ఉండాలని కోరుకునే తనని కుటుంబానికి దూరం చేసిన వాళ్ల భరతం పడతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కుటుంబానికి దూరమై దుఃఖంలో ఉన్న తనను తన స్వగ్రామం చింతమడక ఆదరించిందని, ప్రజలు ఆశీర్వదిస్తే తన జన్మభూమే భవిష్యత్తులో తన కర్మభూమి కావొచ్చునని పేర్కొన్నారు. తన స్వగ్రామం, సిద్దిపేట జిల్లా చింతమడకలో ఆదివారం జరిగిన ఎంగిలి పూల బతుకమ్మ వేడుకల్లో కవిత పాల్గొన్నారు. చింతమడక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలతో కలిసి ఎంగిలి పూల బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి కవిత మాట్లాడుతూ.. తన జీవితంలో గత ఏడాది ఒక రకమైన బాధాకర పరిస్థితులుండగా, ఈ ఏడాది కూడా ప్రత్యేక పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 2004లో కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసి ఎంపీగా వెళ్లడంతో ఆయన స్థానంలో స్థానికంగా మరొకరిని పెట్టారన్నారు. నాటి నుంచి నేటి వరకు సిద్దిపేట, చింతమడక ప్రైవేటు ఆస్తుల్లా మారాయని, ఈ ప్రాంతాలకు రావాలంటే కేజీఎఫ్ మాదిరిగా ఆంక్షలు ఉండేవని ఆరోపించారు. కేసీఆర్ అనే చిరుతపులిని కన్న గడ్డ అయిన చింతమడక మీద ఎవరీ ఆంక్షలు చెల్లవని నిరూపించేందుకే తాను ఈ వేడుకలకు హాజరయ్యానని స్పష్టం చేశారు. చింతమడక గడ్డకు ఎంత పౌరుషం ఉందో చూపిస్తానని, ఈ ప్రయాణంలో తనకు అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఏ ఊరు ఎవరి అయ్య జాగీరు కాదని, కానీ తమ జాగీరుగా భావిస్తున్న కొందరి భరతం కచ్చితంగా పడతానని చెప్పారు. ఏదో రాజకీయంగా ఆంక్షలు పెడితే ఆగేదీ లేదని, ఎన్నిసార్లు ఆంక్షలు పెడితే అన్ని సార్లు చింతమడక వస్తానని స్పష్టం చేశారు. చింతమడకలో కేసీఆర్‌ను చంద్రుడని పిలుస్తారని, అలాంటి చంద్రునికి కొంతమంది మచ్చ తెచ్చే పని చేశారన్నారు. తాను ఆ విషయం చెప్పడంతోనే తనని కుటుంబానికి దూరంగా పంపారని, కుటుంబానికి దూరమయ్యాననే దుఃఖంలో ఉన్న తనను చింతమడక ఆదరించిందంటూ కవిత ఉద్వేగంగా మాట్లాడారు.

# స్పోర్ట్స్





## సాత్విక్ జోడీకి రజతమే

### చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్

షెన్‌జన్: భారత టాప్ డబుల్స్ జంట సాత్విక్ సాయి రాజ్-చిరాగ్ షెట్టికి వరుసగా రెండో ఫైనల్లోనూ నిరాశే ఎదురైంది. గతవారం హాంకాంగ్ ఓపెన్ తుది పోరులో ఓడిన సాత్విక్ జోడీ.. ఆదివారం జరిగిన చైనా మాస్టర్స్‌లో వరల్డ్ నెం:1 జోడీ కిమ్ వోన్ హో-సియో సియుంగ్ సా చేతిలో పరాజయం పాలయ్యారు. సాత్విక్-చిరాగ్ ద్వయం 19-21, 15-21తో కొరియాకు చెందిన కిమ్-సియో చేతిలో వరుస గేముల్లో చిత్తయింది. తొలి గేమ్ ఆరంభంలో ఇద్దరూ నువ్వానేనా? అన్నట్టుగా తలపడినా 6-7 వద్ద వరుసగా 8 పాయింట్లు సాధించిన భారత షట్లర్లు 14-7తో భారీ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. కానీ, వరుస తప్పిదాలతో ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం ఇవ్వడంతో గెలవాల్సిన గేమ్ చేజారింది. ఇక, రెండో గేమ్‌లో సాత్విక్ ద్వయం 9-7తో ముందంజలో నిలిచినా.. కొరియా జంట 10-10తో స్కోరు సమం చేసింది. ఈ దశలో తడబడిన సాత్విక్-చిరాగ్ 11-15తో వెనుకబడ్డారు. అయితే, ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా కిమ్ జోడీ మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

## బీసీసీఐ అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్!

- ముగిసిన నామినేషన్ల గడువు
- బరిలో ఢిల్లీ మాజీ క్రికెటర్ ఒక్కడే
- ఏజీఎంలో అధికారిక ప్రకటన



ముంబై: బీసీసీఐ తదుపరి అధ్యక్షుడెవరన్న ఉత్కంఠకు తెరపడింది. ఢిల్లీ జట్టు మాజీ కెప్టెన్ మిథున్ మన్హాస్ ప్రపంచ అత్యధిక ధనిక క్రికెట్ బోర్డు చీఫ్ కానున్నాడు. బీసీసీఐ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలుకు ఆదివారం మధ్యాహ్నంతో గడువు ముగిసింది. అయితే మన్హాస్ ఒక్కడే నామినేషన్ వేయడంతో అతడి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. న్యూఢిల్లీలో శనివారం బీసీసీఐ పెద్దల సమావేశం జరిగింది. ఐసీసీ చీఫ్ జైషా, బీసీసీ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, ఢిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ తదితరులు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సమావేశంలో మిథున్ పేరును ఖరారుచేసినట్టు సమాచారం. ఆ మేరకు అతడు నామినేషన్ దాఖలు చేశాడు.. ఇక.. వచ్చే ఆదివారం ముంబైలో జరిగే బీసీసీఐ వార్షిక సాధారణ సమావేశం సందర్భంగా బోర్డులో మిగిలిన మరికొన్ని కీలక పదవులను కూడా భర్తీ చేస్తారట. భారత మాజీ ఆటగాడు, కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడు రఘురామ్ భట్ బోర్డు చీఫ్ పదవికి చివరి నిమిషం వరకూ పోటీపడ్డాడు. కానీ బోర్డు పెద్దలు నచ్చజెప్పడంతో అతడు రేస్‌నుంచి వైదొలగినట్టు సమాచారం. దాంతో రఘురామ్ భట్ బీసీసీఐ కోశాధికారి పదవికి నామినేషన్ వేశాడు. దేవజీత్ సైకియా కార్యదర్శిగా కొనసాగనున్నాడు.

## భారత కుర్రాళ్ల బోణీ

### ఆసీస్ అండర్-19పై విజయం

బ్రిస్బేన్: భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియా పర్యటనను విజయంతో ఆరంభించింది. ఆదివారం ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా ఆసీస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 225 పరుగులు చేసింది. జేమ్స్ (77), టామ్ హోగన్ (41), స్టీవెన్ హోగన్ (39) రాణించారు. హెనిల్‌కు మూడు.. కనిష్క్, కిషన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత కుర్రాళ్లు 30.3 ఓవర్లలో 227/3 స్కోరుతో గెలిచారు. అభిగ్యాన్ కుందు (87 నాటౌట్), వేదాంత్ (61 నాటౌట్), వైభవ్ సూర్యవంశీ (38) ఆకట్టుకున్నారు.

## ఆనంద్‌కు రెండు స్వర్ణాలు

### తొలి స్కేటర్‌గా రికార్డు

న్యూఢిల్లీ: ప్రపంచ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆనంద్‌కుమార్ వేల్‌కుమార్ (22) చరిత్ర సృష్టించాడు. ఆదివారం జరిగిన 42 కి.మీ. మారథాన్‌లో విజేతగా నిలిచిన ఆనంద్ ఈ టోర్నీలో రెండు స్వర్ణాలు నెగ్గిన తొలి భారత అథ్లెట్ అయ్యాడు. అంతకుముందే 1000మీ. స్ప్రింట్‌లోనూ స్వర్ణం గెలిచిన ఈ తమిళనాడు స్కేటర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పోడియం సాధించిన మొదటి ప్లేయర్ అయ్యాడు. అంతేగాక 500మీ. స్ప్రింట్‌లోనూ కాంస్యం అందుకున్న ఆనంద్.. ఒకే వరల్డ్ స్పీడ్ స్కేటింగ్ ఈవెంట్‌లో 3 పతకాలు సాధించిన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు.

## ప్రాంజల జోడీకి డబుల్స్ టైటిల్



న్యూఢిల్లీ: ఐటీఎఫ్ మహిళల ప్రపంచ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో యడ్లపల్లి ప్రాంజల జోడీ విజేతగా నిలిచింది. గుర్‌గావ్‌లో ఆదివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో ప్రాంజల-శ్రావ్య శివాని జోడీ 6-4, 6-0తో మహికా ఖన్నా-సోహిని మొహంతిపై వరుస సెట్లలో గెలిచింది. తొలి సెట్‌లో ప్రత్యర్థి నుంచి కొంత ప్రతిఘటన ఎదురైనా.. రెండో సెట్‌లో మాత్రం ప్రాంజల జంట పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.

# ఈసారి దంచేశారు

## భారత్ చేతిలో పాక్ చిత్తు

## అభిషేక్ మెరుపు ఇన్నింగ్స్




అభిషేక్ శర్మ (39 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 74)

దుబాయ్: ఆసియాకప్ గ్రూప్ మ్యాచ్‌లోనే కాదు.. సూపర్-4 లోనూ భారత జట్టు పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో దాయాది కాస్త పోటీనివ్వగలిగింది. ఫీల్డింగ్‌లో రెండు క్యాచ్‌లు వదిలేసిన ఓపెనర్ అభిషేక్ శర్మ (39 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 74) బ్యాటింగ్‌లో మాత్రం ప్రత్యర్థి బౌలర్లను కసిదీరా బాదాడు. అతడికి ఓపెనర్ గిల్ (28 బంతుల్లో 8 ఫోర్లతో 47) సహకరించడంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (58) అర్ధ సెంచరీ సాధించాడు. దూబేకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. తిలక్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 నాటౌట్) అజేయంగా నిలిచాడు. హరీస్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు. **కాగా, ఆసియా కప్‌నకు నేడు (సోమవారం) విరామం.**

**ఓపెనర్ల శతక భాగస్వామ్యం:** ఛేదనను భారత్ అదిరే రీతిలో ఆరంభించింది. ఓపెనర్లు అభిషేక్, గిల్ పాక్ బౌలర్లపై విరుచుకుపడడంతో స్కోరుబోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. షహీన్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతినే అభిషేక్ సిక్సర్‌గా మలిచాడు. స్పిన్నర్ అబ్రార్ ఓవర్‌లోనూ 4,6తో జోరు చూపాడు. మరోవైపు సయీమ్, షహీన్ ఓవర్లలో గిల్ రెండేసి ఫోర్లతో సహకరించాడు. వీరి ధాటికి పవర్‌ప్లేలో 69 పరుగులతో జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది. అలాగే పేసర్లు షహీన్, రౌఫ్ వీరితో మాటల యుద్ధానికి దిగడం కనిపించింది. ఏడో ఓవర్‌లో అభిషేక్ క్యాచ్‌ను ఫర్హాన్ వదిలేయగా, ఓ ఫోర్‌తో 24 బంతుల్లోనే అతను హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే చక్కటి లెంగ్త్ బాల్‌తో గిల్‌ను పేసర్ అష్రాఫ్ బౌల్డ్ చేయడంతో తొలి వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో మూడు ఓవర్లలో సూర్య (0), జోరు మీదున్న అభిషేక్ కూడా అవుటవడంతో స్కోరు నెమ్మదించింది. ఈ దశలో తిలక్, శాంసన్ (13) రిస్కీ షాట్లకు వెళ్లకుండా సంయమనం కనబర్చారు. ఇక 12 బంతుల్లో 9 రన్స్ కావాల్సిన వేళ తిలక్ 19వ ఓవర్‌లో 6,4తో మ్యాచ్‌ను ముగించాడు.

**దూకుడుగా ఆరంభించినా..:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఈసారి ఆత్మవిశ్వాసంతో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలించడంతో తొలి పది ఓవర్లలోనే 91 పరుగులు సాధించింది. అయితే భారత బౌలర్లు మధ్యఓవర్లలో కట్టడి చేయగలిగారు. ఓపెనర్ ఫర్హాన్ పేస్, స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగా.. అతడికి ఆరంభంలో సయీమ్ అయూబ్ (21) తోడ్పాటునందించాడు. దీనికి తోడు భారత ఫీల్డింగ్ వైఫల్యం కూడా వీరికి కలిసి వచ్చింది. తొలి ఓవర్‌లోనే ఫర్హాన్ క్యాచ్‌ను అభిషేక్.. ఐదో ఓవర్‌లో సయీమ్ క్యాచ్‌ను కుల్దీప్ వదిలేయడం దెబ్బతీసింది. అటు ఓపెనర్ ఫఖర్ జమాన్ (15)ను మూడో ఓవర్‌లోనే హార్దిక్ అవుట్ చేసినా.. ఫర్హాన్ ఎదురుదాడిని ఆపలేదు. ముఖ్యంగా స్టార్ పేసర్ బుమ్రాను సునాయాసంగా ఆడేయడంతో పవర్‌ప్లేలో జట్టు 55/1తో నిలిచింది. ఇందులో బుమ్రానే 34 పరుగులివ్వడం గమనార్హం. ఎనిమిదో ఓవర్‌లో ఫర్హాన్ క్యాచ్‌ను బౌండరీ లైన్ దగ్గర అభిషేక్ మరోసారి వదిలేయగా అది సిక్స్‌గా మారింది. ఫర్హాన్ 34 బంతుల్లో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. చివరకు 11వ ఓవర్‌లో సయీమ్ క్యాచ్‌ను అభిషేక్ అందుకోవడంతో రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో దూబే, వరుణ్, కుల్దీప్ పాక్‌ను నియంత్రించడంతో 11-16 ఓవర్ల మధ్య ఒక్క బౌండరీ కూడా నమోదు కాలేదు. అలాగే హుస్సేన్ తలత్ (10)తో పాటు నిలకడగా ఆడుతున్న ఫర్హాన్ వికెట్‌ను కూడా కోల్పోయింది. కానీ చివరి మూడు ఓవర్లలో పాక్ 43 పరుగులతో 170 స్కోరును దాటించగలిగింది.

**1**

అంతర్జాతీయ టీ20ల్లో తక్కువ బంతుల్లో (331) 50 సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా అభిషేక్. అలాగే ఇన్నింగ్స్‌ను రెండుసార్లు సిక్సర్లతో ఆరంభించిన తొలి భారత ఓపెనర్‌గా అభిషేక్. రోహిత్, శాంసన్, జైస్వాల్ ఒక్కసారి ఈ ఫీట్ సాధించారు.

భారత్-పాక్ జట్ల మధ్య జరిగిన టీ20ల్లో ఎక్కువ వికెట్లు (15) తీసిన బౌలర్‌గా హార్దిక్

భారత్‌పై పవర్‌ప్లేలో తమ అత్యధిక పరుగులు (55) నమోదు చేసిన పాక్

### స్కోరుబోర్డు

**పాకిస్థాన్:** ఫర్హాన్ (సి) సూర్య (బి) దూబే 58, ఫఖర్ జమాన్ (సి) సంజూ (బి) హార్దిక్ 15, సయీమ్ (సి) అభిషేక్ (బి) దూబే 21, తలత్ (సి) వరుణ్ (బి) కుల్దీప్ 10, నవాజ్ (రనౌట్) 21, సల్మాన్ ఆఘా (నాటౌట) 17, ఫహీమ్ (నాటౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 171/5; వికెట్ల పతనం:** 1-21, 2-93, 3-110, 4-115, 5-149; **బౌలింగ్:** హార్దిక్ 3-0-29-1, బుమ్రా 4-0-45-0, వరుణ్ 4-0-25-0, కుల్దీప్ 4-0-31-1, అక్షర్ 1-0-8-0, దూబే 4-0-33-2.

**భారత్:** అభిషేక్ (సి) రౌఫ్ (బి) అబ్రార్ 74, గిల్ (బి) ఫహీమ్ 47, సూర్యకుమార్ (సి) అబ్రార్ (బి) రౌఫ్ 0, తిలక్ (నాటౌట్) 30, సంజూ శాంసన్ (బి) రౌఫ్ 13, హార్దిక్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 18.5 ఓవర్లలో 174/4; వికెట్ల పతనం:** 1-105, 2-106, 3-123, 4-148; **బౌలింగ్:** షహీన్ షా అఫ్రీది 3.5-0-40-0, సయీమ్ 3-0-35-0, అబ్రార్ 4-0-42-1, హరీస్ రౌఫ్ 4-0-26-2, ఫహీమ్ 4-0-31-1.




### సోషల్‌మీడియాలో విమర్శల వెల్లువ

హాఫ్ సెంచరీ చేసిన ఆనందంలో పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్ ప్రవర్తించిన తీరు నెట్టింట తీవ్ర విమర్శల పాలైంది. స్పిన్నర్ అక్షర్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి అర్ధ శతకం పూరించిన ఫర్హాన్.. గన్ ఫైరింగ్ చేస్తున్నట్టుగా సంబరాలు చేసుకున్నాడు. అయితే కొద్ది నెలల కిందట పాకిస్థాన్ టెర్రరిస్టులు పహల్గామ్‌లో దాడి చేసి 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్న నేపథ్యంలో.. ఫర్హాన్ అలా తుపాకీ పేలుస్తున్నట్టు చేసిన సెలెబ్రేషన్‌పై నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తంజేస్తున్నారు. తమ సోదరులు పహల్గామ్‌లో అలానే అమాయక ప్రజలను హతమార్చినట్టు ఫర్హాన్ చూపాడని నెటిజన్లు దుయ్యబడుతున్నారు.

## గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం స్వల్ప ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి పెరుగుతుండటమే ఇందుకు కారణం. అయితే జీఎస్‌టీ సంస్కరణల నేపథ్యంలో సానుకూల సెంటిమెంట్ నెలకొని సంబంధిత రంగాల షేర్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మైనింగ్, ఆటోమొబైల్, నాన్ ఫెర్రస్ మెటల్స్, ఎలక్ట్రికల్స్, ఐరన్ అండ్ స్టీల్ రంగాలు బలంగా ఉన్నాయి.

### స్టాక్ రికమండేషన్స్


**భారతి ఎయిర్‌టెల్:** జీవితకాల గరిష్ఠాన్ని చేరిన తర్వాత ఈ కౌంటర్‌లో స్వల్ప దిద్దుబాటు జరిగింది. ప్రస్తుతం మూమెంటమ్ గణనీయంగా పెరిగింది. పైగా షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.1,962 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,950 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,025/2,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,930 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

**యూనియన్ బ్యాంక్:** గరిష్ఠ స్థాయిని చేరుకున్న తర్వాత ఈ కౌంటర్‌లో దిద్దుబాటు జరిగింది. ప్రస్తుతం మూమెంటమ్, వాల్యూమ్, రిలేటివ్ స్ట్రెంత్ గణనీయంగా పెరిగాయి. పైగా పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగం జోరందుకుంటోంది. గత శుక్రవారం రూ.140 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.130 శ్రేణిలో ప్రవేశించి రూ.155 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.131 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**గోద్రెజ్ ప్రాపర్టీస్:** జీఎస్‌టీ సంస్కరణల నేపథ్యంలో రియల్టీపై ఫోకస్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ షేరుపై మదుపరులు ఆసక్తి చూపిస్తున్నారు. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ పెరుగుతుండటం గమనార్హం. గత శుక్రవారం రూ.2,145 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,080 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,145 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.2,050 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**బీపీసీఎల్:** ఈ ఏడాది జూలైలో రూ.355 వద్ద గరిష్ఠ స్థాయిని తాకిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. అన్ని రకాల కాల వ్యవధుల్లో మూమెంటమ్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.329 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.320 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.380 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.300 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**అర్బన్ కంపెనీ లిమిటెడ్:** గత వారమే లిస్టయిన ఈ కౌంటర్ ఆకర్షణీయంగా ఉంది. గత శుక్రవారం రూ.184 వద్ద ముగిసిన ఈ షేరును దీర్ఘకాలానికి రూ.160-180 శ్రేణిలో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

### హెటెరో నుంచి క్యాన్సర్ ఔషధం

PERZEA

హైదరాబాద్: హెటెరో హెల్త్‌కేర్ లిమిటెడ్ మరో సరికొత్త ఔషధాన్ని మార్కెట్లోకి విడుదల చేసింది. 'పెర్జియా' పేరుతో విడుదల చేసిన ఈ ఔషధం రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ఉపయోగపడుతుందని తెలిపింది. అల్కెమ్ లేబొరేటరీస్ అనుబంధ బయోటెక్నాలజీ సంస్థ ఎంజీన్ బయోసైన్సెస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసినట్టు హెటెరో వెల్లడించింది. అంకాలజీ థెరపీల్లో నాణ్యమైన ఔషధాలను అందుబాటు ధరల్లో తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ ఔషధాన్ని తీసుకువచ్చినట్టు హెటెరో తెలిపింది.

## అండమాన్ సముద్రంలో చమురు నిక్షేపాలు!

### అన్వేషణ కోసం రూ.3,200 కోట్ల కేటాయింపు

మరో మూడు ప్రాంతాల్లో కూడా ● ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు అనుమతి




న్యూఢిల్లీ: చమురు దిగుమతుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం దేశంలోనే చమురు, గ్యాస్ ఉత్పత్తి పెంచేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్).. తొలి దశలో అండమాన్, నికోబార్ ద్వీపాల్లోని లోతట్టు సముద్ర జలాలు సహా మహానది, సౌరాష్ట్ర, బెంగాల్ బేసిన్స్‌లో చమురు, సహజ వాయువు నిక్షేపాల కోసం వచ్చే ఏడాది కొన్ని కొత్త బావులు తవ్వబోతున్నాయి. కాగా అండమాన్‌కు దగ్గరలో ఉన్న మయన్మార్, ఇండోనేషియా సముద్ర జలాల్లో ఇప్పటికే పెద్దమొత్తంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడ్డాయి. అండమాన్ సముద్ర జలాల్లోని భూప్రాంతం కూడా మయన్మార్, ఇండోనేషియా సముద్ర భూతలాన్ని పోలి ఉంటుంది. దీంతో మన ప్రాంతంలోనూ భారీగా చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతాల్లో చమురు అన్వేషణ కోసం రూ.3,200 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**అండమాన్‌లో 37.1 కోట్ల టన్నుల నిక్షేపాలు:** అండమాన్ ప్రాంతంలో భారత ఇంధన ముఖ చిత్రాన్నే మార్చివేసే భారీ చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇటీవల ప్రకటించారు. ఈ నిక్షేపాలు 31.7 కోట్ల టన్నుల వరకు ఉంటాయని ఇప్పటికే అంచనాలు వినిపిస్తున్నాయి. ఇది గత ఏడాది మన దేశం దిగుమతి చేసుకున్న 24.24 కోట్ల టన్నుల కంటే ఇది 7.46 కోట్ల టన్నులు ఎక్కువ. చమురు, గ్యాస్ అన్వేషణకు వీలుగా 2022లో కేంద్ర ప్రభుత్వం అండమాన్ సముద్ర ప్రాంతంలోని దాదాపు 10 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని స్వేచ్ఛా మండలంగా ప్రకటించింది.

**బీపీ భాగస్వామ్యం:** అండమాన్ సముద్ర జలాల్లో ఎక్కడ బావులు తవ్వాలి? వాటి ఫలితాల అన్వేషణలో బ్రిటిష్ పెట్రోలియం (బీపీ).. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు సహకరిస్తుంది. ఈ పరీక్షా ఫలితాల ఆధారంగా ఈ ప్రాంతంలో చమురు, గ్యాస్ ఉత్పత్తి హక్కులు ఏ కంపెనీకి ఇవ్వాలనే విషయాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. పరీక్షా ఫలితాలు ఆశాజనకంగా ఉంటే, అందులో బీపీ కంపెనీ కూడా వాటాదారుగా చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే పర్యావరణ అనుమతులు, భారీ ఖర్చులు ఇందుకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### ఎయిర్‌సెల్ కేసులో మ్యాక్సిస్‌కు మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ: ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ లంచాల కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం మరోసారి మలేషియా కేంద్రంగా పనిచేసే టెలికాం దిగ్గజం మ్యాక్సిస్‌కు నోటీసులు జారీ చేసింది. మ్యాక్సిస్‌తో పాటు దాని డైరెక్టర్ ఆగస్టస్ రాల్ఫ్ మార్షల్, మ్యాక్సిస్ కంపెనీ అనుబంధ సంస్థ ఆస్ట్రో ఆల్ ఏషియా నెట్‌వర్క్‌కు కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను వీరికి అందజేసేందుకు మూడు నెలల సమయం కావాలని సీబీఐ కోరింది. యూపీఏ హయాంలో ఎయిర్‌సెల్ ఈక్విటీలో తన వాటాను 26 శాతం నుంచి 73.99 శాతానికి పెంచుకునేందుకు అప్పటి ఆర్థిక మంత్రి పీ చిదంబరం, ఆయన కుమారుడు కార్తి చిదంబరానికి మ్యాక్సిస్ పెద్దఎత్తున లంచాలు ముట్టచెప్పిందని ఆరోపణ. ఈ ఆరోపణలపై 2006లోనే సీబీఐ వీరిపై చార్జిషీట్ ఫైల్ చేసింది. దాని ఆధారంగా కోర్టు 2015లోనే నోటీసులు జారీ చేసినా వారు వాటిని స్వీకరించలేదు. దాంతో సీబీఐ అభ్యర్థనపై కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది.

### ప్రైవేట్ పెట్టుబడులు పెరగాలి

ముంబై: ప్రైవేట్ కంపెనీల చేతిలో చాలా మూలధనం ఉన్నదని, దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు అవి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) ఛైర్మన్ మహేంద్ర దేవ్ పిలుపు ఇచ్చారు. ఆదివారం ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడులు, ఎగుమతులే దేశ ఆర్థిక వృద్ధికి చోదకమన్నారు.

# బిజినెస్

### కోల్ ఇండియా సారథిగా సాయిరామ్

తెలుగోడికి అత్యున్నత పదవి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా టీ. సాయిరామ్ ఎంపికయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థల అధిపతుల ఎంపిక బోర్డు (పీఈఎస్‌బీ) ఈ పదవికి ఆయన పేరును సిఫారసు చేసింది. మరో 10 మంది నుంచి గట్టి పోటీ ఎదుర్కొని మౌఖిక పరీక్షలో అందరి కన్నా ముందు వరుసలో సాయిరామ్ నిలిచారు. ప్రస్తుతం సీఐఎల్‌కు సారథ్యం వహిస్తున్న పీఎం ప్రసాద్ అక్టోబరు 31వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. లాంఛనాలు పూర్తయిన తర్వాత ఆయన స్థానంలో సాయిరామ్ బాధ్యతలు చేపట్టనున్నారు. విశాఖపట్నానికి చెందిన సాయిరామ్ తన 34 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్‌లో టెక్నికల్ డైరెక్టర్ సహా ఎన్నో కీలక పదవులు నిర్వహించారు. ప్రస్తుతం నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ సీఎండీగా పని చేస్తున్నారు. ఆయనకు బొగ్గు రంగంలో అపారమైన అనుభవం ఉంది.

## కీలక మద్దతు స్థాయి 25,000

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ ప్రారంభమై గరిష్ఠ స్థాయి 25,450 వరకు వెళ్లినా శుక్రవారం రియాక్షన్ సాధించింది. చివరికి 24,327 వద్ద ముగిసింది. మూడు వారాల ర్యాలీలో 1,000 పాయింట్ల మేరకు లాభపడిన అనంతరం అప్రమత్త ట్రెండ్ కనబరిచింది. అయితే మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు మాత్రం మంచి లాభాలతో ముగిశాయి. గత వారం నిఫ్టీ 25,000 వద్ద బ్రేకౌట్ సాధించినందు వల్ల టెక్నికల్ పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో పడింది. శుక్రవారం నాడు నిఫ్టీ గత మూడు వారాల్లో గరిష్ఠ రియాక్షన్ సాధించినందు వల్ల ప్రస్తుతం మరింత రియాక్షన్ ఏర్పడవచ్చు. ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన మద్దతు స్థాయి 25,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి.

**బుల్లిష్ స్థాయిలు:** ఈ వారంలో కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ట్రెండ్ ఏర్పడవచ్చు. అప్‌ట్రెండ్‌ను మరింతగా కొనసాగించాలంటే ప్రధాన నిరోధం 25,500 కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. మరో ప్రధాన నిరోధం 26,000.

**బేరిష్ స్థాయిలు:** నిఫ్టీకి 25,200 వద్ద మైనర్ మద్దతు, 25,000 వద్ద ప్రధాన మద్దతు స్థాయిలున్నాయి. 25,000 వద్ద నిలదొక్కుకుంటే సానుకూల సంకేతం ఇస్తుంది. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ గత వారం 650 పాయింట్ల మేరకు లాభపడి 55,800 వద్ద క్లోజయినా శుక్రవారం నాటి 270 పాయింట్ల బలమైన రియాక్షన్ కారణంగా మార్కెట్ అప్రమత్త ట్రెండ్‌లో పడింది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను మరింతగా కొనసాగించాలంటే నిరోధ స్థాయి 56,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనపడినా భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 55,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే మరింత బలహీనత తప్పదు.

**పాటర్న్:** ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితి కనిపిస్తోంది. స్వల్పకాల బలహీనతకు ఆస్కారం ఉంది. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్ లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

| సోమ వారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 25,410, 25,500 |
| మద్దతు | 25,200, 25,120 |

### 25,000 దిగువన బేరిష్

(సెప్టెంబరు 22-26 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,327-25,038 పాయింట్ల మధ్యన కదలాడి 213 పాయింట్ల లాభంతో 25,327 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,000 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,008, 24,902, 24,722, 24,366 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,650 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,000
నిరోధ స్థాయిలు: 25,550, 25,650, 25,750 (25,450 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,125, 24,025, 23,925 (24,225 దిగువన బేరిష్)

ఆస్ట్రో గైడ్

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 22వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 540 | విజయవాడ | 560 |
| వరంగల్ | 542 | గోదావరి | 550 |
| చిత్తూరు | 578 | విశాఖపట్నం | 540 |
| | | దజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 115 | విజయవాడ | 130 |
| వరంగల్ | 115 | గుంటూరు | 132 |
| కరీంనగర్ | 115 | ఒంగోలు | 132 |
| మహబూబ్‌నగర్ | 115 | చిత్తూరు | 120 |
| కర్నూలు | 115 | నెల్లూరు | 125 |
| విశాఖపట్నం | 134 | అనంతపురం | 125 |
| గోదావరి | 130 | | |

## రేపటి నుంచి గ్రూప్-2 ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష న్యాయ వివాదాలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రూప్-2 నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్ణయించింది. గ్రూప్-1 నియామకాలు పూర్తయిన తర్వాతే గ్రూప్-2, 3 నియామకాలు భర్తీ చేయాలని కమిషన్ భావించింది. అయితే, ఇప్పుడు గ్రూప్-1 ఎంపిక జాప్యం కారణంగా ఇతర నియామకాలు ఆలస్యం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. తుది జాబితాకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 23, 24 తేదీలలో ఉంటుందని టీజీపీఎస్సీ కార్యదర్శి ప్రియాంక ఆలా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో ఉదయం 10:30నుంచి సాయంత్రం 5 వరకు పరిశీలన కొనసాగనుంది. పూర్తి వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. మొత్తం 783 గ్రూప్-2 ఉద్యోగాలు భర్తీ చేయడానికి ఈ ప్రక్రియ జరుగుతోంది. గత డిసెంబరు 15, 16 తేదీల్లో జరిగిన పరీక్షకు 5.51 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. మార్చి 11న ఫలితాలు వెలువడ్డాయి.

## వన దేవతల కీర్తిని చాటిచెప్పడమే లక్ష్యం

» 2 వేల మంది కార్మికులతో అభివృద్ధి పనులు: సీతక్క

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమ్మక్క-సారలమ్మ తల్లుల కీర్తిని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో మేడారంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆమె ఆదివారం పర్యటించారు. సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం మేడారంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. దేవస్థానం ప్రాంగణ పరిసరాలను పరిశీలించి అభివృద్ధి పనులపై కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో చర్చించారు. సెక్టార్ల వారీగా అభివృద్ధి పనుల బాధ్యతలను అధికారులకు అప్పగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన దేవస్థానం ప్రపంచ ప్రఖ్యాతి పొందాలన్న సంకల్పంతో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. 2వేల మంది కార్మికులతో పనులు ప్రారంభిస్తున్నామని, వాటిని త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## టీజీవో మహిళా శాఖ చైర్‌పర్సన్‌గా దీపారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం మహిళా శాఖకు ఎన్నికలు నిర్వహించగా ఒకే సెట్ నామినేషన్ దాఖలు కావడంతో ఆ సంస్థ అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు ఎన్నికను ఏకగ్రీవంగా ప్రకటించారు. చైర్మన్‌గా జి.దీపారెడ్డి, కన్వీనర్‌గా జక్కంపూడి సుజాత, కోశాధికారిగా శాంతిశ్రీ ఎన్నికయ్యారని వెల్లడించారు. వారికి ఆయన నియామక పత్రాలు అందించి ప్రమాణం చేయించారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తదుపరి జరిగిన కార్యవర్గ సమావేశంలో మహిళా శాఖ చైర్మన్ జి.దీపారెడ్డి అధ్యక్షతన పలు తీర్మానాలను కార్యవర్గం ఆమోదించింది.

## ఆర్‌ఆర్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్‌తో నష్టం

» కోదండరాం దృష్టికి తీసుకెళ్లిన రైతులు

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) కొత్త అలైన్‌మెంట్ వల్ల చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని చౌటుప్పల్, నారాయణపురం, గట్టుప్పల్, మర్రిగూడ మండలాల భూ నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వారు టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ అన్యాయాన్ని అరికట్టాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. రైతుల విజ్ఞప్తికి స్పందించిన కోదండరాం.. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## ఎలాంటి సర్వేలూ నిర్వహించలేదు: టీపీసీసీ

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఎలాంటి సర్వేలూ నిర్వహించలేదని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ సహా పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సర్వేలు నిర్వహించిందని, పార్టీ పరిస్థితి బాగోలేదని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సైదులు అనే వ్యక్తి కాంగ్రెస్ తరఫున సర్వేలు చేస్తున్నట్లు మీడియాలో ప్రచారం జరుగుతుందని, కానీ అతడికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

## 'హెచ్1బీ'పై పార్లమెంటులో చర్చించాలి: మల్లు రవి

హైదరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అమెరికా హెచ్1బీ వీసా రుసుమును విపరీతంగా పెంచడాన్ని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి వ్యతిరేకించారు. దీనిపై తగిన విధంగా స్పందించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రధానిని ఓ ప్రకటనలో కోరారు. ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా అమెరికా వెళ్లాలనుకుంటున్న భారతీయ యువతపై తీవ్ర ప్రభావం చూపుతుందని మల్లు రవి అభిప్రాయపడ్డారు.

## దౌత్యవైఫల్యం వల్లే అమెరికాలో ఇబ్బందులు: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ దౌత్యవైఫల్యం కారణంగానే అమెరికాలో ఉండే భారతీయులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. హెచ్-1బీ వీసా ఫీజుల పెంపు, కార్మిక-ఇంటెన్సివ్ రంగాలలో ఇటీవల 25% సుంకాల పెరుగుదల వంటివి కేంద్రం వైఫల్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. కాగా, బతుకమ్మ పండుగ సందర్భంగా.. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారకాన్ని నిర్మించాలి

» బాపూజీ సామాజిక తెలంగాణ వారోత్సవాల్లో వక్తలు

ఖైరతాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జాతిపితగా కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రకటించి ఆయన పేరిట స్మారకాన్ని నిర్మించాలని పలువురు మేధావులు, ఉద్యమకారులు, బీసీ సంఘాల నేతలు కోరారు. బాపూజీ వర్ధంతి రోజైన ఆదివారం నుంచి జయంతి రోజైన ఈ నెల 27 వరకు కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక తెలంగాణ వారోత్సవాలను కొండా లక్ష్మణ్ బాపూజీ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీలు రమణ, అద్దంకి దయాకర్, టీఎండీసీ చైర్మన్ అనిల్, మాజీ ఎంపీలు మధుయాష్కీగౌడ్, రాపోలు ఆనంద భాస్కర్ తదితరులు నివాళులర్పించారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా త్యాగం చేసిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన స్ఫూర్తితోనే బీసీల్లో చలనం మొదలైందని మహేష్ గౌడ్ పేర్కొన్నారు.

## సచివాలయంలో ఆ ఉద్యోగి స్పెషల్!

» 12 ఏళ్లుగా ఒకేచోట.. పదోన్నతి తర్వాత మళ్లీ అక్కడికే

» 35 మందికి ఒక జీవో.. ఆయనొక్కరికే మరో జీవో

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ఓ ఉద్యోగికి పదోన్నతి లభించినప్పటికీ, ఆయనకు మళ్లీ అదే విభాగంలో పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. సాధారణ పరిపాలన శాఖలో పనిచేస్తున్న ఆ ఉద్యోగికి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌వో) నుంచి సెక్షన్ ఆఫీసర్ (ఎస్‌వో)గా పదోన్నతి లభించింది. అయితే, 12 ఏళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తున్న ఆయనను బదిలీ చేయకుండా మళ్లీ అదే విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం.. ఒక ఉద్యోగి ఒకే శాఖలో 6 ఏళ్లకు మించి పనిచేసినట్లయితే, వారిని వేరే శాఖకు బదిలీ చేయాలి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిబంధనను 4 ఏళ్లకు తగ్గించింది. దీంతో చాలా మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఆగస్టులో 36 మంది ఉద్యోగులకు పదోన్నతులు వచ్చాయి. వారిలో 35 మంది బదిలీలకు సంబంధించి ఒకే జీవో జారీ చేయగా, సదరు ఉద్యోగికి మాత్రం ప్రత్యేకంగా వేరే జీవో జారీ చేశారు. ప్రస్తుతం ఆయన పనిచేస్తున్న శాఖలోనే ఖాళీలు ఉన్నాయని అధికారులు కారణం చూపినప్పటికీ, ఈ చర్య నిబంధనలకు విరుద్ధమని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ విషయంలో ఒక ఉన్నతాధికారి జోక్యం చేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

## ప్రత్యేక జీవోతోనే..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకే సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాలకు చేరుకోవాలంటూ ఆదివారం సాయంత్రమే సంబంధిత అధికారులకు సందేశాలను పంపించారు. కాగా రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన సమాచారం మొత్తాన్నీ ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లకు అందించింది. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం.. బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 2024లో నిర్వహించిన కులగణన వివరాల ప్రకారం ఖరారు చేయాలని కలెక్టర్లకు సూచించింది. ఆ వివరాలన్నింటినీ కలెక్టర్లు సోమవారం నిర్వహించే సమావేశంలో క్షేత్ర స్థాయి అధికారులకు అందించి రిజర్వేషన్లను ఖరారు చేయాలని సూచించనున్నారు. కాగా స్థానిక ఎన్నికల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి 1-2 రోజుల్లో కీలక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు తెలిసింది. ఆ సమావేశంలో ఎన్నికల నిర్వహణ విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారికవర్గాల సమాచారం.

### మారనున్న గ్రామాల రిజర్వేషన్లు..

రాష్ట్రంలో ఇటీవల ప్రభుత్వం కొన్ని గ్రామాలను మునిసిపాలిటీల్లో విలీనం చేసింది. దాంతో గత ఎన్నికల సమయంలో ఉన్న మొత్తం గ్రామాల సంఖ్యలో కొంత తగ్గింది. తాజాగా ఖరారు చేసిన వివరాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 12,760 గ్రామపంచాయతీలు, 565 మండలాలు, 31 జిల్లాలు ఉన్నాయి. 1,12,534 మంది వార్డు సభ్యులు ఉండగా.. 5,763 ఎంపీటీసీలు, 565 మండల ప్రజా పరిషత్‌లు, 31 జిల్లా ప్రజాపరిషత్‌లు ఉన్నాయి. వీటి ప్రకారం రిజర్వేషన్‌లను ఖరారు చేయనున్నారు. ఈసారి జరగబోయే స్థానిక ఎన్నికల్లో గ్రామాలవారీ రిజర్వేషన్లు మారనున్నాయి. ఉదాహరణకు.. గత ఎన్నికల సమయంలో ఒక గ్రామంలో అక్కడి జనాభా ప్రకారం బీసీ/ఎస్సీ/ఎస్టీ/జనరల్‌కు కేటాయించి ఉంటే అందులో మార్పులుంటాయి. అంటే గతంలో ఉన్న సామాజికవర్గానికి ఈసారి ఆ గ్రామాన్ని రిజర్వ్ చేయరన్న మాట. వేరే సామాజికవర్గానికి అవకాశం కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటాయింపులు పూర్తయిన తర్వాత మిగిలిన స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా ఉంచుతారు.

### ఇదీ లెక్క

సర్పంచ్, వార్డు మెంబర్, ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో 50% స్థానాలు మహిళలకు లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. 100% ఎస్సీ, ఎస్టీ గ్రామాలున్న చోట వారికే రిజర్వేషన్ ఇవ్వనున్నారు. అందులోనూ మహిళలకు 50%మేర కేటాయిస్తారు. 2018లో తీసుకొచ్చిన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు మార్చనున్నారు. ఉదాహరణకు.. ఒక జిల్లాలో 14 జడ్పీటీసీ స్థానాలు ఉంటే, వాటిలో ఎస్టీలకు 2, ఎస్సీలకు 2, బీసీలకు 3 కేటాయిస్తారు. మిగిలిన 7 స్థానాలను రిజర్వ్ చేయకుండా ఉంచుతారు. ఆ తరువాత వాటిలో సగం స్థానాలు (50 శాతం) మహిళలకు రిజర్వ్ చేస్తారు.

# 'అసైన్డ్' లెక్కలు పక్కాగా!

## ఎంజాయ్‌మెంట్ సర్వేకు సన్నాహాలు.. సర్వే అనంతరం జీఐఎస్ మ్యాపింగ్

» డిసెంబర్ 8లోగా ప్రక్రియ పూర్తి చేయాలని సర్కారు ఆదేశం

» రంగారెడ్డి జిల్లాలో 15 వేల ఎకరాల.. అసైన్డ్ భూములను చెరబట్టిన పెద్దలు

» తాజా నిర్ణయంతో వారి గుండెల్లో రైళ్లు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

భూమిలేని నిరుపేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం భూములను పంపిణీ చేస్తే.. కొందరు పెద్దలు వాటిని పేదల నుంచి కాజేసి చెరబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్నేళ్లుగా లక్షలాది మంది పేదలకు ప్రభుత్వం లక్షల ఎకరాలను దశలవారీగా పంపిణీ చేయగా.. ఇందులో చాలావరకు అన్యాక్రాంతమయ్యాయి. నోటరీలతోనే కొందరు పెద్దలు ఈ భూములను కొల్లగొట్టారు. వీటికి సంబంధించిన తాజా సమాచారం ప్రభుత్వం వద్ద ఇప్పటివరకు లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అసైన్డ్ భూముల లెక్కలు తేల్చాలని సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం ఎంజాయ్‌మెంట్(అనుభవదారు) సర్వే చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. సర్వే అనంతరం అసైన్డ్ భూములన్నింటికీ జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) మ్యాపింగ్ చేయాలని నిర్దేశించింది. ప్రక్రియనంతా డిసెంబరు 8లోగా పూర్తి చేయాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. అసైన్డ్ భూముల సర్వే కోసం రంగారెడ్డి జిల్లాలో 620 మందిని నియమించి.. వారికి శిక్షణ ఇస్తోంది. వారంతా క్షేత్రస్థాయికి వెళ్లి అసైన్డ్ లబ్ధిదారుల పూర్తి వివరాలు తెలుసుకోనున్నారు. అసైన్డ్ లబ్ధిదారులందరికీ భూదార్ కార్డులు జారీ చేసేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కానీ, పేదల నుంచి అసైన్డ్ భూములను కొల్లగొట్టిన వారి వివరాలు తేల్చేందుకే సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



### రూ.వేల కోట్ల భూములు అన్యాక్రాంతం..

హైదరాబాద్ నగర శివార్లలో వేల కోట్ల రూపాయల విలువైన వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. రంగారెడ్డి జిల్లాలో అధికారుల వద్ద ఉన్న లెక్కల ప్రకారం 1.35 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను గతంలో వివిధ దశల్లో పేదలకు పంపిణీ చేశారు. ఇందులో 1.20 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అంచనా. సుమారు 15 వేల ఎకరాలు కనిపించడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. తాజాగా జరుగుతున్న ఎంజాయ్‌మెంట్ సర్వేలో వాస్తవ పరిస్థితి వెల్లడయ్యే అవకాశం ఉంది. వాస్తవానికి 2005-07 ప్రాంతంలో రంగారెడ్డి జిల్లాలో అసైన్డ్ భూములపై సర్వే జరిగింది. అప్పట్లో దాదాపు 7వేల ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనట్లు గుర్తించిన అధికారులు.. కొన్నింటిని పీవోటీ కింద నోటీసులిచ్చి వెనక్కి తీసుకున్నారు. తరువాత మళ్లీ వీటి గురించి పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికీ నగర శివార్లలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటి విలువ రూ.వేల కోట్లలోనే ఉంటుంది. బడా బడా వ్యక్తులు ఈ భూములను కొల్లగొట్టి వెంచర్లు వేసి అమ్మేశారు. కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు కూడా వందల ఎకరాల్లో అసైన్డ్ భూములను చెరబట్టాయన్న ఆరోపణలున్నాయి.

### ఆక్రమణలపై సర్కారు నిర్ణయమేంటి?

పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురైన అసైన్డ్ భూముల వివరాలు మరికొద్ది రోజుల్లో బయటకు వచ్చే అవకాశం ఉండడంతో.. వీటి విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చట్ట ప్రకారమైతే.. చేతులు మారిన ఈ భూములను మళ్లీ అసైన్డ్ లబ్ధిదారులకే అప్పగించాలి. ప్రస్తుతం అనుభవిస్తున్న వారు పేదలైతే.. వారి పేరును రికార్డుల్లోకి ఎక్కించాలని గతంలో బీఆర్ఎస్ సర్కారు నిర్ణయించింది. కానీ, ఇది ఆచరణకు నోచుకోలేదు. ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటుందా? లేక వారి నుంచి కొంత రుసుము వసూలు చేసి క్రమబద్ధీకరిస్తుందా? అనేది తెలియాల్సి ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. అసైన్డ్, పోడు భూములపై పేదలకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఇపుడు అసైన్డ్ భూముల ఎంజాయ్‌మెంట్ సర్వే జరుగుతుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హామీ నెరవేర్చే దిశగా అడుగులు వేస్తుందా.. అనే చర్చ సాగుతోంది. పొరుగు రాష్ట్రాల్లో అసైన్డ్ లబ్ధిదారులకు కొన్నేళ్లు భూములు అనుభవించిన తరువాత పూర్తి హక్కులు కల్పిస్తున్నారు. ఇపుడు తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏదైనా కీలక నిర్ణయం తీసుకుంటుందా? అనే చర్చ జరుగుతోంది.

## ఆల్మట్టి ఎత్తు పెంపునకు వ్యతిరేకం

» సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తాం

» కేసీఆర్, హరీశ్‌ది చిల్లర రాజకీయం

» మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హుజూర్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపును తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తేల్చి చెప్పారు. సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సీనియర్ న్యాయవాదులతో వాదిస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రముఖ న్యాయవాదులతో కలిసి సోమవారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళుతున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు. హుజూర్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆల్మట్టి ప్రాజెక్టు సమీపంలో భూసేకరణకు కర్ణాటక ప్రభుత్వం ప్రయత్నాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణకు అన్యాయం చేసిన కేసీఆర్, హరీశ్ రావు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లేందుకు చేస్తున్న చిల్లర రాజకీయం మానుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ నాయకులే డిజైన్ చేసి.. నాశనం చేశారని ఉత్తమ్ ధ్వజమెత్తారు. కాగా, అంతకు ముందు చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పనులను, దొండపాడు వద్ద రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పనుల పురోగతిని మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. కృష్ణానదిలో చేపలు పడుతున్న జాలర్లతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు.

## తగ్గనున్న పాలు, నెయ్యి ధరలు

హైదరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలు, వెన్న, నెయ్యి ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం సిఫారసుల మేరకు తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ (టీజీడీడీసీఎఫ్) పాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపును అమల్లోకి తేనుంది. దీంతో నెయ్యి, వెన్న, పనీర్, యూహెచ్‌టీ పాల ధరలు గణనీయంగా తగ్గుతాయి. నెయ్యి, వెన్న, చీజ్, నమకిన్ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న జీఎస్టీ 12% నుంచి ఐదు శాతానికి తగ్గించనున్నట్లు తెలిపింది. అలాగే ఇన్‌స్టంట్ మిక్స్‌లు, చాక్లెట్లు, కుకీలపై జీఎస్టీ 18% నుంచి 5%కి తగ్గించనున్నట్లు టీజీడీడీసీఎఫ్ వెల్లడించింది. ఇక పనీర్, యూహెచ్‌టీ పాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్లు కొత్త ధరలతో ఉత్పత్తులు విక్రయించాలని ఫెడరేషన్ ఆదేశాలు జారీ చేసింది.

| | పాత ధర | కొత్త ధర |
|---|---|---|
| నెయ్యి (లీటర్) | రూ.690 | రూ.650 |
| వెన్న(500గ్రా) | రూ.295 | రూ.275 |
| పనీర్(500గ్రా) | రూ.250 | రూ.240 |
| యూహెచ్‌టీ పాలు(లీటర్) | రూ.67 | రూ.65 |

## తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

# పామాయిల్ సాగు లక్ష్యం 10 లక్షల ఎకరాలు

## తెలంగాణ ఆయిల్‌ఫెడ్ దీర్ఘకాలిక ప్రణాళిక.. ప్రస్తుతం 2.70 లక్షల ఎకరాలకు చేరిన సాగు విస్తీర్ణం

### నర్మెట్టలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో దూకుడు.. పామాయిల్ సాగుకు హబ్‌గా తెలంగాణ: మంత్రి తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేట, అప్పారావుపేట ప్రాంతాలకే పరిమితమైన పామాయిల్ సాగు... ఇప్పుడు రాష్ట్రమంతటా విస్తరిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తీర్ణం 2.70 లక్షల ఎకరాలకు చేరగా... రాబోయే మూడేళ్లలో 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ సాగు విస్తీర్ణం పెంపు, ఫ్యాక్టరీల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రూ.300కోట్లతో సిద్దిపేట జిల్లా నర్మెట్టలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేశారు. గంటకు 30 టన్నుల నుంచి 120 టన్నుల పామాయిల్ గెలలను ప్రాసెసింగ్ చేసే సామర్థ్యంతో ఫ్యాక్టరీని నిర్మించారు. ఇక్కడ నూనె గింజల పిప్పి నుంచి బయో పవర్ ప్లాంటును 4మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయటానికి ప్రణాళిక సిద్ధం చేశారు. తాజాగా మంత్రి తుమ్మల.. ఈ ఫ్యాక్టరీని సందర్శించారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు మంత్రి తుమ్మల ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఎన్టీఆర్ హయాంలో సాగుకు శ్రీకారం

పామాయిల్ సాగుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావే తొలుత శ్రీకారం చుట్టారు. ఖమ్మం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో తొలి మొక్కను నాటించారు. ఆ తర్వాత అప్పారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీని నెలకొల్పారు. దీంతో రైతుల్లో ఉత్సాహం పెరిగింది. తుమ్మల ప్రత్యేక శ్రద్ధ, ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఆ ప్రాంత రైతులు పామాయిల్ సాగువైపు మళ్లారు. క్రమక్రమంగా సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం ఒక్క కొత్తగూడెం జిల్లాలోనే 60వేల ఎకరాల్లో రైతులు పామాయిల్ సాగు చేస్తున్నారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల.. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగుకు క్యాబినెట్ ఆమోదం తెలిపేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయిల్‌ఫెడ్‌కు దిశానిర్దేశం చేస్తూ, రైతులకు అవగాహన కల్పిస్తూ, ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు.



సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్మించిన కొత్త పామాయిల్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న తుమ్మల

### టన్ను గెలల ధర రూ.25వేలు ఉండాల్సిందే!

నిరుడు పామాయిల్ గెలల ధర టన్నుకు రూ.24 వేలు పలికింది. దీంతో రైతులకు మంచి ఆదాయం వచ్చింది. కేంద్ర ప్రభుత్వం వంటనూనెల దిగుమతిపై సుంకం తగ్గించటంతో పరిస్థితి తారుమారైంది. దేశీయంగా పామాయిల్ గెలల ధరలు తగ్గాయి. దిగుమతి సుంకం పెంచటంతో పాటు సాగు ఖర్చు, నూనె సేకరణ నిష్పత్తి (ఓఈఆర్) ప్రకారం ధరలు ఉండాలని తుమ్మల కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిశారు. పామాయిల్ రైతులకు మేలు జరగాలంటే గిట్టుబాటు ధర ఉండాలని, విదేశాల నుంచి దిగుమతి అయ్యే పామాయిల్‌పై సుంకం పెంచాలని కోరారు. టన్ను గెలలకు గిట్టుబాటు ధర రూ.25 వేలు ఉండాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

### నర్మెట్ట ఫ్యాక్టరీ.. గేమ్ ఛేంజర్: తుమ్మల

పామాయిల్ సాగులో దేశానికి తెలంగాణ హబ్‌గా మారుతుందని మంత్రి తుమ్మల అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 10 లక్షల ఎకరాలకు చేరుతుందన్నారు. పామాయిల్ సాగుతో రైతు రాజుగా మారతాడన్నారు. నర్మెట్ట పామాయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీ గేమ్ ఛేంజర్‌గా మారుతుందని, దీని ఆధారంగా దేశవ్యాప్తంగా గెలల ధరలు నిర్ణయించే రోజులు వస్తాయని చెప్పారు. నిరుడు దేశవ్యాప్తంగా 1.38 లక్షల కోట్ల విలువైన వంట నూనెలు దిగుమతి చేసుకుంటే.. అందులో 59 శాతం వాటా పామాయిల్‌దేనని తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి పెరగకపోవటంతో 160లక్షల టన్నుల వంట నూనెలు దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. మన దేశంలో 22 రాష్ట్రాల్లో 27 లక్షల హెక్టార్లలో సాగుకు అనుకూల వాతావరణం ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయని తెలిపారు.

# బరిలోకి వైఎస్ భారతి!

## వైసీపీ ముఖ్య నేతలతో మాటామంతీ.. పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధ్యక్షుడు జగన్ సతీమణి భారతి ఇప్పటి వరకూ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. బహిరంగంగా పార్టీ నేతలతో మాట్లాడటం, చర్చలు జరపడం ఎప్పుడూ లేదు. 2012లో జగన్ అరెస్ట్ అయినప్పుడు, 2019 ఎన్నికల సమయంలో మాత్రం ఆమె సొంతగడ్డలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పులివెందులలో బంధువర్గం, పార్టీ ముఖ్యనేతలతో ఎప్పుడన్నా ఒకసారి మాట కలిపేవారు. మిగతా 'బిజినెస్' వ్యవహారాలు తప్ప రాజకీయాల గురించి ఆమె పార్టీ నేతలతో చర్చించిన దాఖలాలు లేవు. కానీ గత కొద్ది రోజులుగా భారతి యాక్టివ్ అయిపోయారు. పార్టీ నాయకులతో మాటలు కలుపుతున్నారు. ఎక్కడ ఏం జరుగుతోంది? పార్టీలో ఎవరెవరు ఏం చేస్తున్నారు? మనం ఏమి చేయాలంటూ ఆమె ఆరా తీస్తున్నారు. భారతి 'సడెన్ ఎంట్రీ' ఆ పార్టీలో కలకలం రేపుతోంది. 'బిజినెస్' వ్యవహారాల్లో ఆమె అత్యంత జాగ్రత్తగా ఉన్నట్టుగా, ఇప్పుడు పార్టీ నేతలతో సంప్రదింపుల్లో ఆ నియమాలే పాటిస్తున్నట్లు కనిపిస్తోంది. వైఎస్ జగన్ స్వయంగా చెప్పినట్లుగా ఆయనకు సెల్‌ఫోన్ లేదు. భారతి దగ్గర కూడా సెల్‌ఫోన్ ఉంటుందో లేదో తెలియదు కానీ.. మూడు రకాల పద్ధతుల్లో పార్టీ నేతలతో మంతనాలు సాగిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. బాగా ప్రముఖులైన పార్టీ నాయకులతో ఆమె నేరుగా మాట్లాడుతున్నారు. ఫోన్‌లోనూ మాట్లాడుతున్నారు. కానీ తన ఫోన్ నుంచి మాత్రం కాదు. జగన్ కుటుంబానికి నమ్మినబంటుగా ఉంటు మద్యం కేసులో చిక్కుకున్న ఓ రిటైర్డ్ మధ్య స్థాయి అధికారి ఫోన్ నుంచే ఆమె పెద్ద లీడర్లతో మాట్లాడుతున్నారు. అదే పార్టీలో మధ్యస్థాయి నేతలతో సంప్రదించాల్సి వచ్చినప్పుడు మరో పంథా అనుసరిస్తున్నారు. ఎవరో ఒక నాయకుడిని తన వద్దకు పిలిచి.. 'మేడం గారు ఇక్కడే ఉన్నారు. మీతో ఇలా చెప్పమన్నారు' అని మాట్లాడిస్తున్నారు. అవసరమైతే ఆమె కూడా మాట్లాడుతారు. మరీ కింది స్థాయి వారయితే, ఆ పార్టీ జిల్లా నేతలు వెళ్లి ఆమె తరఫున వారితో మాట్లాడుతున్నారు. కొందరు వైసీపీ నేతల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. ఆమె ప్రస్తుతానికి వైసీపీ అంతర్గత వ్యవహారాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చిస్తున్నట్లు చెబుతున్నారు.

### భారతి పాత్రపై చర్చ

మరోవైపు లిక్కర్ కేసులో జగన్ అరెస్ట్ తప్పదా? అంటూ రకరకాల ఊహాగానాలు, ప్రచారాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి కదలికా లేదు. కానీ జగన్, ఆయన శిబిరం మాత్రం ఒకవేళ అరెస్ట్ చేస్తే అప్పుడు ఏం చేయాలనే ఆలోచన కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతి ఎంట్రీ చర్చనీయాంశంగా మారింది. ఆమె నేరుగా పార్టీ క్రియాశీల కార్యకలాపాల్లోకి దిగితే పరిణామాలు ఎలా ఉంటాయన్న చర్చకూడా వైసీపీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే, ఇప్పటి వరకు ఆమె అతికొద్దిమందితోనే మాట్లాడారని తెలుస్తోంది. సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకుంటూ, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిసింది.

*Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.*